నెపోలియన్
రూ|| 180/-
పేజీలు: 190

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్' ఏర్పాటులో.. ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్రే కీలకం
దేశ నేర రాజధానిగా బీహార్
ఎఫ్‌–35 యుద్ధ విమానానికి మరమ్మతులు
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 217 | సోమవారం | 07-07-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

రాష్ట్రంలో ఐదురోజులు

## భారీ నుంచి అతిభారీ వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, తరువాయి 2లో



పాశమైలారం ఘటన...

## 42కు చేరిన మృతులు

లభించని మరో 8 మంది ఆచూకీ

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో మతుల సంఖ్య 42కు చేరింది. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడుతో పాటు మరొకరు మృతిచెందారు. ఈ ఘటనలో మరో 8 మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ తరువాయి 2లో





02
పోక్సో చట్టం ఒక మైలురాయి
- పిల్లల రక్షణలో పునరావాసం కీలక పాత్ర
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్



05
న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను కాపాడండి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ హితవు
- బాంబే హైకోర్టు సన్మాన కార్యక్రమంలో సందేశం

# సొంతింటి కల నెరవేరుస్తున్నాం

- పేదలు ఆత్మ గౌరవంతో జీవించాలి
- పారదర్శకంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ
- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ మధిర



పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని ప్రతి పేదవాడు సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించి మధిర ట్యాంక్‌బండ్ వద్ద రూ. 6.45 కోట్లతో చేపట్టిన పర్యాటక సౌకర్యాల కల్పన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ తరువాయి 2లో

చెంచులకు 13,266

## ఇందిరమ్మ ఇండ్లు

- సచ్యురేషన్ పద్ధతిలో మంజూరు చేస్తున్నాం
- నేడు మున్ననూర్‌లో పత్రాలు అందజేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) పరిధిలోని 21 నియోజకవర్గాలలో సచ్యురేషన్ పద్ధతిలో 13,266 చెంచు కుటుంబాలకు 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం కూడా చెంచులకు పక్కా గృహాలను ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన చెంచులు దశాబ్దాల పాటు సొంత ఇండ్లకు నోచుకోలేదని, వారి సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి సూచనలు, సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో భాగంగా సోమవారం నాడు అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో స్థానిక ఎంఎల్‌ఎ డాక్టర్ వంశీకృష్ణతో కలిసి చెంచులకు 'ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను' స్వయంగా తానే అందజేస్తానని పేర్కొన్నారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని. వీరు అడవుల్లో తరువాయి 2లో

పని ప్రదేశంలో మహిళలపై..

## లైంగిక వేధింపులు తిప్పికొట్టాలి

- ధైర్యంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదే
- 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ' సదస్సులో వక్తలు




ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై మహిళా ఉద్యోగులు అవగాహనను పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో, పని ప్రదేశాలలో వారిపై జరుగుతున్న లైంగిక వైధింపులను తిప్పకొట్టాలని పలువురు వక్తలు అన్నారు. పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగులు ధైర్యంగా పనిచేసే పరిస్థితులను, వాతావరణాన్ని కల్పించే బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉందన్నారు. రాజ్యాంగం, చట్టాల ప్రకారం ప్రజలందరికీ సమాన హక్కులు ఉన్నాయని, ఎవరి పరిమితుల్లో వారు ఉండాలని, సమాజంలో ఎవరిని అవమానించే హక్కు ఎవరికీ లేదని వక్తలు స్పష్టం చేశారు. 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ' అంశంపై సదస్సు ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐబిఇయు– ఎపి, టిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. సదస్సుకు ఐబిఇయు (ఎపి, టిఎస్) చైర్మన్ కె.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బిఎస్. రాంబాబు, ఇండియన్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణీష్ కుమార్, ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఐబిఇయు (ఎపి, టిఎస్) ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, ఇండియన్ బ్యాంక్ మల్కాజ్‌గిరి జోనల్ మేనేజర్ స్వర్ణ ప్రవసుందరే, ఎపిటిబిఇఎఫ్ మహిళా విభాగం కన్వీనర్ కె.వి.స్వాతి, ఐబిఇయు (ఎపి,టిఎస్) మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలని అవగాహన గోడపత్రికను వారు ఆవిష్కరించారు. సదస్సును బి.ఎస్.రాంబాబు ప్రారంభిస్తూ బ్యాంకింగ్ రంగంలో లైంగిక వైధింపులు లేకుండా మహిళా ఉద్యోగులకు ఎఐబిఇఎ వెన్నుదన్నుగా నిలబడుతుందన్నారు. మహిళా ఉద్యోగుల హక్కులు, భద్రత అంశాలను ఎఐబిఇఎ బ్యాంకింగ్ యాజమాన్యాల వద్ద ప్రధాన అంశంగా చర్చించి వారికి అనేక రక్షణలను వేతన ఒప్పందాలలో పొందుపర్చినట్లు వివరించారు. బ్యాంకులలో మహిళా ఉద్యోగులకు గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు బ్యాంకుల యాజమాన్యాలతో పాటు ఎఐబిఇఎ కూడా కృషి చేస్తుందన్నారు. జాతీయ బ్యాంకులలో ఉన్న రూ.210 లక్షల కోట్ల సంపదపై ప్రైవేటు, కార్పొరేట్, పెట్టుబడీదారుల కన్ను పడిందన్నారు. ఈ నేపథ్యంలో అనేక పోరాటాలు చేసి సాధించుకున్న బ్యాంకుల జాతీయకరణను, బ్యాంకింగ్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బ్యాంకింగ్ రంగంపై జరుగుతున్న దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ ప్రైవేటు రంగం చేతుల్లో పడితే దేశం, ప్రజలు, ఉద్యోగుల పరిస్థితి అధోగతి పాలవుతుందన్నారు. బ్యాంకులు ప్రభుత్వ రంగంలో ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని, అందుకు అనుగుణంగా బ్యాంకుల అధికారులు, ఉద్యోగుల యూనియన్ పనిచేస్తేనే ఉద్యోగులకు తరువాయి 2లో



## దళారులను నమ్మొద్దు

- పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక
- దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగానే జరిగిందని, దశలవారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందిరమ్మఇళ్ల తొలివిడతలో భాగంగా లబ్ధిదారులకు హక్కుపత్రాలు, నిర్వాసితులకు ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. తాము ఇళ్ళిప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు వెంటనే పోలీస్ కేసులు పెట్టాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి మాటిచ్చారని, ఇక్కడే ముగ్గురు మంత్రులు ఉండటంతో అనుకున్నట్లుగా అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుందని, ఉద్యోగులకు కూడా హెచ్‌ఆర్‌ఎస్ పెరుగుతుందని, అదే విధంగా ట్యాక్స్‌లు పెరుగుతాయని ప్రజలు భయపడుతున్నారని, ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెరిగే ప్రసక్తే లేదన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రజలకు మేలు చేసేందుకు కలిసిమెలిసి పనిచేద్దామని అనడంతో ఇప్పుడే కాదు రాబోయే రోజుల్లో సైతం కలిసిమెలిసే ఉంటామని మంత్రి అనడంతో సభాప్రాంగణంలో నవ్వులు పూశాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో కొన్ని సమస్యలున్నాయని, వాటిని మంత్రి పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో చొరవచూపాలని, బిపిఎల్ కోటా క్రింది సాధరణ ధరలకు వారికి స్థలాలు కేటాయిస్తే మేలన్నారు. ఒకే ఇంట్లో తరువాయి 2లో

జమిలి ఎన్నికల బిల్లులో ఇసికి

## అడ్డూ అదుపూలేని అధికారాలు ఎలా ఇస్తారు?

జెపిసికి అభిప్రాయ సేకరణలో నిలదీసిన చంద్రచూడ్



**న్యూఢిల్లీ :** దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ బిల్లులో కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన అధికారాలను భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రశ్నించారు. ఈ మేరకు తన అభిప్రాయాలను కమిటీకి సమర్పించారు. ఈ బిల్లుపై అభిప్రాయసేకరణలో భాగంగా సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తన అభిప్రాయాలను సమర్పించారు. ఐదేళ్ళ పాలనాకాలానికి గాను ఎన్నుకున్న అసెంబ్లీల కాలపరిమితికి విరుద్ధంగా వాటిని రద్దు చేసేందుకు లేదా పొడిగించేందుకు ఎన్నికల సంఘానికి అడ్డూ అదుపూలేని అధికారాలు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ఐదేళ్ళ గడువుకు విరుద్ధంగా చట్టసభ పదవీకాలాన్ని పొడిగించడం సాధ్యం కాదని చంద్రచూడ్ పేర్కొన్నారు. ఇ.సికి కొన్ని మార్గదర్శక సూత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తరువాయి 2లో

కుంగే బ్యారేజీలకు

## నీళ్లు ఎత్తిపోయాలా?

- గోబెల్స్‌కు మించి అబద్ధాలు ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటైంది
- తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిస్తే.. బిఆర్‌ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారు
- కాళేశ్వరం, కల్వకుర్తి అంటూ అన్నదాతలను మోసంచేసే పనిలో పడ్డారు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం



ప్రజా పక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రైతులను నిరంతరం మోసం చేస్తూ, వారిని ఆందోళనకు గురి చేయడమే లక్ష్యంగా బిఆర్‌ఎస్ కుట్రపూరితమైన అబద్ధాలతో విష ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుంగే బ్యారేజీలకు నీళ్ల ఎత్తిపోయాలా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీష్‌రావుకు గోబెల్స్‌కు మించి అబద్ధాలను ప్రచారం చేయటం అలవాటైపోయిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిస్తే ఓర్వలేని గుణం బిఆర్‌ఎస్ నాయకులదన్నారు. ఇప్పుడు కాళేశ్వరం, కల్వకుర్తి అంటూ రైతులను మోసం చేసే పనిలో పడ్డారన్నారు. రైతులను ఆదుకునే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానిది కాగా, ప్రతి పంట సీజన్‌లోనూ రైతులను ఆందోళనకు గురిచేసి, గందరగోళ పరిచే దుర్బుద్ధి బిఆర్‌ఎస్ నేతలదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని సాధించిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాధ్యమైందన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో చేసిన తప్పులు, దుర్మార్గాలకు ప్రజలకు క్షమాపణలు తరువాయి 12లో

## గొంతు కోసి ఐదేళ్ల బాలిక దారుణ హత్య

జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన

ప్రజాపక్షం/కోరుట్ల



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లోని ఆకుల రాములు–నవీన దంపతుల ఐదేళ్ల కుమార్తెను గొంతుకోసి అతి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళ్లితే... శనివారం రోజున సాయంత్రం సమయంలో హితిక్ష ఆడుకునేందుకు ఇంటినుంచి బయటకు వెళ్లిన బాలిక కనబడకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు చుట్టుపక్కలు ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే అదే కాలనీలోని తరువాయి 12లో

## ఎలాన్ మస్క్ కొత్త పార్టీ

- 'అమెరికన్ పార్టీ'గా ఆవిర్భావం!
- వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికల నాటికి ఆచరణలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది
- ప్రాథమికంగా కేవలం కొంతమందిపైనే దృష్టి
- 'ఎక్స్' వేదికగా మస్క్ ప్రకటన



**న్యూయార్క్ :** ద్వంద్వపార్టీల వ్యవస్థకు పేరుగాంచిన అమెరికా ప్రజాస్వామ్యంలో ఇప్పుడు అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కొత్త పార్టీ ఆవిర్భవించింది. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికల నాటికి తన "అమెరికన్ పార్టీ" ఆచరణలో క్రియాశీల రాజకీయశక్తిగా పాత్ర పోషిస్తుందని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు. ప్రాథమికంగా తమ పార్టీ కేవలం కొంతమందిపై మాత్రమే దృష్టిపెట్టి ప్రతినిధులసభ–సెనేట్ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. గడచిన 100 సంవత్సరాల అమెరికా చరిత్రలో మూడో రాజకీయపార్టీ ఆవిర్భావానికి జరిగిన ప్రయత్నాలు పెద్దగా విజయం సాధించలేదు. రిపబ్లికన్లు, డెమోక్రాట్లను ముందుగా హెచ్చరించిన విధంగానే, కొత్త రాజకీయపార్టీ ఏర్పాటు చేసినట్లు ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఐతే తన పార్టీని ఎక్కడ రిజిస్టర్ చేశారన్న విషయాన్ని ఆయన చెప్పలేదు. ఒక పార్టీ ఆవిర్భవించాలంటే చట్టబద్ధంగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ (ఎఫ్ఇసి) వద్ద రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇటీవలి ఎఫ్ఇసి సమాచారం ప్రకారం ఎలాంటిపార్టీ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ దాడుల్లో 33 మంది మృతి

**డెర్ అల్ బలాహ్ :** గాజాలో ఆదివారంనాడు ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో 33 మంది పాలస్తీనియన్లు మరణించారు. 100 లక్ష్యాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసినట్లు గాజా ఆసుపత్రి అధికారులు తెలియజేశారు. గాజా సిటీలో రెండు నివాసిత ప్రాంతాలపై చేసిన దాడుల్లో 20 మంది మరణించగా, మరో 25 మంది గాయపడ్డారని



సెఫా ఆసుపత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సెల్మియా చెప్పారు. దక్షిణగాజాలో మువాసీలో చేసిన దాడుల్లో 13 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ విధంగా నివాసిత ప్రాంతాలపై దాడుల గురించి ఐ డి ఎఫ్ ఎలాంటి వ్యాఖ్యలూ చేయ లేదు. గడచిన 24 గంటల్లో 130 లక్ష్యాలపై ఐడిఎఫ్ దాడులు చేసింది.

# బందీలు—ఖైదీల మార్పిడిపై చర్చలు

### దోహాకు ఇజ్రాయెల్ ప్రతినిధి బృందం

**టెల్‌అవీవ్ :** గాజాలో పరిస్థితులను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఒక కీలక ప్రక్రియ ప్రారంభమైంది. బందీలు—ఖైదీల పరస్పర మార్పిడికి సంబంధించి మధ్యవర్తి దేశం ఖతార్ ఏర్పాటు చేసిన చర్చల్లో పాల్గొనేందుకు ఒక బృందాన్ని దోహాకు పంపాలని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ ఆదివారంనాడు నిర్ణయించారు. చర్చలకు వెళ్ళేందుకు ఆహ్వానాన్ని సమ్మతించామనీ, కానీ హమాస్ చేస్తున్న డిమాండ్లు ఎంతమాత్రం సమ్మతింపరానివిగా ఉన్నాయని ఇజ్రాయెల్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి. అంతర్గతంగా ప్రజలనుండి వస్తున్న తీవ్ర ఒత్తిడిని ప్రభుత్వం తట్టుకోలేకపోతున్నది. గాజాలో హమాస్ పరిపాలనను పూర్తిగా నిర్మూలించిన తర్వాతే శాశ్వత శాంతి ఒప్పందం జరగాలని ఇజ్రాయెల్ కోరుకుంటున్నది. గాజాలో హమాస్ పరిపాలన కొనసాగించేవిధంగా శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ సుముఖంగా లేదు. ఈ పరిస్థితుల్లో రెండో విడత 60 రోజుల కాల్పుల విరమణకు, బందీలు,ఖైదీల పరస్పర మార్పిడికి మధ్యవర్తుల ప్రభావం కారణంగా చర్చలకు రంగం సిద్ధమవుతోంది.

చర్చలకు ఇప్పటికిప్పుడే సిద్ధంగా ఉన్నామని శనివారం నాడు హమాస్ ప్రకటించడంతో ఇజ్రాయెల్ ప్రజలు వేలాదిమంది దేశవ్యాప్తంగా గతరాత్రి పొద్దుపోయాక వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేశారు. వాయిదా పద్ధతుల





ప్రస్తావన లేకుండా బందీలందరి విడుదలకు హమాస్‌తో సమగ్ర ఒప్పందం చేసుకోవాలని బందీల కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, సామాన్య ప్రజలు డిమాండ్ చేశారు. టెల్‌అవీవ్ నగరం హోస్టేజస్ స్క్వేర్ వద్ద భారీ ప్రదర్శన,బహిరంగ సభ జరిగింది. బందీల కుటుంబీకులు మాట్లాడుతూ తమ బిడ్డలను విడుదల చేసేందుకు తక్షణం ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. హమాస్ ఉగ్రవాదులవద్ద ఇప్పటికీ ఇంకా 50 మంది బందీలుగా ఉన్నారు. ఐతే వీరిలో 28 మంది మరణించారనీ, కేవలం 20 మంది మాత్రమే సజీవంగా ఉన్నారనీ రూఢీగా తెలిసింది. హమాస్—ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం కుదిరితే విడతల వారీగా 10 మంది సజీవులైన బందీలను, మరో 18 మృతదేహాలను స్వాధీనం చేసేందుకు హమాస్ సుముఖత వ్యక్తం చేసింది. బందీల విడుదలకు హమాస్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా సుముఖంగా ఉన్నప్పటికీ హమాస్ చేస్తున్న మానవసహాయపరమైన డిమాండ్లు ఆయనకు నచ్చడంలేదు. హమాస్ చేస్తున్న డిమాండ్లను "సమ్మతింరానివి"గా ఆయన తిరస్కరిస్తున్నారు. గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యం ఖాళీచేసి వెళ్ళిపోవాలని, శాశ్వతంగా గాజాలో యుద్ధం ఆగిపోవాలని, ఐక్యరాజ్యసమితి, దాని భాగస్వామ్య సంస్థల అధీనంలో మాత్రమే పాలస్తినా ప్రజలకు ఆహారం, ఇతర అంతర్జాతీయ మానవతాసహాయాన్ని పంపిణీ చేయాలని హమాస్ కోరుతున్నది. అందుకు నెతన్యాహూ తిరస్కరిస్తున్నారు. ఒప్పందం కుదిరినా కుదరకపోయినా గాజాలో యుద్ధం వెంటనే ఆపేయాలని హమాస్ సంస్థ ప్రధానంగా డిమాండ్ చేస్తున్నది. ఈ విషయాలను శనివారం రాత్రి పొద్దుపోయాక ఇజ్రాయెల్ మంత్రివర్గం కూడా చర్చించింది. ఒకవైపు దోహాకు తన బృందాన్ని పంపిన నెతన్యాహూ మరోవైపు తమకు అనుకూలమైన విధంగా వాతావరణాన్ని, ఒప్పందాలను మార్చుకునేందుకు వీలుగా ఆలోచనలు చేసుకుని ఈ వారంలోనే వాషింగ్టన్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మూడురోజులక్రితం ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా, "గాజా శాంతికి చేరువ అవుతోంది" అని పోస్టింగ్ పెట్టారు. ఇజ్రాయెల్—హమాస్ చర్చలు కోరుకుంటున్నాయని ప్రకటించారు. ఈ వారంలోనే 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరిగే అవకాశం ఉందని కూడా ప్రకటించారు. ఆ తర్వాత హమాస్ కూడా సానుకూల సంకేతాలు ఇచ్చింది.

# ట్రంప్ టారిఫ్‌లపై సర్వత్రా ఉత్కంఠ

### అమెరికా- యూరప్ రెంటికీ తీవ్ర నష్టదాయకం

**ఫ్రాంక్‌ఫర్ట్ :** పెంచిన టారిఫ్‌ల అమలుకు పొడిగించిన గడువుతేదీ జులై తొమ్మిదో తేదీతో ముగుస్తూ ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ ఏర్పడింది. సోమవారంనాడు 12 దేశాలకు టారిఫ్ లేఖలు పంపేందుకు సిద్ధమైనట్లు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అమెరికాలో భారీ ఎత్తున వాణిజ్యం చేస్తున్న దేశాలలో తీవ్ర ఆందోళన రేగింది. ముఖ్యంగా అమెరికా—యూరప్‌లోని దేశాలమధ్య జరిగే వాణిజ్యం ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 2024లో అమెరికా—యూరప్ మధ్య 1.7 ట్రిలియన్ యూరోలు (2 ట్రిలియన్ డాలర్లు) మేరకు వస్తు సేవల వ్యాపారం జరిగింది. సగటున రోజుకు 4.6 బిలియన్ యూరోల వ్యాపారం జరుగుతుంది. ఈ రెండింటి మధ్యా ఏర్పడే ఒడిదొడుకులు అనేక కంపెనీలకు, వినియోగదారులకు అందరికీ నష్టం కలిగిస్తాయి. పెంచిన టారిఫ్‌ల వల్ల ముఖ్యంగా యూరప్ దేశాలకే కాకుండా, అమెరికాకు కూడా తీవ్ర నష్టం కలుగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాతో వ్యాపారం చేస్తున్న యూరప్‌లోని అనేక కంపెనీలు పెంచిన టారిఫ్‌ల గురించే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మొదటివారంలో ట్రంప్ అన్ని యూరప్ దేశాలనుండి అమెరికాకు దిగుమతయ్యే వస్తువు




లపై 20 శాతం దిగుమతి సుంకాలను విధించారు. ఆ తర్వాత అనేక దేశాలు చేసిన విజ్ఞప్తుల మేరకు వీటి అమలును జులై 9 వరకూ వాయిదా వేశారు. కానీ యూరోపియన్ దేశాల బ్లాక్ కూడా పట్టుదలతోనే ఉంది. తాము కూడా ప్రతీకార సుంకాలతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. బీఫ్ దగ్గర నుండి ఆటో ఉత్పత్తుల వరకూ, బీర్ నుండి బోయింగ్ విమానాల వరకూ వందలాది అమెరికన్ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలకు యూరప్ బ్లాక్ సిద్ధంగా ఉంది. ముడి చమురును యూరప్‌కు అమెరికా ప్రధానంగా ఎగుమతి చేస్తుంది. తర్వాత ఫార్మా ఉత్పత్తు, ఎయిర్‌క్రాఫ్ట్, ఆటోమొబైల్స్, మెడికల్, డయాగ్నోస్టిక్ పరికరాలను చాలా ఎక్కువగా యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తుంది. ఐతే యూరప్ దేశాలే చాలా ఎక్కువ వ్యాపారం చేస్తాయి. అమెరికా చేసే వ్యాపారం తక్కువే. ఒకేసారి 10 శాతం దండనాత్మక టారిఫ్‌లు విధించారు. ఇతరదేశాలు తమను దోచుకుంటున్నాయనీ, అమెరికా నుండి ఎగుమతయ్యే వస్తువులపై భారీగా పన్నులు వారు వసూలు చేస్తుంటే, అమెరికాకు దిగుమతయ్యే వస్తువులపై చాలా తక్కువ టారిఫ్‌లతో ప్రపంచదేశాలన్నీ అనేక దశాబ్దాలుగా బాగా లాభపడుతున్నాయని ప్రకటించిన ట్రంప్ ఈ వాణిజ్యలోను భర్తీచేసి అమెరికాను తిరిగి సంపన్నదేశంగా మారుస్తానని శపథం చేశారు. ఇందులోభాగంగానే టారిఫ్‌ల యుద్ధం మొదలైంది. దాదాపు 50 దేశాలు దిగి వచ్చాయని, తమతో బేరసారాలకు వచ్చాయని ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఐతే వాణిజ్య చర్చల్లో యూరోపియన్ యూనియన్ వైఖరిపట్ల ట్రంప్ తీవ్ర ఆసంతృప్తి వ్యక్తం చేశారు. యూరప్ నుండి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై సుంకాలను భారీగా 50 శాతానికి పెంచుతున్నట్లు ఆయన చెప్పారు. ఫ్రెంచ్ చీజ్, ఇటాఇయన్ తోలు వస్తువులు దగ్గర నుండి జర్మనీ ఎలక్ట్రానిక్స్ గూడ్స్, స్పెయిన్ ఫార్మాస్యూటికల్స్ వరకూ అన్ని వస్తువుల ధరలూ ఈ సుంకాలపెంపువల్ల అమెరికాలో పెరిగిపోతాయి. అందువల్ల ఈ సుంకాలవల్ల అమెరికా—యూరప్ రెండింటికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిక చేస్తున్నారు.

# టెక్సాస్‌ను ముంచెత్తిన ప్రమాదకర వరద

### 51కి చేరిన మృతులు

**ఆస్టిన్ :** గడచిన వంద సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేనంత దారుణమైన వరద విలయం అమెరికా టెక్సాస్ హిల్ కౌంటీని ధ్వంసం చేసింది. సహాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు వందలమంది రంగంలోకి దిగారు. ఆకస్మికంగా మొదలైన వర్షాలు, వరద విలయం కొనసాగుతోంది. నదీ పరీవాహకప్రాంతంలో అత్యాధునిక వార్నింగ్ వ్యవస్థలు కొంతకాలంగా పనిచేయకపోవడంవల్ల మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మొదట శుక్రవారం తెల్లారుజామున 12.7 నుండి 17.8 సెంటీమీటర్ల భీకర వర్షం కురిసి ఉంటుందని అధికారులు అంచనావేస్తున్నారు. దీనివల్లే ఈ ప్రాంతంలో వర్షపాతం కొత్తచరిత్ర సృష్టించింది. ఈ వారంలో మరిన్ని భారీ వర్షాలు టెక్సాస్ ప్రాంతంలో పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఒక్క శనివారంనాడే 5 నుండి 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆకస్మికంగా ప్రారంభమైన భారీ వర్షాలు, నిమిషాల వ్యవధిలో అనూహ్యస్థాయిలో పెరిగిన నదీ నీటిమట్టం కారణంగా అడ్డూ అదుపూలేని గ్వాడాలుపే వరద టెక్సాస్‌ను ముంచెత్తడంతో గడచిన మూడు రోజుల్లో ఇప్పటివరకూ 51 మంది మరణించారు. వీరిలో 15 మంది పిల్లలు ఉన్నారు. లెక్కలేనంతమంది గల్లంతయ్యారు. ఒక్క కెర్ కౌంటీలోనే 43 మంది మరణించారు. మరో 29 మంది గల్లంతయ్యారని ఊహిస్తున్నామని, ఎంతమంది జాడ తెలియకుండా వరదలో కొట్టుకుపోయారో ఖచ్చితంగా తెలియని కౌంటీ అధికారులు చెప్పారు. జాడ తెలియకుండాపోయిన నివాసితులకోసం సహాయబృందాలు ముమ్మర గాలింపు చర్యలు ఆపకుండా కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే గ్వాడాలుపే నది ఒడ్డున సమ్మర్ క్యాంప్‌కు వచ్చి వరదలో కొట్టుకుపోయిన 27 మంది బాలికల జాడ ఇంతవరకూ తెలియకపోగా గల్లంతైనవారి సంఖ్య ఇంకా పెరిగింది. గల్లంతైన బాలికలు అందరూ 12 ఏళ్ళ లోపు వయసువారేనని టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నర్ డాన్ పాట్రిక్



చెప్పారు. గల్లంతైనవారికోసం హెలికాప్టర్ల ద్వారా గాలిస్తున్నారు. ఇప్పటివరకూ 850 మందిని వరద ప్రమాదం నుండి కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఈ వరద విలయాన్ని చూసిన శాస్త్రవేత్తలు రాబోయేకాలంలో ప్రపంచవ్యాప్తంగా సంభవించబోయే ప్రకృతి వైపరీత్యాలను తలచుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో ఏటి కేడాది తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయని వారు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గడచిన మూడు రోజులుగా దేశాధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు. సన్నిహితంగా గమనిస్తూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

# ఇరాన్‌లో పేలిన ఇజ్రాయెల్ బాంబులు

### ఇద్దరు ఐఆర్‌జిసి సైనికులు మృతి

**టెహ్రాన్ :** గతనెలలో ఇజ్రాయెల్ చేసిన దాడుల తర్వాత చిందరవందరగా పడిన లైవ్ బాంబులను పేలకుండా నిర్వీర్యం చేసేందుకు జరిగిన ప్రయత్నంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్(ఐఆర్‌జిసి)కు చెందిన ఇద్దరు సైనికులు ఆదివారంనాడు మరణించారు. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలో ఇజ్రాయెల్ జూన్ 13న యుద్ధం ప్రారంభించింది. 12 రోజులు ఈ యుద్ధం జరిగింది. ఇరాన్‌లో పడిన పేలని బాంబులను నిర్వీర్యం చేసి వాటిని తొలగించేందుకు ఐఆర్‌జిసి ప్రయత్నం చేసినప్పుడు ఖొర్రమాబాద్‌లో ఈ మరణాలు సంభవించాయి.



# పోక్సో చట్టం ఒక మైలురాయి : జస్టిస్ విక్రమ్ నాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోక్సో చట్టం ఒక మైలురాయి అని, పిల్లల రక్షణలో పునరావాసం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూరి, సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు మహిళా భద్రతా విభాగం, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ, మహిళా అభివృద్ది శిశు సంక్షేమ శాఖ, యునిసెఫ్ సహకారంతో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన "వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్ హక్కులు లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ"అనే అంశంపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి జస్టిస్ విక్రమ్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూరి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీకి ప్రధాన పోషకుడు జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ పాఠశాల పిల్లలు ఉపాధ్యాయులతో ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఒక నైతిక కథను వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం తరగతి గదిలో విద్యార్థితో ఉపాధ్యాయురాలిగా కాకుండా తల్లిలా ప్రవర్తించాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషి మాట్లాడుతూ.. పిల్లలపై వేధింపులకు సంబంధించిన అన్ని అంశాలను సమావేశంలోని అన్ని సాంకేతిక సెషన్లలో విస్తృతంగా కవర్ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం తరపు హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల పిల్లలకు నాటకాలు, స్కిట్లు, వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా బాలల హక్కుల గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షించడంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలను వివరించారు. యునిసెఫ్ ఇండియాలో చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ సోనీకుట్టి



జార్జ్ మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల నుండి పిల్లలను రక్షించడానికి ముందుకు సాగడానికి వ్యూహం అవసరమన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాసరావు పోక్సో చట్టం కింద నేరాలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమల దేవి ఈడ మాట్లాడుతూ..లైంగిక వేధింపులకు గురైన బాలల హక్కులు, రక్షణ గురించి వివరించారు. తెలంగాణ బాధితుల పరిహార పథకం కింద బాధితులకు సకాలంలో పరిహారం చెల్లించడానికి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ చేసిన కృషిని ఆమె ప్రశంసించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పిల్లలకు భద్రతా స్థలాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ లోని ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి డి. రామకాంత్, హైదరాబాద్‌లోని యునిసెఫ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మురళీ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్, హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలోని ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సుధ, సిఐడి అదనపు డిజి చారుసిన్హాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్లు'

(మొదటి పేజీ తరువాయి)

వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి,వాటిని అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని వివరించారు. చెంచులకు చిన్న చిన్న గుడిసెలు తప్ప పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు కూడా అందని విషయమని, అలాంటి ఆ అడవి ప్రాంతాలను వారు వదిలి బతక లేరని, అందుకే వారు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలోని (10, 836ఇండ్లు) మంచిర్యాల 157, నిర్మల్ 153, ఆసిఫాబాద్ 3371, బోథ్ 163, ఖానాపూర్ 2257, సిర్పూర్ 227, అదిలాబాద్ 2848, బెల్లంపల్లి 223, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 274, ఇండ్లను మంజూరు చేయగా, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్ ( 2156) పరిధిలోని అచ్చంపేట్ 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174, కొల్లాపూర్ 105, కల్వకుర్తి 120, వికారాబాద్ 63, దేవరకద్ర 64, నాగార్జునసాగర్ 17, మొత్తంగా 13,266 ఇండ్లను చెంచులకు మంజూరు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లును మంజూరు చేస్తున్నామని, ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్ల చొప్పున 8750 ఇండ్లను మంజూరు చేసినట్లు వివరించారు. గిరిజన ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## అధికారాలు ఎలా ఇస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించారు. చంద్రచూడ్‌తోపాటు మరో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.కేహార్ కూడా ఈ పార్లమెంటరీ కమిటీ ఎదుట ఈనెల 11న హాజరుకావాల్సి ఉంది. బిజెపి ఎంపి పి.పి.చౌధరి నాయకత్వాన ఈ పార్లమెంటరీ కమిటీ అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నది. 'ఒకే దేశం—ఒకే ఎన్నికలు' ఆలోచనను ఆయన సమర్థించినప్పటికీ ఎన్నికల సంఘానికి ఇచ్చిన ప్రతిపాదిత అధికారాలు, బిల్లులోని అనేక అంశాలపట్ల చంద్రచూడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో మార్పులు చేర్పులు చేసేందుకు అనేక సలహాలు సమర్పించారు. లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడంపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న భయాలను, సంబంధిత విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు చెప్పడాన్ని ఆయన తిరస్కరించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను వేరు వేరుగా నిర్వహించాలని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదని ఆయన అన్నారు. ఐనప్పటికీ కూడా మరో మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఏకీభవించారు. ఎన్నికల సంఘానికి ప్రతిపాదిత బిల్లులో తిరుగులేని అధికారాలను గొగోయ్ ప్రశ్నించారు. చంద్రచూడ్ కూడా ఎన్నికల సంఘానికి తిరుగులేని అధికారాలు ఇవ్వడాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తన విచక్షణను ఉపయోగించడానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శక సూత్రాలు విధించకుండా తిరుగులేని అధికారాలు ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు.

## భారీ నుంచి అతిభారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

## 42కు చేరిన మృతులు

(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు. ప్రమాదం సంభవించి ఏడురోజులైనా కార్మికులను గుర్తించడంలో పురోగతి లేదంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. కాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ధ్రువ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 9 మందిలో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు 40 నుంచి 80 శాతానికిపైగా కాలిన గాయాలతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం భీం రావు అనే కార్మికుడు మృతిచెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్ చౌదరి చనిపోయారు. తాజాగా మరో ఇద్దరు మరణించడంతో మరణాల సంఖ్య 42కి పెరిగింది.

## లైంగిక వేధింపులు తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం జరుగుతుందన్నారు. ప్రణీష్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకులో మంచి పని వాతావరణాన్ని కల్పించామని, మహిళా ఉద్యోగులపై వైధింపులు పూర్తిగా లేకుండా కృషి చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎఫ్‌జిఎం పరిధిలోని 490 ఇండియన్ బ్యాంకు శాఖలు, 8 జోనల్ కార్యాలయాల్లో ఎక్కడా మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మహిళా ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. టి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సమస్యలపై చర్చించడం, ప్రతిఘటించడం ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందు కోసం ఉద్యోగులు చేసే ఉద్యమాలకు ఎఐబిఇఎ మద్దతుగా ఉంటుందన్నారు. స్వర్ణ ప్రవ సందరే మాట్లాడుతూ మహిళలు కేవలం సమస్యలు, లైంగిక వేధింపులకు గురైనప్పుడే కాకుండా అన్ని అంశాలలో మహిళలు ఐక్యంగా ఉండాలన్నారు. మహిళల రక్షణ, భద్రతకు బ్యాంకింగ్ రంగంలో అనేక చట్టాలు, విధానాలు ఉన్నాయని, సమస్యలు వచ్చినప్పుడు వాటి ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. తొలుత సభకు ఐబిఇయుఎపి, టిఎస్ సంయుక్త కార్యదర్శి జి.నల్లపరెడ్డి స్వాగతం పలికారు.

## దళారులను నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రెండుమూడు కుటుంబాలవారు ఉంటున్నారని, స్లాబ్ ఉన్న ఇళ్లకు మరో ఇంటిని ఇచ్చే అవకాశం లేదనే నిబంధన ఉందని, కానీ కొడుకులకు వివాహం అయితే ఈ నిబంధనల వల్ల ఇబ్బంది ఉందని, దీనిని పరిగణలోనికి తీసుకుని వివాహమైన కుమారులుంటే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరీచేయాలన్నారు. ఇది సంగరేణి ఏరియా అని, సింగరేణి భూముల్లో చాలా కాలంగా పేదలు నివాసలు ఏర్పాటు చేసుకుని ఉన్నారని, కొందరు స్థలాలు ఆపుకున్నారని, అలాంటి వారు ఇల్లు నిర్మించుకోవాలంటే క్రమబద్దీకరణ కావాలని అంటున్నారని, అలాంటివారు కూడా ఇందిరమ్మ ఇళ్లను కట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాల్వంచలో జీనెం 76 వలన ప్రతీ సారి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఇది ఇబ్బందిగా మారిందన్నారు. ఎన్నికల వచ్చినప్పుడు దానిని మ్యూట్‌లో పెడుతున్నారని, ఎన్నికల తర్వాత అన్‌మ్యూట్ చేస్తున్నారని చెప్పారు. దీనిపైప్రత్యేక చర్యలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటిని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వేధికపై నుండే హామీ ఇచ్చారు. సభా సమావేశం ప్రారంభానికి ముందు ఎంఎల్ఎ హాజరైన ప్రజల మధ్యలో కలియ తిరుగుతూ అందరినీ అప్యాయంగా పలుకరించి కరచాలనం చేశారు. ముందుగా ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ మేలు చేకూరుతుందని, ఎవ్వరూ ఎలాంటి నిరాశకు గురికావాల్సిన పనిలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలన్నీ విడతల వారిగా అందుతాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, టిపిసిసి సభ్యులు నాగసీతారాములు, కోనేరు చిన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పేదల సొంతింటి కల సాకారం కావాలంటే ఇందిరమ్మ ప్రభుత్వం రావాలని నమ్మి అవకాశం అందించారని ఆయన తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం తొలి విడతలో రూ. 22,500 కోట్లు ఖర్చు చేస్తూ 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. గతంలో చేసిన పాదయాత్రలో ప్రజల బాధలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 93 లక్షల రేషన్‌కార్డు లబ్దిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, రూ. 500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం, నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం చేపట్టామన్నారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ అందించామన్నారు. రెండు లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం పథకం క్రింద ఎకరానికి రూ. 12వేలు అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం క్రింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ ఒక్కొక్క కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మధిర ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన 1544 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి దశల వారీగా ఐదు లక్షల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, టూరిజం ఎస్‌ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, హౌజింగ్ పిడి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా డెయిరీ ఏర్పాటుకు కార్యాచరణ**

మధిర నియోజక వర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించి కార్యాచరణను వేగవంతంగా చేయాలని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆదివారం మధిర క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఇందిరా డెయిరీ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. డెయిరీకి సంబంధించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల పురోగతి వివరాలను డిప్యూటీ సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇందిరా డెయిరీ పథకంలో నిర్దేశించిన పథకం మేరకు పశువుల యూనిట్ గ్రౌండింగ్‌కు కార్యాచరణ అమలు చేయాలన్నారు. ప్రతి లబ్దిదారునికి రెండు గేదెలు అందజేయాలన్నారు. రెండు గేదెలతో పాటు నాలుగు పాడి పశువులకు సరిపడ షెడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరా డెయిరీ సభ్యులకు, అసలు గేదెలు లేని వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాబోయే 20 రోజుల్లో నియోజక వర్గ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఇందిరా డెయిరీ పథకం ప్రారంభం కావాలన్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను కూడా పారదర్శకంగా చేపట్టాలన్నారు. పాడి పశువుల కొనుగోలు బృందంలో ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గేదెల కొనుగోలు కమిటీ పారదర్శకంగా పనిచేయాలని ఎలాంటి అవకతవకలు జరిగిన ఉపేక్షించేది లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవిధంగా గడ్డి సరఫరాకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. యువతకు ఉపాధితో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్‌డిఓ సన్యాసయ్య, ఇడి ఎస్‌ఇ కార్పోరేషన్ నవీన్‌బాబు, మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి పురందర్, విద్యుత్ శాఖ ఎస్‌ఇ శ్రీనివాసాచారి, మధిర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయచంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లోకేష్‌తో కెటిఆర్ రహస్య మంతనాలు

### నేడు అమరవీరుల స్థూపం వద్దకు వస్తే చర్చిద్దాం.. : టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏపి సిఎం చంద్రబాబు కుమారుడు, ఏపి మంత్రి నారా లోకేష్‌తో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. కెటిఆర్, నారా లోకేష్‌లు పలు మార్లు కలిశారని, ఆ రహస్య మంతనాలు ఎవరికి లబ్ది చేయడానికో సమాధానం చెప్పాలని కెటిఆర్‌ను డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను ప్రతిపక్షాలు విస్మరిస్తున్న కెటిఆర్, అన్ని అంశాలపైన సోమవారం అమరవీరుల స్థూపం వద్దకు వస్తే చర్చిద్దామని సవాల్ విసిరారు. కెటిఆర్ సవాల్‌కు తాను సరిపోతానని, సిఎంతో పోట్లాడే స్థాయి లేదని సూచించారు. కెటిఆర్ గతంలో రేవంత్ రెడ్డి అంటే ఎవరో అని అన్నారని, కానీ ప్రస్తుతం రేవంత్ పేరు పక్కన కెటిఆర్ పేరు వస్తే చాలని తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

# బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు
### జిల్లా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మహబూబాబాద్ జిల్లా మహాసభ రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పార్టీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలు అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని బడా బాబుల చేతుల్లో పెట్టి వ్యవసాయ భూములను కార్పోరేట్లకు అప్పగించాలనే కుటిల బుద్ధితో దేశంలో మూడు రైతు చట్టాలను తీసుకువస్తే దేశంలో యావత్ రైతులు ఒకతాటిపైకి వచ్చి కదం తొక్కితే ప్రధాని మోదీ తోక ముడిచి నూతన వ్యవసాయ చట్టాన్ని వెనక్కి తీసుకున్నారన్నారు. అలాగే కార్మికులను కార్పోరేట్ల జీతగాళ్ళుగా మార్చి, కార్మిక హక్కులను కాలరాసే విధానాలను వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, కోట్లాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని ఆయన తెలిపారు. గత కేంద్ర ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టపోయినట్లుగా దేశ ప్రజలు బిజెపికి గుణపాఠం చెప్పారని, సోషలిస్ట్ అని చెప్పుకుంటున్న నితీష్, సెక్యులరిస్ట్ అని చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడు మద్దతుతోనే దేశంలో బిజెపి నిలబడిందని తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. రైతులు, పేదలకు ఇచ్చిన రుణాలను బ్యాంకులు ముక్కు పిండి వసూలు చేస్తున్నాయని, లక్షల కోట్లు రుణాలు తీసుకుని బ్యాంకులను మోసం చేసి దేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, లలిత్ మోడీ లాంటి బడా బాబులను వదిలేసి పేదలను రాక్షసుల్లా పీడిస్తున్నారని ఆయన విమర్శించారు. అటవీ సంపద దోచుకోవాలనే దుష్ట ఆలోచనతో దొంగ ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టులను అంతం చేస్తామని ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటోందని బిజెపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చి హామీలు నెరవేర్చడంలో విఫలమవుతోందని, రైతుల రుణ మాఫీ అనేక కారణాలతో కొద్దిమందికి మాత్రమే మాఫీ అయిందని పూర్తిగా అమలు కాలేదన్నారు. అలాగే రూ.15 వేలు రైతు భరోసా గత ఎండాకాలంలోనే ఇస్తామని చెప్పిన అధికార కాంగ్రెస్ పార్టీ నేటికీ అది అమలు కాలేదన్నారు. పేదల సమస్యలు పరిష్కరించని పక్షంలో అధికా కాంగ్రెస్ నైనా వదిలిపెట్టేది లేదని అన్నారు. పేదలకు అన్యాయం జరిగితే సిపిఐ చూస్తూ ఊరుకోదని, ఎంతటి వారినైనా ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాలో నిరంతరం పేదల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటం చేస్తున్న చరిత్ర సిపిఐకి ఉందని, కురవిలో జరుగుతున్న జిల్లా మూడవ మహాసభల్లో సరైన నిర్ణయాలు తీసుకుని భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ప్రతినిధుల మహాసభలో తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు సిపిఐ సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి స్వాగతోపాన్యాసం చేయగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. రేషపల్లి నవీన్, తుర్క రమేష్, మామిండ్ల సాంబలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ప్రతినిధుల సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరావు, కట్టెబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరావు, కరణం రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, బాలకృష్ణ, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, పాండురంగాచారి పాల్గొన్నారు.

# 'ఎర్రపార్టీల' అంతం ఆలోచనలను విరమించుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం "ఎర్రజెండా పార్టీలను" అంతం చేయాలనే ఆలోచలను తక్షణమే విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజున నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో జరిగిన 4వ సిపిఐ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆపరేషన్ కగార్" ప్రకటన కేంద్రం ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పట్ల అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర ఆందోళనను తెలియజేస్తోందని శంకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవాలను జరుపుకుంటోందని, 1925లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో సిపిఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. దేశంలోని 32 రాష్ట్రాలలో పేదల పక్షాన, కార్మికుల పక్షాన వారి సమస్యల సాధన కోసం సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యాపారస్తులకు అప్పగించి, ప్రజలను నిరుద్యోగులను చేస్తున్నారని కలవేని శంకర్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. నిర్మల్ జిల్లాలోని 1000 ఊడలమర్రి, రాంజీగోండు చరిత్ర గల గడ్డను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అక్కడే కొనసాగించాలని, డిప్యుటేషన్‌పై పంపకూడదని కోరారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలని, లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలను కూడా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని సూచించారు. ఈ మహాసభలో సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి, భుక్య రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రవి, పద్మకుమారి, కైలాస్, సాయి, బి.శివాజీ, లచ్చన్న, అబ్దుల్ మసీద్, జి.గోపి, టీ ప్రకాష్, ఎస్.కుమార్‌తోపాటు సిపిఐ అనుబంధ సంఘ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పిజి కాలేజీ కోసం ఉధృత పోరాటం
### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్

అనంతరం సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలో గతంలో పిజి కాలేజీ ఉండేదని, అది ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందించేదని తెలిపారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో దానిని వరంగల్‌కు తరలించారని ఆరోపించారు. మళ్లీ పిజి కాలేజీ కోసం సిపిఐ పార్టీ తరపున ఉధృత పోరాటం చేపడతామని, కళాశాలను సాధించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యారంగ అభివృద్ధికి వెనుకబడిన నిర్మల్ జిల్లాను మరింత అభివృద్ధి పరచాలని, విద్యా సంబంధిత కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల త్యాగాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను, స్థలమున్న వారికి ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దిలావర్‌పూర్ మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీని శాశ్వతంగా తొలగించాలని, తాత్కాలికంగా పనులు నిలిపివేయడం కాదని అన్నారు. దేశంలో కార్మిక వ్యతిరేక పోరాటం జరుగుతోందని, అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీని నమ్ముకున్న వారిని ఎప్పుడు వమ్ము చేయదని, రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులదే భవిష్యత్తు అని వారు అన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారు
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, తొలివిడతలో భాగంగా ఆడపడుచులకు తొలి ఏకాదశి కానుకగా ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు, ఇంటి పట్టాలు అందిస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, చుంచుపల్లి మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు 2490 హక్కుపత్రాలు, ఎన్‌టిఆర్, మాయాబజార్ నిర్వాసితులకు 600 ఇండ్ల స్థలాల పట్టాలను ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తొలి ఏకాదశి నాడు ఆడ పడుచులకు ఇండ్ల మంజూరీ పత్రాలు అందజేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమకు ఇళ్లు రాలేదని ఏ ఒక్కరూ నిరాశ చెందనవసరం లేదని, అర్హతున్న ప్రతీ ఒక్కరికీ ఇంటిని నిర్మించిన ఇచ్చే బాధ్యత మాదే అన్నారు. తొలివిడతగా రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇల్లు మంజూరు చేశామని, అందులో 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, 1 లక్ష ఇళ్లకు లబ్దిదారుల ఎంపిక పూర్తయిందని, మరికొన్నింటికి ఎంపిక జరగాల్సి ఉందన్నారు. భవిష్యత్‌లో గడిలేని గ్రామం ఉంటుందేమోగానీ ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు ఉండదన్నారు. ప్రతీ సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వనిబంధనల ప్రకారం వారివారి ఖాతాల్లో నగదు జమవుతోందన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే దళారులను నమ్మొద్దని, ఎవ్వరికీ ఒక్క పైసా కూడా ఇవ్వొద్దని చెప్పారు. ఆ నాటి బిఆర్ఎస్ పాలన స్వప్రయోజనాల కోసం సాగిందని, ప్రజలు, రైతుల ప్రయోజనాలు తాకట్టుపెట్టిందని మండిపడ్డారు. తెలంగాణ నీటి నిల్వలను పక్క రాష్ట్రానికి అప్పనంగా కట్టబెట్టే కుట్రకు శ్రీకారం చుట్టిందే బిఆర్ఎస్ పాలకులన్నారు.అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం రూప్లా తండా వద్ద, చింతపెంటిగూడెం గ్రామాల్లో రూ.5 కోట్ల అంచనాలతో నిర్మించతలపెట్టిన రెండు హైలెవల్ వంతెలను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, టిపిసిసి సభ్యులు నాగసీతారాములు, కోనేరు చిన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# 'ఎరుకల కార్పొరేషన్'ను ఏర్పాటు చేయండి

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు పోటీ చేసే అవకాశాన్ని కల్పించడంతో పాటు వారిని గెలిపించుకోవాలని సూచించారు. 'ఏకలవ్యుడి జయంతి' సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీమ్ విగ్రహం వద్ద ఏకలవ్యుడి చిత్రపటానికి కవిత ఆదివారం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏకలవ్య భవనాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన 'ఎరుకల సాధికారత పథకాన్ని మరింత మెరుగుపర్చి, కాంగ్రెస్ ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణకు ఎంఎల్‌సిగా అవకాశం కల్పిస్తే అప్పటి గవర్నర్ అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రూప్‌సింగ్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్ పాల్గొన్నారు. జియాగూడ సబ్జీమండిలోని గోల్కొండ శ్రీ జగదాంబ ఎల్లమ్మ ఆలయ 51వ వార్షికోత్సవం, బోనాల పండగ ఉత్సవాల్లో కూడా కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.

# రూ.2500 హామీ ఏమైంది?

### బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేద మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందో ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 9వ మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. బికెఎంయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలు ముగిశాయి. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి పలు తీర్మాణాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య మాట్లాడుతూ తీర్మాణాలపై భవిష్యత్తు ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత రంగారెడ్డి జిల్లా సమితిపై ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.2500 నేటికి ఇవ్వడం లేదని మండిపడ్డారు. జిల్లా మహాసభలో జిల్లా కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి 25 కౌన్సిల్, 13కార్యవర్గం, 9మంది ఆఫీస్ బేరర్స్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసిందని వివరించారు. అధ్యక్షులుగా జె.అంజయ్య, జిల్లా ప్రధా న కార్యదర్శిగా బుద్దుల జంగయ్యలకు తిరిగి అవకాశం ఇచ్చారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా శివాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల జంగయ్య, శ్రీశైలం యాదవ్, జిల్లెల వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా రమేష్ యాదవ్, స్వరూప, జిల్లా కోశాధికారిగా ఎం.కృష్ణలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మికులు పేదల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించి సంఘాన్ని విస్తృతపరచాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఎం.రాములు, కె.రాజునాయక్, లింగమయ్య, సి.యాదయ్య, సిబి చంద్రయ్య, బాలకృష్ణయ్య, యశోద, యాదమ్మలు పాల్గొన్నారు.

# రైతులందరితో 'చలో' కన్నెపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లను తక్షణమే ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే కెసిఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి కన్నెపల్లికి కదులుతామని, మోటర్లను ఆన్ చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం గేట్లు తెరచి ఉన్నప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లు ఆన్ చేసి నీళ్లు తీసుకునే అవకాశం ఉందని, రోజుకు రెండు టిఎంసిల నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి తెచ్చుకునే అవకాశం ఉందని వివరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత మదుసూధనాచారి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, గొంగిడి సునీతతో ఆదివారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం మోటర్లను ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు కోసం 65 టిఎంసిలను సిఎం రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేశారని ఆరోపించారు. కృష్ణ నీళ్లను ఆంధ్రకు వదిలిపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రాప్ హాలిడే ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్లు వదిలారని, ఈసారి కూడా ఆంధ్రకు నీళ్ళొదిలే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి ప్రాజెక్టు మోటర్లు ప్రారంభించకపోతే వేలాదిమంది రైతులతో ప్రాజెక్టు వద్దకి వెళ్లి మోటర్లు ఆన్ చేసే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. కాళేశ్వరాన్ని పక్కకు పెట్టి రాజకీయాలు చేయాలని అనుకుంటే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించబోరని హరీశ్‌రావు హెచ్చరించారు.

# నిరాశా నిస్పృహలతోనే బిఆర్ఎస్ నేతల వాఖ్యలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నాయకులు పోటీపడి ప్రెస్ మీట్‌లు పెట్టి మాట్లడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రైతుల సంక్షేమ లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నేతల నిరాధార ఆరోణలు చేయడం చూస్తుంటే వారు పూర్తిగా నిరాశ నిస్పృహకు లోనైనట్లు స్పష్టమవుతోందన్నారు. బిఆర్ఎస్ నేతలు చేసిన పలు ఆరోపణలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తిప్పి కొట్టారు. బిఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శిక్షలు వేస్తున్నారని ఆపార్టీ నేతలు పేర్కొన్నడం సిగ్గుచేట్టాన్నారు. మా ప్రభుత్వం అధికారం చేపట్టిన ఒకటిన్నర సంవత్సరంలోనే రూ.1.03లక్షల కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేసి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలించిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతులకు దిగుబడులు పెరగడమే కాకుండా అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని, దీనితో పల్లెల్లో సంతోషం వెల్లివిరుస్తుంటే బిఆర్ఎస్ కళ్ళల్లో నాయకులకు కళ్ళల్లో కారం కొట్టినట్లుందని మంత్రి పేర్కొన్నారు. దానితో వారు అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమం పట్టని, కనీసం ఆలోచన చేయని నాయకులు కూడా ఈ రోజు వ్యవసాయం, రైతులు, ఎరువులు, నీళ్ల అని మాట్లాడడం చూస్తుంటే వారంతా నిస్పృహలో ఉన్నారో తెలంగాణ సమాజం ఈపాటికి అర్థమైందన్నారు. ధనిక రాష్ట్రంగా వున్న సమయంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని 4 దఫాలుగా, చేయడంతో అది కాస్త వడ్డీలకు కూడ సరిపోలేదని, అలాంటింది తమ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల వరకు ఏకమొత్తంగా చెల్లించి రైతులను రుణాల నుంచి విముక్తి చేసిందన్నారు. గతంలో బిఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతు బంధుతో పాటు గత రెండు పంట కాలాలలో రూ.13500 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని, ఈసారి 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుభరోసా నిధులు జమ చేయడంతో తమ రాజకీయ జీవితానికి తెలంగాణ సమాజం ఎక్కడ చరమగీతం పాడతారో అని నోటికి వచ్చిన తీరున బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సామాజిక న్యాయసమరభేరి విజయవంతం

# రాష్ట్ర కాంగి'రేస్'లో జోష్

**ఇ.చంద్రశేఖర్**



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెండు రోజుల కింద నిర్వహించిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం 'సామాజిక న్యాయసమరభేరి' సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నయా జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణను చేపట్టడం, బిసి రిజర్వేషన్‌పై అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి రాష్ట్రపతికి పంపించడం, ఇవే అంశాలు ఎజెండాగా ఎల్‌బి స్టేడియంలో జరిగిన సభ ద్వారా 'సామాజిక న్యాయం' నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ సక్సెస్ అయిందని చెప్పవచ్చు. దాదాపు పదేళ్ల పాటు అనేక ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి, క్షేత్రస్థాయి నాయకత్వానికి సమరభేరి సభ జవసత్వాలను కలిగించింది. పార్టీ శ్రేణుల్లో మానసిక ధైర్యం పెంపొందించిందనిపిస్తోంది. సామాజిక న్యాయం అంశంపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రజలలో చర్చ జరుగుతున్నప్పటికీ కాంగ్రెస్ సభతో ఆ చర్చ తారాస్థాయికి చేరింది. చివరకు ఒక రాజకీయ పార్టీలో అంతర్గత పదవి అయిన పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బిసిలకు ఇవ్వలేదని, ఉన్నత వర్గాలకు చెందిన వారికి కట్టబెట్టారని తీవ్రస్థాయిలో విమర్శలు చేసే స్థాయికి ఈ 'సామాజిక న్యాయం' చర్చ చేరింది.

కాంగ్రెస్ శ్రేణుల విషయానికి వస్తే 'సామాజిక న్యాయ సమర భేరి' సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో కాంగ్రెస్ నూతనోత్సాహాన్ని కలిగింది. సుమారు 15 వేల మందితో సభ నిర్వహించాలని టిపిసిసి భావించినప్పటికీ, 50 వేలకు పైగా కాంగ్రెస్ గ్రామ స్థాయి నేతలు తరలిరావడం గమనార్హం. సభలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉపన్యాసాలు పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉత్తేజపరిచాయి. ప్రజల సమస్యలు, సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ నిబద్ధతను వారు స్పష్టంగా వ్యక్తీకరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను మానసికంగా సన్నద్ధం చేసింది. ఈ సభ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని, నైతిక బలాన్ని మరోసారి రుజువు చేసినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు.

ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రసంగంతో పార్టీ నేతలను, కార్యకర్తలను ఉర్రూతలూగించారు. "వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపి సీట్లు పెరగబోతున్నాయి. వచ్చే ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. అందులో ఒక్క సీటు తక్కువ వచ్చినా నాదే బాధ్యత. లోక్‌సభ ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు తప్పకుండా గెలుస్తాం. స్థానిక సంస్థల ఎన్నికల పోరులో కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నేను తీసుకుంటాను. ప్రజాసంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రభుత్వం తరపున ప్రచారకర్తలుగా మారాలి" అని స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో దాదాపు పదేళ్ల పాటు అనేక ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్‌లోని ద్వితీయ, తృతీయ శ్రేణి, క్షేత్రస్థాయి నాయకత్వానికి మానసిక ధైర్యం మరింత పెరిగింది. సిఎం ప్రసంగం వారికి తమ రాజకీయ భవిష్యత్‌పై ఆశలను చిగురింపజేశాయి. సభలో సిఎం రేవంత్‌రెడ్డి మాటలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఒక్కసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గుర్తుకొచ్చారు. 2004కు ముందు సుమారు పదేళ్ల పాటు అధికారంలో ఉన్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడును అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన సందర్భాలను పార్టీ శ్రేణులు గుర్తు చేసుకున్నారు. అప్పుడు కూడా 'ఏపిలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసకువచ్చే బాధ్యత నాదే' అని ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీకి స్పష్టంగా చెప్పడమే కాకుండా, ఆచరణ సాధ్యం చేసిన వై.ఎస్ పట్టుదలను తిరిగి రేవంత్‌రెడ్డిలో చూస్తున్నామని పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.


'జై బాపు, జై భీం, జై సంవిధాన్' పేరుతో ప్రజల వద్దకు వెళ్లాలని ఎఐసిసి అగ్రనేత మల్లిఖార్జున్ ఖర్గే పిలుపునివ్వడం ద్వారా దళితులు, బడుగు బలహీనవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం పార్టీ కార్యకర్తలేనని, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితర నాయకులందరూ కలిసికట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని పార్టీ అధిష్టానం పెద్దాయన ఖర్గే ప్రశంసించడం పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలలో సంతోషాన్ని కలిగించింది.

"దేశంలో ప్రస్తుతం ఒక సైద్ధాంతిక పోరాటం జరుగుతుంది. రాజ్యాంగాన్ని రక్షించాలని కాంగ్రెస్, ఇండియా కూటమి ఒక పక్కన, రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఎన్‌డిఎ కూటమి మరో పక్కన పోరాటం చేస్తున్నాయి" అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించి వచ్చే ఎన్నికల్లో బిజెపితో సైద్ధాంతిక యుద్ధానికి ఇప్పటి నుంచే కాంగ్రెస్ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ 'సామాజిక సమర భేరి సభ' ఒక వైపు రాష్ట్రంలో సామాజిక న్యాయంపై చర్చను తారాస్థాయికి తీసుకుపోవడంతో పాటు పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉండి నిరుత్సాహంలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు ఊతమిచ్చిందని చెప్పవచ్చు.


# సాహితీ విహారి

# పాలస్తీనియన్ల కన్నీళ్లే కనాఫానీ సిరా!

కేవలం 36 సంవత్సరాల వయసులోనే పాలస్తీనా ప్రజల తరఫున పోరాడుతూ హత్యకు గురైన ఘసన్ కనాఫానీ గ్రాఫితి గొప్ప నాయకుడేకాదు... ప్రతిభావంతుడైన రచయిత కూడా. 1936, ఏప్రిల్ 9న జన్మించిన కనాఫానీ జర్నలిస్టుగా, ఉద్యమకారుడిగా అతను ప్రజాగొంతుకై, పాలస్తీనా విమోచనం కోసం పరితపించాడు. 1972 జులై 8న, ఇజ్రాయెలీ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్ అతనిని బీరూట్‌లో ఓ కారు బాంబు పేల్చి హత్యచేయించింది. 'పాపులర్ ఫ్రంట్ ఫర్ ద లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా' పేరుతో అతను నడిపించిన ఉద్యమం స్ఫూర్తిని మాత్రం ఇజ్రాయెల్ అణచివేయలేకపోయింది. ఇప్పటికీ స్వేచ్ఛకోసం.. అణచివేత నుంచి విముక్తికోసం పాలస్తీనా అలుపెరుగని పోరాటం సాగిస్తునే ఉంది. పాలస్తీనా ప్రజల ప్రతినిధిగా, విప్లవ రచయితగా, జర్నలిస్ట్‌గా, ఉద్యమకారుడిగా 20వ శతాబ్దపు అరబ్–ఇజ్రాయెల్ సంక్షోభ సమయంలో కీలక పాత్ర పోషించిన ప్రగతిశీల సాహితీవేత్తగా కనాఫానీ శతాబ్దాలకు సరపడా కీర్తిని ఆర్జించాడు. కనాఫానీ పేరు విన్న వెంటనే, రెండు భావాలు మెదడులో మెరుస్తాయి. ఒకటి పాలస్తీనా బాధ.. మరొకటి ప్రతిఘటన హోరు. రచయితగా అతని స్వరాలు మౌనంగా వినిపించినవే అయినా, ప్రపంచాన్ని కదిలించాయి. కాల్పుల నుంచి కళకు, నిరాశ నుంచి నిరూపణకు, ఆయన కథలు పాలస్తీనా ప్రజల జీవించి ఉన్న పోరాటాలను విశ్వమానవ గాథలుగా మలిచాయి. బ్రిటిష్ పాలస్తీన్ (ఇప్పటి ఇజ్రాయెల్)లో బలవంతపు తరలింపు కాలం (నక్బా)లో జన్మించిన కనాఫానీ విద్య సిరియా, బీరూట్‌లలో కొనసాగింది. వ్యవసాయ ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా ఎదిగిన అతను, పాలస్తీనా ప్రజల గొంతుకై ప్రపంచానికి వినిపించాడు. కనాఫానీ రచనలు పాలస్తీనా నిరాశ, దేశచ్యుత, ప్రవాస జీవిత దుఃఖాలు మరియు తిరుగుబాటును ప్రతిబింబిస్తాయి. అతని కథలు మార్మికంగా, అభివ్యక్తిపూర్వకంగా సామాన్య పాలస్తీనా జీవిని ప్రపంచానికి పరిచయం చేస్తాయి. కనాఫాని రచనలు ఎక్కువగా కథలు, నవలలు అయినా, అవి కవిత్వంతో కూడిన రాజకీయ పదబంధాలుగా గోచరిస్తాయి. వాటిలో, లౌకిక ఉదాహరణలతో లోతైన సందేశాలు ఉంటాయి. ప్రత్యక్షంగా రాజకీయ ప్రసంగం కాక, పరోక్షంగా పాత్రల మార్పు ద్వారా సిద్ధాంత బోధ కనిపిస్తుంది. మార్మిక ముగింపులు, మానవ సంబంధాల భిన్న కోణాలు, జ్ఞాపకాల రాజకీయ శాస్త్రం, అనుభవాల ఆధారంగా రాజకీయ తీర్మానాల విశ్లేషణలు అతనిని ప్రపంచ మేటి రచయితల జాబితాలో చేర్చాయి. కనాఫానీ రచనలు కేవలం పాఠకుల మానసికోల్లాసానికికాక, ఉద్యమానికి ఆయుధంగా ఉండాలన్న తపనతో రాసినవే. అతడు అభివృద్ధి చేసిన 'ప్రతిఘటన సాహిత్యం' (రెసిస్టెన్స్ లిటరేచర్) అనే భావన, పాలస్తీనా రచనలను విశ్వవేదికపై ప్రత్యేక స్థానంలో నిలబెట్టింది. అందుకే అతని రచనలు బాధను కవిత్వంగా, నిరాశను ప్రేరణగా మలిచాయి. కొందరు విమర్శకుల అభిప్రాయం ప్రకారం కనాఫానీ కథల్లో కొన్నిసార్లు భావోద్వేగం రాజకీయ ప్రకటనకంటే ఎక్కువగా మారుతుంది. కానీ అతడి రచనల విలువ, సాహిత్య సామర్థ్యం కాలంతో ముడిపడి, పాఠకుల్ని మౌనంగా తిరుగుబాటుకు ప్రేరేపించగలిగింది. అరబ్ సాహిత్య ప్రపంచంలో నగ్న నిజాలు రాసిన మొదటి విప్లవ రచయిత కనాఫానీ. అతని రచనలు పాలస్తీనా భూమి కన్నా ఎక్కువగా పాలస్తీనా హృదయాన్ని ప్రతిబింబించాయి. కనాఫానీని కలుషిత గాలుల్లోకి బలవంతంగా నెట్టివేసిన ఆధిపత్య రాజకీయాలు, ఆయన రచనలు మాత్రం నేటికీ స్వేచ్ఛ కోసం శ్వాస తీసుకుంటున్నాయి. కనాఫానీ రచనలు పాలస్తీనా భవిష్యత్తు కోసం సాగిన సాహిత్య విప్లవానికి ప్రతీకలు. ఆయన అత్యంత ప్రఖ్యాత కథ 'మెన్ ఇన్ ది సన్' (1963)లో ప్రచురితమైంది. దీనిని 'ఒక దహించే మౌనం'గా పేర్కొంటారు. ఈ కథలో ముగ్గురు పాలస్తీనా శరణార్థులు, తమ భవిష్యత్తు కోసం బస్రా (ఇరాక్) నుండి కువైట్ (ఆర్థిక వనరుల రాష్ట్రం)కి అక్రమంగా ప్రయాణించాలనుకుంటారు. వారిని డ్రైవర్ ట్యాంకర్‌లో దాచి తీసుకెళతాడు. గమ్యం చేరేలోపే ముగ్గురూ హీట్‌స్ట్రోక్ వల్ల చనిపోతారు.






ఈ కథ మానవ స్వభావాన్ని, నిరాశను, ఉద్యమంలో తమకంటూ ప్రత్యేక గళంలేని ప్రజల వ్యధను తేటతెల్లం చేస్తుంది. శరణార్థుల అనుభవాలు, దేశంలో చోటు కోల్పోయిన వారి జీవన పరిస్థితులు, చైతన్యం లేకపోతే ఎదురయ్యే సమస్యలను కనాఫానీ ఈ కథలో నర్మగర్భంగా వివరిస్తాడు. ట్యాంకర్‌లో ఊపిరి ఆడనప్పుడు, లోపలి నుంచి కనీసం ఎందుకు శబ్దాలు చేయలేదు? ఎందుకు డ్రైవర్ దృష్టిని తమవైపు తిప్పుకోలేదు? అనే ప్రశ్నలతో కథను ముగించడం ద్వారా, మౌనం పాలస్తీనా ప్రజలకు మరణ శాసనమైందన్న వాస్తవాన్ని వెల్లడిస్తాడు. అతను ఈ కథ రాసి 60 సంవత్సరాలు గడిచినా, పాలస్తీనియన్ల జీవిత ట్యాంక్ ఇంకా వేడిగా ఉంది. ప్రజలు ఇంకా శోధనలో ఉన్నారు. మరణమంటే శరీర మరణం ఒక్కటేకాదు.. ఆశలు, కలలు, స్వరాలను నశింపజేసే మౌనం కూడా. 'మెన్ ఇన్ ది సన్' ఒక రాజకీయ దస్తావేజుగా కాకుండా, ఒక విలాప గీతంలా ఉంది. కనాఫానీ తన ప్రజల జీవన సత్యాన్ని ప్రపంచానికి వినిపించేందుకు సాహిత్యాన్ని మాధ్యమంగా ఎంచుకున్నాడు. కష్టాలకు అక్షర రూపమిచ్చాడు. అతని 'రిటర్న్ టు హైఫా' (1969) అనే నవల పాలస్తీనా ప్రజల నిరాశ, బాధ, శరణార్థ జీవితం మీద అత్యంత సంక్లిష్టమైన రాజకీయ, మానవీయ, తాత్త్విక స్థాయిలలో స్పందించగలిగే శక్తివంతమైన రచన. ఈ కథ పునరాగమనం అనే ఆలోచనను కేవలం భౌగోళికంగా కాకుండా మానసికంగా, మానవ సంబంధాల పరంగా, చారిత్రికమైన గాయాల పరంగా అన్వయిస్తుంది. ఈ రచనలో ప్రధానంగా వ్యక్తిగత బాధ, సామూహిక వ్యధ మధ్య ఉన్న సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించాడు. కథలో సయీద్, సఫియా అనే దంపతులు 1948 లో 'నక్బా' సమయంలో హైఫా నుండి తరలిపోవాల్సి వచ్చి, తమ చిన్నారి కుమారుడు ఖల్దూన్‌ను నిర్బంధిత స్థితిలో వదిలిపెట్టి వెళ్ళిపోతారు. 20 ఏళ్ల తర్వాత ఇజ్రాయిల్ అధికారుల అనుమతితో తిరిగి హైఫాకు వస్తారు. ఆ ఇంట్లో ఇప్పుడు మిరియం అనే యూదు మహిళ నివసిస్తోంది. ఖల్దూన్‌ను ఆమె పెంచుతుంది. ఖల్దూన్ పేరు ఇప్పుడు డోవ్, అతను ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్నాడు. ఇక్కడే కథ న్యూట్రల్ గుండా భౌగోళిక స్థలాన్ని అల్లుకొని, మానవ సంబంధాలలోని దుర్విద్రోహాన్ని మానవతా శూన్యతగా చూపిస్తుంది. సయీద్, సఫియా అనుభవించే వ్యక్తిగత వేదన అత్యంత హృదయవిదారకమైనది. తాము వదిలిపెట్టిన బిడ్డ ఇప్పుడు తమను గుర్తించకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతారు. తాము మానవత్వం కోల్పోయామని, బిడ్డను మళ్ళీ సంపాదించలేమని, కాలం దాని దారి ఎంచుకుంటుందని అంగీకరించాల్సి వస్తుంది. చరిత్ర వీరికి, అంతకు మించిన ఎంపికలు లేకుండా నియంత్రిస్తుంది. ఇది వ్యక్తిగత బాధ. అదే సమయంలో నక్బా (పాలస్తీనా ప్రజల భూములనుండి బలవంతపు తరలింపు) తరం పాలస్తీనా శరణార్థుల గాయాలకు అద్దం పడుతుంది. ఈ కథలో సయీద్ దంపతుల వేదనను వేదనగా మాత్రమే కాక, పాలస్తీనా ప్రజల సామూహిక బాధగా కూడా చూడాలి. డోవ్ (ఖల్దూన్) దృష్టిలో తల్లిదండ్రులు తనను విడిచిపెట్టారు. ఏమైపోయాడోనని కూడా చూడలేదు. ఇప్పుడు తిరిగి వచ్చే అధికారం వారికి లేదు. సయీద్ దంపతులు ఒకవైపు, బిడ్డపై మమకారాన్ని చంపుకోలేకపోతారు. మరోవైపు ఆ బిడ్డపై అధికారాన్ని ప్రకటించుకోలేకపోతారు. 'కుమారుడ్ని నిందించాలా? మేము తిరిగి రావడం సరైనదేనా?' అనే సందిగ్ధం సయీద్‌ను వెంటాడుతుంది. ఎవరి దృష్టికోణం వారిది. అయితే, వారిని విడదీసింది పాలస్తీనా అనుభవిస్తున్న హృదయవిదారక పరిస్థితులే అన్నది నిజం. పాలస్తీనా తరం తమ బాధను ఎలా నిర్వచించాలి? నైతికంగా ఎవరు బాధ్యులు? అని రచయిత కనాఫానీ ప్రపంచాన్ని నిలదీస్తాడు. బాధకు ఒకే ఒక రూపం అంటూ ఏదీ ఉండదు. అది తరతరాల వారసత్వం. సయీద్ చివరికి గమ్యానికి చేరుకోడు. అతడి తిరిగి రావడం అనేది ఒక శారీరక ప్రయాణం కాదు, ఆత్మగౌరవానికి పునర్మూల్యాంకనం. అతడి పునరాగమనం యుద్ధంలో పోరాడే తన రెండవ కొడుకుపై ఆశతో ముగుస్తుంది. 'గతాన్ని తిరిగి పొందలేం. కానీ బాధతో జీవించి, భవిష్యత్తును మలచవచ్చు' అనే సంకేతాన్ని పాఠకులకు రచయిత ఇస్తాడు. కనాఫానీ రచించిన అత్యంత ప్రాచుర్యం పొందిన శక్తివంతమైన చిన్న కథలలో 'ది లాండ్ ఆఫ్ శాడ్ ఆరెంజెస్' (1958) ఒకటి. ఈ కథ 1948 నక్బా తరువాత ఒక పాలస్తీనా కుటుంబం జీవితాన్ని చూపిస్తుంది. స్త్రీలు, పిల్లలు, ముసలివాళ్లు జ్ఞాపకశక్తిని కోల్పోతుండగా, మగవారు తమ బాధను అణచుకుంటూ గర్వంగా జీవించాలా, లేక భయంగా పారిపోవాలా? అనే తాత్వికమైన చర్చలతో నిండిన కథ ఇది. ఇది ఒక బాలుడి గుర్తుల రూపంలో మనముందుకు వస్తుంది. కథలో 'ఆరెంజ్' (నారింజ) పండు ఒక సస్యశ్యామలమైన భూమికి ప్రతీక. కానీ, అదే పండు విషాదాన్ని మోస్తూ, పాలస్తీనా గ్రామాల బలవంతపు విడిపోయే దుస్థితిని సూచిస్తుంది. ఇది నక్బా సమయంలో ప్రజలు తమ భూములను ఎలా కోల్పోయారో వివరిస్తుంది. ఒక బాలుడి కళ్ల ఆధారంగానే రచయిత కథను ముందుకు నడిపిస్తాడు. అందుకే, ప్రజల తపన, భయం, గౌరవం, అవమానం అన్నీ శబ్దాలూ, దృశ్యాల రూపంలో వస్తాయి. ఆ బాలుడి కళ్లు అప్పుడే వయసు మీరిన వారి మాదిరి భయంతో నిండిపోతాయి. ఈ బాలుడు పాలస్తీనా తరం భవిష్యత్తుకే ప్రతీక. ఒకప్పుడు ఎంతో ఘనంగా బతికిన కుటుంబాలు క్రమంగా పతనం కావడంతో, ఆయా కుటుంబాల్లోని పెద్దలు, తాతలు, తండ్రులు భవిష్యత్తులో పిల్లలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితిని ఎదుర్కొంటారు. ఇది బాధను మౌనంగా మోసుకుంటున్న తరం అనుభవించే శూన్యత.. అంతర్లీనంగా దాగివుండే రోదన. నారింజ పండ్లను అవి పండే భూమికి ప్రాణంగా చూపిస్తాడు రచయిత. కానీ, అవి ఇప్పుడు పండిన పళ్ళు కాదు, తల్లడిల్లే ప్రాణాల గుర్తులు. ఆ తోటలు తేనెలాంటి గంధాన్ని కాదు.. శోకంతో అల్లాడుతున్న ప్రజల నెత్తుటి వాసనను వెదజల్లుతున్నది. ఈ భూములు పండించే ఆరెంజ్‌లు ఇక పండ్లుగాకాక, ఒక జాతి భవిష్యత్తుకు గుర్తుగా నిలుస్తాయి. పాలస్తీనా కుటుంబాలు, పక్క దేశాలలో శరణార్థులుగా ఆశ్రయం పొందే ప్రయాణాన్ని ఈ కథ సున్నితంగా చిత్రిస్తుంది. పారిపోవడమా? లేక అణచివేతను ఎదుర్కొని పోరాడడమా? తేల్చుకోవాలంటూ, రక్తం కక్కిన నిజాలను మౌనంగా వినిపించేలా నవల సాగుతుంది. మధురమైన ఊహల్ని, పూర్వ జ్ఞాపకాలను ఒకవైపు, విచారాలను, విషాదాలను, వ్యధలను మరోవైపు ఉపమానంగా 'ఆరెంజ్'లు నిలుస్తాయి. 'ది లాండ్ ఆఫ్ శాడ్ ఆరెంజెస్' కథ చిన్నదే. అయితేనేం, పాలస్తీనా దుర్గతి, నిరాశ, పరవశత్వాన్ని ఆలోచింపజేస్తుంది. ఇది వ్యక్తిగత బాధలేగాక, సామూహిక ఆత్మగౌరవం పరిస్థితుల ఉచ్చులో చిక్కుకొని ఎలా బిగుసుకుపోయిందో తెలిపే కథ. మౌనం నెత్తిన వేసిన పొగమంచుగా ఉండి, కథ అంతా చీకటిలో ప్రయాణం చేసేలా చేస్తుంది. కనాఫానీ ఈ కథ ద్వారా 'మేము ఎక్కడికి వెళ్లాం?', 'మేము ఎందుకు, ఎలా వెళ్లాం?' అని ప్రశ్నిస్తాడు. ఇలా ఏ కథ చదవినా, అందులో పాలస్తీనియన్ల వేదనాభరితమైన జీవితాలే పాత్రలై కళ్ల ముందు కదలాడుతాయి. జనం జీవితాలనే కథావస్తువులుగా మలచుకొని కనాఫానీ చెక్కిన ప్రతి కథా ఒక జీవితమే.

**– సత్యశ్రీ**

## కాలాతీత కవిత



### 'ఇన్‌విక్టస్'

విలియమ్ ఎర్నెస్ట్ హెన్లీ రచించిన 'ఇన్‌విక్టస్' (Invictus) అనే లాటిన్ పదానికి 'అజేయుడు' లేదా 'ఓడించడానికి సాధ్యంకాని వాడు' అని అర్థం. స్వీయానుభవాల నేపథ్యంలో హెన్లీ రాసిన ఈ కవిత ఓ అజేయ వ్యక్తి ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. బ్రిటన్ దేశానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు, సంపాదకుడు హెన్లీ (1849–1903) చిన్న వయసులోనే హెన్లీ తండ్రిని కోల్పోయాడు. ఎముకకు సోకిన క్షయవ్యాధి కారణంగా వైద్యులు హెన్రీ ఒక కాలును తొలగించారు. తీవ్రమైన శారీరక, మానసిక బాధల మధ్య, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు అతను రాసిన 'ఇన్‌విక్టస్' కవిత, సమాజంలోని అణగారిన గొంతుకలకు ధైర్యాన్నిచ్చిన మంత్రం. ఇందులోని నాలుగు స్టాంజాలు లేదా చరణాలు అంతులేని ఆత్మవిశ్వాసానికి ప్రతీకలు. మొదటి పంక్తిలోనే ప్రయోగించిన 'రాత్రి' అనే పదం జీవితంలోని అంధకార దశలకు, నిరాశకు, శోకానికి సంకేతం.

Out of the night that covers me,
Black as the Pit from pole to pole,
I thank whatever gods may be
For my unconquerable soul.


INVICTUS

Out of the night that covers me,
Black as the Pit from pole to pole,
I thank whatever gods may be
For my unconquerable soul.

In the fell clutch of circumstance
I have not winced nor cried aloud.
Under the bludgeonings of chance
My head is bloody, but unbowed.

Beyond this place of wrath and tears
Looms but the Horror of the shade,
And yet the menace of the years
Finds, and shall find, me unafraid.

It matters not how strait the gate,
How charged with punishments the scroll,
I am the master of my fate:
I am the captain of my soul.

William Ernest Henley

అంటాడు కవి. చుట్టూ ఆవరించిన చీకటిని ప్రస్తావిస్తూ, అతను వాడిన 'Black as the Pit' అనే ఉపమానం దారుణమైన బాధను సూచిస్తుంది. అయినప్పటికీ కవి తన అజేయ ఆత్మశక్తిని కృతజ్ఞతలు చెప్పడం అతనికి దేవం మీద కాదు.. ఆత్మసాక్షి పైనే విశ్వాసం ఎక్కువనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. అతని ఆత్మనిశ్చయానికి ఇది ప్రతీక. రెండో చరణంలో..

In the fell clutch of circumstance
I have not winced nor cried aloud.
Under the bludgeonings of chance
My head is bloody, but unbowed అంటూ, జీవితంలో పరిస్థితులు ఎన్ని దెబ్బలు కొట్టినా, తాను బాధను వ్యక్తం చేయలేదు అనడం ద్వారా, ఎలాంటి దుస్థితిలో చిక్కుకున్నప్పటికీ, ఆత్మస్థైర్యాన్ని వీడేది లేదని స్పష్టం చేస్తాడు. ఇందులో 'My head is bloody, but unbowed' (నా తల రక్తం కారుతుండవచ్చు... కానీ వంచలేదు) అనేది ఎంతో ప్రాచుర్యం పొందిన, సాహసాన్ని చాటే నానుడిగా మారింది. ఇది మనం ఎన్ని కష్టాలకైనా తల వంచకుండా నిలబడవచ్చుననే పరిస్థితులపై మనిషి ఆధిపత్యానికి సంకేతం.
ఇక మూడో చరణంలో..

Beyond this place of wrath and tears
Looms but the Horror of the shade,
And yet the menace of the years
Finds and shall find me unafraid అంటాడు హెన్లీ. ఇక్కడ 'place of wrath and tears' అంటే భూమిలోని బాధలు, కష్టాలు. 'Horror of the shade' అనేది మరణ భయాన్ని సూచిస్తుంది. అయినా కూడా కవి భవిష్యత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేస్తాడు. తాను నిర్భయుడినని చాటుకుంటాడు. భయం లేని జీవన దృక్పథాన్ని ఈ చరణం మనకు గుర్తుచేస్తుంది. ఇక చివరిదైన నాలుగో చరణంలో..


It matters not how strait the gate,
How charged with punishments the scroll,
I am the master of my fate
I am the captain of my soul అంటూ, తన నిర్భీతిని మరోసారి చాటుకుంటాడు. 'I am the master of my fate.. I am the captain of my soul' అనడం ద్వారా, విధిరాతను, విధాత ఉనికిని ప్రశ్నిస్తాడు. తన రాతను తానే రాసుకుంటానని, తన జీవితాన్ని తానే నడిపించుకుంటానని తెగేసి చెప్తాడు. మన జీవితానికి మనమే నాయకులం... మన బతుకుపై ఇతరుల అధికారం ఉండకూడదని ప్రకటిస్తాడు. బాధలోనూ తల వంచని వికసిత మనోభావం అతని కవితలో ఆవిష్కృతమవుతుంది. ఈ కవిత నైతిక తాత్వికత (Moral Philosophy), నైతిక బాధ్యత (Moral Responsibility), జీవితం మీద వ్యక్తిగత హక్కు (Existential Choice) వంటి అంశాలను ప్రస్తావిస్తుంది. ఎలాంటి కష్టాలు ఎదురైనా, ధైర్యాన్ని వీడనని, తలవంచి బానిసగా ఉండబోనని హెన్లీ స్పష్టం చేసిన తీరు ఆంగ్ల సాహిత్యంలో పెనుతుపాను రేపింది. జాత్యహంకారానికి వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో ఆందోళన చేసిన నెల్సన్ మండేలాను అక్కడి ప్రభుత్వం సంవత్సరాల తరబడి జైల్లో ఉంచారు. కారాగారంలో ఉన్నప్పుడు ఆయన 'ఇన్‌విక్టస్' కవితను పలుమార్లు చెదివేవాడని అంటారు. ముఖ్యంగా చివరి రెండు పంక్తులు మండేలాలో ఆత్మవిశ్వాసాన్ని, లక్ష్యం చేరాలన్న పట్టుదలను పెంచాయని చెప్తారు. ఈ కవితను సైనికులు, వీరులు తమలో ధైర్యాన్ని నూరుకునేందుకు వినేవారు. దీని భావం వారికి ఆయుధమైంది. ఈ కవితకు ఆధునిక కాలంలో కూడా ఎంతో ప్రాసంగిత ఉంది. విద్యార్థులకు పరీక్షలు, ఒత్తిడులు మధ్యలో తల వంచకుండా నిలబడే శక్తినిస్తుంది. వ్యాపారులకు అనుకోని నష్టాలు, అపజయాలు ఎదురైనా, తమ ప్రయత్నాలను విరమించకుండా ముందుకెళ్లే ఉద్దీపనగా నిలుస్తుంది. రోజువారీ సమస్యలు ఎదురైనప్పటికీ, ఆత్మ ధైర్యాన్ని నమ్మిన ప్రతి ఒక్కరూ ఈ కవితను చవిదితీరాలి. ఇంగ్లీష్ కవితల పాశ్చాత్య భావజాలాన్ని తెలుగు లోకి తర్జుమా చేయటం సవాలుగా మారుతుంది. అయినా ఇందులోని ప్రధాన ఉద్దేశం 'జీవితం ఎలాంటి దెబ్బలు కొట్టినా మనం మానకూడదు' అన్ని భాషల్లో సామాన్య మానవునికి వర్తిస్తుంది. తన జీవిత మార్గాన్ని, గమ్యాన్ని తానే నిర్ధారించుకుంటానని చివరిలో చేసిన వ్యాఖ్య ఎంతటి పిరికివారిలోనైనా, అంతులేని ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. పరిస్థితులతో పోరాడే శక్తిని అందిస్తుంది. అందుకే, 'ఇన్‌విక్టస్' ఒక సాధారణ కవిత కాదు. ఒక జీవితం... .ఒక స్ఫూర్తి.... ఒక విప్లవం. అందులోని ప్రతి పంక్తి మానవ అజేయతకు చిహ్నం. హెన్లీ తన జీవితంలో ఎదురైన నరకానుభవాలపై మనిషి ఎలా గెలవగలడో తన కవిత ద్వారా చూపించాడు. I am the captain of my soul అన్నది చిరస్థాయిగా నిలిచిపోయే వాక్యం. ఈ ఒక్క పంక్తి మానవ చరిత్రలో వేలమంది జీవితాల్లో వెలుగునిచ్చిన దీపంలా నిలిచింది. జీవితంలో ఏదైనా అడ్డంకిగా నిలిచినా, ఓ దారుణమైన చీకటి దశలో ఉన్నా... ఈ కవితను చదివితేచాలు.. ఇది ఒక దీపంలా మార్గం చూపుతుంది. ఒక బలవంతమైన ఆయుధంగా మారి, భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. అందుకే ఇది కలాతీత కవిత్వమైంది.

## చదవాల్సిన పుస్తకం

# వీర తెలంగాణా

### నా అనుభవాలు... జ్ఞాపకాలు

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ పోరాట ప్రముఖుడు, ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా సేవలు అందించిన మానవతావాది రావి నారాయణ రెడ్డి జీవన యాత్రను గుర్తుచేసే పుస్తకం. ఆయన రచయిత కావడంతో, ఊహాగానాలకు, అతిశయోక్తులకు తావులేకుండా, సమాచారం ముక్కుసూటిగా ఉంటుంది. 1908 జూన్ 5న జన్మించిన రావి నారాయణ రెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంగానీ, పరిచయం చేయాల్సిన ఆగత్యంగానీ ఉండవు. నిజాం ప్రభుత్వం మీద ఆయన చేసిన సాయుధ పోరాటం చిరస్మరణీయం. 1946–48 కాలంలో హైదరాబాదు సంస్థానంలో నిజాం పోలీసుల దాష్టీకానికి, మతదురహంకారులైన రజాకార్ల ఆగడాలను అరికట్టడ్డడానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటుచేసినారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌పై పోటీచేసి నెహ్రూకన్నా అధిక ఓట్లతో గెలిచి పార్లమెంటరీ రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన ఖ్యాతి ఆయనకే దక్కింది. గాంధీ, మావో, హోచిమిన్, కృశ్చేవ్‌లను స్వయంగా కలిసిన సమరశీలి. 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరకముందు సుమారు 11 ఏళ్లపాటు ఆయన 'సామాజిక న్యాయం' సాధించడానికి శ్రమించారు. 23 ఏళ్ల వయసులో హరిజన సేవాసంఘాన్ని నెలకొల్పి దాని ప్రధాన కార్య దర్శి హోదాలో హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలలు ప్రారంభించారు. రెండు వసతి గృహాలను నిర్వహించారు. నల్లగొండ జిల్లా భువనగిరి పట్టణ సమీపంలోని బొల్లేపల్లి గ్రామంలో 1908 జూన్ 5న భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రావి నారాయణరెడ్డి ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజాపోరాటానికి చూపునిచ్చిన జననేతగా ప్రసిద్ధుడు. భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాటు ఉద్యమంలో నిజామాంధ్ర మహాసభలోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టుగా ఆయన ఆచరణ అతి విశిష్టమైనది. ప్రజాజీవితంలో ఉన్న నాయకులు ఒక కీలకమైన చారిత్రక సన్నివేశంలో సిద్ధాంతపరంగా విభేదించే శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరచి ఏకతాటిపై ఉద్యమాన్ని ఎలా నిర్మించవచ్చో తన ఆచరణ ద్వారా నిరూపించిన ప్రజాస్వామికవాది 'రావి'. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్‌పై పోటీచేసి నెహ్రూకన్నా అధిక ఓట్లతో గెలిచి పార్లమెంటరీ రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన ఖ్యాతి ఆయనకే దక్కింది. తెలంగాణపై తనదంటూ ఒక బలమైన ముద్ర వేసిన రావి నారాయణ రెడ్డి అనుభవాల చిట్టాను ప్రతి ఒక్కరూ చదవాలి. ఆయన జీవన ప్రస్థానాన్ని, తెలంగాణ పోరాటంలో పోషించిన పాత్రను లోతుగా తెలుసుకోవాలి. 'రావి' గురించి ఇతరులు రాసిన పుస్తకాలతో పోలిస్తే, ఆయనే స్వయంగా గ్రంథస్థం చేసిన అనుభవాలు, జ్ఞాపకాలను చదివడం మంచిది. హైదరాబాద్ సంస్థానం, దాని తీరుతెన్నులు... ప్రజలు ఎదుర్కొన్న అణచివేతల నుంచి వీర తెలంగాణ మాదేనంటూ ప్రజలు నినదించడం వరకూ చోటు చేసుకున్న అనేక పరిణామాల్లో ఆయన ప్రయాణం, అనుభవాలు ఈ పుస్తకంలో మనకు లభిస్తాయి. పోలీస్ చర్య.. తదనంతర పరిస్థితులను ఆయన నెమరువేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాట సిద్ధాంతాలను 'రావి' చేసిన సమీక్ష కూడా ఇందులో ఉంది. తన సోవియట్ యాత్రానుభవాలను కూడా ఆ యన పంచుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి దారితీసిన పరిస్థితుల నుంచి, ప్రత్యేక తెలంగాణ నినాదం ఉవ్వెత్తున ఎగసిపడుతూ, నిరంతరం ఓ శిఖలా వెలుగుతునే ఉండడానికి కారణాలు ఈ పుస్తకం చదివితేనే తెలుస్తాయి. 'వీర తెలంగాణా నా అనుభవాలు... జ్ఞాపకాలు' పుస్తకం కేవలం 'రావి' స్వగతం మాత్రమేకాదు.. తెలంగాణ చరిత్ర లో ఒక భాగం. 'రావి'ని స్మరించుకోని తెలంగాణ లేదు. తెలంగాణతో మమేకం కాని ఆయన అడుగులు లేవు. ఒక మహా పోరాటయోధుడి అనుభవాల సారమైన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చదవాలి.




### పుస్తకం పేరు

పుస్తకం: రావి నారాయణ రెడ్డి
వీర తెలంగాణ..
నా అనుభవాలు – జ్ఞాపకాలు
వెల: రూ. 110
ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ
(నాగోల్)జీఎస్ఐ (పోస్ట్),
హైదరాబాద్: 500068.
(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్,
సుల్తాన్ బజార్, బండ్లగూడ
(నాగోల్) హైదరాబాద్,
హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ,
ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఈ వారం కవితలు

### గువ్వ ఎగిరిపోయింది!!



సందె వేళకు ఎర్రబడ్డ పొద్దు
ఉరిమి ఉరిమి చూస్తుంటే
ప్రళయం ముంగిట్లో వాలినట్టయింది
వేలాడే తీగల మధ్యనే ప్రయాణం
కలుషితమైన గాలిని చీల్చుంకుంటూ
రోజూ తిండికై అన్వేషణ చేయాలి

ఎండిన మోడుతో మొర పెట్టుకుని
కాలిన కట్టెను దాటుకుంటూనే
ఎండిన గింజకై వెంపర్లాడాలి
వస్తూ పోతూ ఎన్ని చిత్రాల్ని చూడాలో
ఎంత ఎత్తుకు ఎగిరి కిందికి చూసినా

శూన్య గోళంలో ఒక్క పచ్చని మొక్క
జాడ కానరాదు
పెద్ద పెద్ద ఇంటి పైకప్పులు
ఆకాశాన్ని నెట్టివేసే లాగా కానొస్తుంటే
వనాల జాడ అన్వేషణకు
ఆయువు సరిపోవడం
లేదు

ధ్వని తరంగాలు రెక్కలకు తగిలి
గమ్యాన్ని ఏమార్చుతున్నాయి
కాంతి కిరణాలు విరుచుకుపడి
కళ్ళను కప్పేస్తున్నాయి

సాంకేతిక నేలపైన ఇమడలేని గువ్వ
ఎప్పుడో ఎగిరిపోయింది
ఉష్ణ మండలం బద్దలు చేస్తూ
ఇనుప కంచెలు నింగిని తాకుతుంటే
వెంటాడే సొర తుఫాను మధ్యలో
రెక్కలు కాలిన పిట్ట రాలిపోయింది
గువ్వ జాడ కనుమరుగైంది

**– నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**

### ఓ మనిషీ ఆలోచించు!

ఎప్పుడైనా ఆలోచించావా
మట్టి రేణువుల మధ్యలో వున్నామని
ఏ రోజైనా మననం చేసుకున్నావా
ఏడారి నగరంలో జీవిస్తున్నామని
ఏ పొద్దైనా మనసులో అనుకున్నావా
ప్లాస్టిక్ పేపర్ చుట్టుకుని నిద్రిస్తున్నామని

ఏ సమయమైనా క్షణం ఆగి చూసావా
పొగ గొట్టాలకు వేగం పెంచుతున్నామని
ఏ క్షణమైనా యోచన చేసావా
కాలుష్యాన్ని కౌగిలించుకుంటున్నామని
ఏ ఒక్కసారైనా తల పైకెత్తి చూసావా
చిల్లులు పడిన జల్లెడ పొర కింద వున్నామని

ఏ మనిషినైనా తట్టి లేపావా
ధూళి నిండిన స్థలాన్ని బాగు చేసుకోమని
ఏ దినమైనా అంగలార్చుకున్నావా
చేతులారా గాలిని కలుషితం చేసామని
ఏనాడైనా కనుగొన్నావా
ప్లాస్టిక్ పేపర్‌లో భోంచేస్తున్నామని

ఒక పర్యాయమైనా గుర్తు చేసుకున్నావా
చెట్టు లేని నేల కన్నీటికి కారణం మనమేనని
ఒక్క గడియైనా గమనించగలిగావా
అంతరిస్తున్న అరణ్యానికి సాక్ష్యం మనమని
ఒక్క రాత్రైనా కలగన్నావా
పర్యావరణానికి రక్షణ కరువైపోయిందని

ఒక్క అడుగైనా ముందుకు కదిపినావా
అవగాహన కల్పించే పాఠం నేర్పుదామని
ఒక్క మనిషికైనా బోధన చేసావా
గొడ్డలి పెట్టుకు వృక్షం ఆయువు తీస్తే
స్వచ్ఛమైన ఆక్సిజన్ అందక
నువ్వు కూడా అకాల మరణం పొందుతావని

ఒక్క విద్యార్థికైనా హితబోధ చేసావా
ప్లాస్టిక్ పేపరు వాడకంతో
ఆరోగ్యం ప్రమాదపు అంచుకెళ్ళుతుందని
ఒక్కమారైనా వెనక్కి తిరిగి చూసుకున్నావా
కాలుష్యంలో కాలు కదుపుతున్నామని
ఒక్కసారైనా విలాసాన్ని పక్కకు నెట్టి

వ్యసనాలను ఆవల తోచి
నిద్రావస్థను తట్టి లేపి ఆలోచించినావా
వ్యర్థ పదార్థాల మధ్యలో జీవిస్తూ
రబ్బరు పూలతో ఇళ్లు అలంకరించుకుంటూ
కవరు చుట్టిన ఆహారాన్ని మెక్కుతున్నామని
పొగతో గాలిని కలుషితం చేస్తున్నామని

ఒక్కతూరైనా ఆలోచించుకున్నావా
వాతావరణ స్వచ్ఛతకు భంగం తలపెడితే
మనుగడ సాగించలేమని
భూమిపై చాన్నాళ్ళు జీవించలేమని
ఓ మనిషీ ఒక్కసారి ఆలోచించు

**– నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**

### ఓపిక

లోకమన్నది
సాగమన్నది
ఓపికన్నది
ఆగమన్నది!

ఓపికతో సాగితే
ఆగేదేమున్నది!
ఓపిక ఆశల చిరు
మొలక
ఆశయాలకు ప్రతీక


సహనాల అమరిక
శాంత చిత్తం చీరు
దీపిక!
ఆశల ఆశయాలు తీర్చు
ఓర్పు నేర్పు నేనున్నానన్నది!
ఓపిక పట్టండంటే
ఓపినది నెరవేరబోతున్నట్లే

ఓపికతో ఉండండంటే
ఓర్చుకొని
ఎదురుచూడమన్నట్లే!

ఓపిక పట్టి
ఎదురు చూస్తే
నెరవేరనిదేమున్నది!
ఓపిక లేని నాడు
అలుసై పోతావు

ఓపికతో ఉన్న నాడు
అజేయుడవవుతావు!
ఓపిక వెనుకబాటు కాదు
విజయానికి వెసులు
బాటు!

**– పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## దలైలామాకు మోదీ, మార్కో శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా శాంతికి రూపమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దలైలామా జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'పవిత్ర ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా 140 కోట్ల మందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన బలమైన చిహ్నం. మతాలకు అతీతంగా ఆయనిచ్చే సం దేశం ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు జ న్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దలైలామాకు 90వ జన్మదిన శుభాకాంక్ష లు. సమైక్యత, శాంతి, కరుణ సందేశాలతో ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలి' అని తన సందేశంలో ఆకాంక్షించారు. మరోవైపు 9 0 వ పుట్టిన రోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ 'మానవతా విలువ లు, మత శాంతి ప్రచారం చేయడానికి నేను కట్టుబడి ఉంటాను. టిబెట్ సం స్కృతి ప్రపంచానికి మానసిక ప్రశాంతత, కరుణ అందిస్తుంది' అని పేర్కొన్నారు.

### కొందరు జడ్జిల ప్రవర్తనపై ఫిర్యాదులొస్తున్నయ్...

## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడండి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ హితవు

బాంబే హైకోర్టు సన్మాన కార్యక్రమంలో సందేశం



**ముంబయి :** చట్టం లేదా రాజ్యాంగం యొక్క వివరణ 'ఆచరణాత్మకమైనది' సమాజ అవసరాలకు తగిన విధంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) భూషణ్ రామక్రిష్ణ (బిఆర్) గవాయ్ అన్నారు. శనివారం ఇక్కడ బాంబే హైకోర్ట్ ఆయనకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగిస్తూ కొంతమంది సహోద్యోగుల దురుసు ప్రవర్తన గురించి తనకు ఇటీవల ఫిర్యాదులు అందాయని, సంస్థ ప్రతిష్ఠను కాపాడాలని బిఆర్.గవాయ్ న్యాయమూర్తులను అభ్యర్థించారు.గతంలో వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును ఆయన ఈ సందర్భంగా ఉటంకిస్తూ ఏదైనా చట్టం లేదా రాజ్యాంగాన్ని ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల సందర్భంలో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. అర్థం ఆచరణాత్మకంగా ఉండాలి. అది సమాజ అవసరాలకు తగినట్లుగా ఉండాలి అని సిజెఐ సూచించారు. జడ్జిలు తమ మనస్సాక్షి, ప్రమాణ స్వీకారం, చట్టం ప్రకారం పనిచేయాలని భావిస్తున్నారు. కానీ విషయం నిర్ణయించబడిన తర్వాత ఎప్పుడూ కలవరపడకూడదని ఆయన చెప్పారు. ఒక న్యాయమూర్తి ఆ విషయం నుంచి తన మనసును దూరం చేసుకుని ఆ తర్వాత ఏమి జరుగుతుందనే విషయాన్ని మర్చిపోవాలని సిజెఐ గవాయ్ సూచించారు.న్యాయమూర్తుల నియామకం గురించి మాట్లాడుతూ 'న్యాయ వ్యవస్థ స్వతంత్రతకు ఎటువంటి హాని జరుగకూడదు' అని గవాయ్ నొక్కిచెప్పారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టులకు నియామకాలు జరిగేటప్పుడు వైవిధ్యం, సమ్మిళితత్వం ఉన్నప్పుడే యోగ్యతను కొనసాగించేలా కొలీజియం నిర్ధారిస్తుందని అన్నారు. సిజెఐ బిఆర్.గవాయ్ ఒకప్పుడు తాను న్యాయవాదిగా, న్యాయమూర్తిగా పనిచేసిన బాంబే హైకోర్ట్‌ను అభినందించారు. ప్రజలు బాంబే హైకోర్ట్ తీర్పును ప్రశంసించినప్పుడు తాను గర్వంగాఅనుభూతిచెందుతానన్నారు. అయితే, ఇటీవల తనకు సహోద్యోగుల దురుసు ప్రవర్తన గురించి కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన చెప్పారు. 'జడ్జిగా ఉండటం అంటే ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు చేసే ఉద్యోగం కాదని,సమాజానికి,దేశానికిసేవచేసేది'అని ఆయననొక్కిచెప్పారు.న్యాయమూర్తులువారిప్రమాణం,నిబద్ధతకుకట్టుబడిఉండాలి 'అని గవాయ్ కోరారు. దయచేసి ఈ గౌరవనీయ సంస్థకు అపఖ్యాతి తీసుకువచ్చే ఏపనీ చేయకండి. ఈ సంస్థ ఖ్యాతి తరతరాలుగా న్యాయవాదులు, న్యాయమూర్తులు అంకితభావంతో పనిచేసి నిర్మించినదని సిజెఐ చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన మరొక కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్యాంగం ఈ దేశంలోని ప్రతీ చివరి పౌరుడి కోసం, అది న్యాయమూర్తి లేదా న్యాయవాది, లేదా ఒక కార్యనిర్వాహకుడు లేదా పార్లమెంటేరియన్ అయినప్పటికీ పనిచేస్తుంది' అని సిజెఐ తెలియజేశారు. 'అన్ని వివక్షతల నిర్మూలనకు మన జీవితాలను అంకితం చేద్దాం. రాజ్యాంగ విలువలను నిలబెట్టడానికి మనలను మనం అంకితం చేద్దాం. మన రాజ్యాంగ వాగ్దానాల నేరవేర్చడానికి మనలను మనం అంకితం చేద్దాం' అని గవాయ్ ఉద్ఘాటించారు.

### 'బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్' ఏర్పాటులో...

## ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్రే కీలకం

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్

బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ బ్రెజిల్‌లో ఉండగా.. కాంగ్రెస్ విజ్ఞప్తి



**ముంబయి :** బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రెజిల్‌లో ఉన్న నేపథ్యంలో బ్రిక్స్ ఆవిర్భావంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కీలక పాత్రను ఆదివారం కాంగ్రెస్ పార్టీ గుర్తు చేసింది. బ్రిక్స్ ఏర్పాటుకు దారితీసిన సంఘటనలను, 2012 సంవత్సరంలో భారతదేశం నిర్వహించిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ జ్ఞప్తి చేసింది. ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పాటును ప్రతిపాదించారని తెలియజేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌ఛార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ఘనా, ట్రినిడాడ్ మరియు టొబాగో, అర్జెంటీనాలో పర్యటించిన తర్వాత విమానాలలో తరచూ ప్రయాణించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బ్రెజిల్ చేరుకున్నారు. 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం రియో డి జెనీరోలో ప్రారంభం అవుతోంది. 1998లోనే అరబిక్ మాట్లాడుతూ ఆసియావైపు మొగ్గుచూపే రష్యా ప్రధానమంత్రి యెవ్‌గెనీ ప్రిమకోవ్ ఆర్‌ఐసి (రిక్) రష్యా, భారతదేశం, చైనా అనే త్రైపాక్షిక వేదిక ఆలోచనను ముందుకు తెచ్చారని జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. అమెరికా విజయం సాధించినప్పుడు ప్రపంచ విజయాలలో బహుళ ధ్రువణతను ప్రోత్సహించడానికి ఇది జరిగిందని జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. 2001 నవంబర్‌లో జిమ్ ఓ నీల్, అతడి పరిశోధనా బృందం న్యూయార్క్‌లోని గోల్డ్‌మన్ సాచ్స్ వద్ద టైటిల్‌తో బెటర్ గ్లోబల్ ఎకనామిక్ బ్రిక్స్ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా అనే శీర్షికతో ఒక నివేదికను అందజేశారు. ఇవి భవిష్యత్తు కోసం నాలుగు శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలుగా గుర్తించబడ్డాయి' అని ఆయన చెప్పారు. ఆ నివేదిక ఇప్పటికీ చదవడానికి చాలా ఆసక్తిగా ఉందని రమేశ్ తెలిపారు. ఆ తర్వాత జులైలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన జి8 శిఖరాగ్ర సమావేశంలో (రష్యా అప్పుడు 7వ సభ్య దేశంగా ఉండి 2014తర్వాత మినహాయించబడింది) అని ఆయన చెప్పారు. రష్యా, చైనా, బ్రెజిల్, భారత ప్రధానమంత్రి సమావేశమై బ్రిక్స్ ఏర్పాటుకు వారి అంగీకారం తెలిపారని జైరామ్ రమేశ్ చెప్పారు. బ్రిక్ దేశాల మొట్టమొదటి శిఖరాగ్ర సమావేశం బ్రెజిల్, ఇండియా, చైనాతో 2009 జూన్‌లో రష్యాలో జరిగిందని, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఈ సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. 2010లో సౌత్ ఆఫ్రికా బ్రిక్స్ అనే చతుష్టయంలో చేరిందని, ఆ తర్వాత 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యుఏఇ చేరాయని, ఈ ఏడాది ఇండోనేషియా కూడా బ్రిక్స్‌లో చేరిందని జైరామ్ రమేశ్ వివరించారు. భారత దేశ ం మొట్టమొదటిసారిగా 2012మార్చిలో బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిందని రమేశ్ తెలిపారు. డాక్టర్ మన్మోమన్ సింగ్ బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పాటును ప్రతిపాదించిన ఆ సమావేశం న్యూఢిల్లీలో జరిగిందని చెప్పారు. ఇదిలాఉంటే నాలుగురోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడం కోసం రియోడీజెనీరోకు చేరుకున్నారు, ఆతర్వాత ఆయన ఒక రాష్ట్ర పర్యటనకు వెళ్లనున్నారు. శనివారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి న్యూయార్క్‌లోని గలేయో అంతర్జాతీయ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఇది ఆయన ఐదు దేశాల పర్యటనలో నాలుగవది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాతో ప్రాతినిధ్యం వహించిన బ్రిక్స్‌లో ప్రస్తుతం అదనంగా మరో ఐదుగురు సభ్యులు తోడయ్యారు. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఇ) దేశాలు అదనపు సభ్యదేశాలతో మరింత విస్తరించింది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘనా, ట్రినిడాడ్ మరియు టొబాగో, అర్జెంటీనాలను సందర్శించారు. ఆయన చివరగా నమీబియా పర్యటన కోసం వెళ్లనున్నారు.

## జస్టిస్ చంద్రచూడ్ ఇంటిని స్వాధీనం చేసుకోండి

కేంద్రానికి సుప్రీంకోర్టు లేఖ

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చం ద్రచూడ్... గడువు ముగిసినా అధికారిక నివాసాన్ని ఖాళీ చేయకపోవడంతో ఆ బంగ్లాను స్వాధీనం చేసుకోవాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు యంత్రాంగం లేఖ రాసింది. దిల్లీలోని కష్ణా మీనన్ మార్గ్‌లో ఉన్న 5వ నంబర్ బంగ్లాను సీజేఐకి కేటాయించడం ఆనవాయితీగా వస్తున్నది. జస్టిస్ చంద్రచూడ్ గతేడాది నవంబరులో సీజేఐగా పదవీ విరమణ చేశారు. ఇప్పటికీ ఆయన అదే బంగ్లాలో నివాసం ఉంటూ వస్తున్నారు. నిబంధనల మేరు పదవీ విరమణ తర్వాత భవనంలో ఉంటేందుకు ఆరు నెలల గడువు ఉంటుంది. అయితే, ఆయనకు మే 10తో గడువు ముగిసింది. ప్రత్యేక అనుమతితో మే 31 వరకు పొడిగించినా బంగ్లాను ఖాళీ చేయలేదు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు యంత్రాంగం ఈ నెల ఒకటిన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. జస్టిస్ చంద్రచూడ్ నుంచి బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని... ఆయనకు ఇచ్చిన గడువు ముగిసిందని సుప్రీంకోర్టు లేఖలో స్పష్టం చేసింది. అయితే, దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. తప్పనిసరి వ్యక్తిగత కారణాలతో ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విషయం సైతం యంత్రాంగానికి తెలుసునన్న ఆయన... ప్రత్యేక అవసరాలున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారని చెప్పారు. వారి ఆరోగ్య పరిస్థితి (నెమాలిన్ మయోపతి) నేపథ్యంలో వారి కోసం అనువుగా ఉండే ఇల్లు చూసుకునేందుకు కొంత సమయం పట్టిందన్నారు. ప్రభుత్వం తనకు ప్రత్యామ్నాయ వసతి కేటాయించిందని... అయితే, ఆ ఇల్లు చాలాకాలం మూసి ఉండడంతో కొన్ని మరమ్మతులు జరుగుతున్నాయని.. పూర్తయిన వెంటనే అందులోకి మారిపోతానని స్పష్టం చేశారు. తాను అత్యున్నత పదవిలో పని చేశానని... బాధ్యతలు తనకు తెలుసునన్నారు. కొద్దిరోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేశారు. అయితే, సుప్రీం కోర్టు యంత్రాంగం ఓ మాజీ సీజేఐని అధికారిక నివాసం ఖాళీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాయడం ఇదే తొలిసారి.

## సవరణ (ఎస్ఐఆర్) మీ ఆదేశాల ప్రకారమే జరుగుతోంది:ఇసి

**పాట్నా :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్) తమ ఆదేశాల ప్రకారం జరుగుతోందని, ముసాయిదా జాబితాలో గణన ఫారాలు అందిన ప్రస్తుత ఓటర్ల పేర్లు ఉంటాయని ఎన్నికల సంఘం ఆదివారం తెలిపింది. విపక్ష పార్టీల నిరసనల నేపథ్యంలో బిహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ఓటర్ల జాబితాలలో మార్పుపై సోషల్ మీడియా పోస్టల మధ్య ఇసిపై విధంగా వ్యాఖ్యలు చేసింది. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నోటిఫికేషన్ ప్రకారం ఈ ప్రక్రియ కచ్చితంగా జరుగుతోందని బిహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) సోషల్ మీడియా పోస్ట్ స్పష్టం చేసింది. జూన్ 24, 2025 నాటి ఇసిఐ ఆదేశాల మేరకు బిహార్‌లో ఎస్ఐఆర్‌లో పురోగతి ఉన్నదని, ఆ ఆదేశం ప్రకారం, ఆగస్టు 1, 2025న జారీ చే యబడే ముసాయిదా ఓటర్ల జాబితాలో గణన ఫారాలు అందిన ప్రస్తుత ఓటర్ల పేర్లు ఉంటాయని సిఇఒ ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఈ ప్రస్తుత ఓటర్లు మొదట తమ గణన ఫారాలను సమర్పించిన తర్వాత కూడా పత్రాలను సమర్పించడానికి సమయం ఉంటుందని, అన్ని కార్యకలాపాలు ఇసిఐ ఆదేశం ప్రకారం కచ్చితంగా జరుగుతాయని సిఇఒ చెప్పారు. అవసరమైన పత్రాలు లేని వారు సంబంధిత అధికారులకు వారి గణన ఫారాలను మాత్రమే సమర్పించవచ్చు అని వార్తాపత్రికలలో ఇసిఐ ప్రకటన వెలువడిన తరువాత దానిపై స్పష్టతనిచ్చారు. రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో మాత్రమే నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌ను ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకించాయి. వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా జూలై 9న రాష్ట్రంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి.



### హత్యాయత్నం కేసులో

## ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్

**అహ్మదాబాద్:** హత్యాయత్నం కేసులో గుజరాత్ ఆప్ ఎమ్మెల్యేను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ పంచాయతీ కార్యకర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆప్ ఎమ్మెల్యే చైతర్ వాసవను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. శనివారం రాత్రి వాసవ నియోజకవర్గం దేడియాపాడులో జరిగిన సమావేశంలో ఘర్షణ నెలకొంది. స్థానిక సమన్వయ కమిటీ 'ఆప్నో తాలూకో వైబ్రంట్ తాలూకో' (ఏటీవీటీ)లో నియామకం కోసం తన నామినీని నిర్లక్ష్యం చేశారంటూ ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. పంచాయతీ మహిళా ప్రెసిడెంట్‌ను దుర్భాషలాడటంతో పాటు పంచాయతీ అధ్యక్షుడిపై దాడికి దిగినట్లు ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆస్తులను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అయితే ముందుగా తనపై మొబైల్ ఫోన్ విసిరారని, తలకి గాయాలయ్యాయని, అనంతరం గాజు గ్లాస్‌తో కొట్టేందుకు యత్నించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరెస్ట్‌ను ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఖండించారు. విశావదర్ ఉప ఎన్నికలో ఆప్ ఇటీవల విజయం సాధించడంతో ఆప్ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార దాడిగా అభివర్ణించారు. దాడులతో ఆప్‌ను భయపెట్టాలని భావిస్తే అది తప్పని అన్నారు.

## 27కు చేరిన కరాచీ భవన మృతుల సంఖ్య

**కరాచీ :** పాకిస్థాన్ నగరం కరాచీలో మూడు రోజుల క్రితం భవనం కుప్పకూలిన ప్రమాదంలో మృతులసంఖ్య 27కు పెరిగింది. సహాయబృందాలు ముమ్మరంగా శిథిలాలను తొలగించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి. శిథిలాల నుండి సిబ్బంది మృతదేహాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండవచ్చు. కరాచీలో ఐదు అంతస్తుల భవనం గడచిన శుక్రవారంనాడు కుప్పకూలింది. 1974లో నిర్మించిన ఈ భవనాన్ని ఖాళీచేయాలని ఆదేశిస్తూ, దీనిని కుప్పకూలే భవనాల జాబితాలో ప్రభుత్వం చేర్చింది. కరాచీ ల్యారీ ప్రాంతంలో ఈ భవనం ఉంది. ఈ ప్రాంతం పాకిస్థాన్‌లో హింస చెలరేగే అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల జాబితాలో ఉంది. ఈ భవనంలో నివసించడం అంత క్షేమం కాదని 2022 నుండి 2024 వరకూ నివాసితులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసినాగానీ ఎవ్వరూ లక్ష్యపెట్టలేదని అధికారులు చెప్పారు. ఐతే భవనం యజమానులు, స్థలం యజమానులు మాత్రం తమకు ఎలాంటి నోటీసులూ అందలేదని చెబుతున్నారు. తన కుమార్తె ఇంకా శిథిలాల్లోనే ఉండిపోయిందని 54 సంవత్సరాల వయసుగల తండ్రి దేవ్‌రాజ్ విలపిస్తూ చెప్పారు.

## దేశ నేర రాజధానిగా బిహార్

ప్రభుత్వాన్ని మార్చేందుకే కాకుండా

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ఓటేయండి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల కాల్చి చంపడంతో కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకులు రాహు ల్ గాంధీ స్పందించారు. బిజెపి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కలిసి బీహార్‌ను 'భారతదేశ నేర రాజధాని'గా మార్చార ని ఈ ఘటన మరోసారి నిరూపించిందని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్ర మే కాకుండా, రాష్ట్రాన్ని కాపాడటానికి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హాజీపూర్‌లో తన కొడుకును దుండగులు కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత, ఖేమ్కాను పాట్నాలోని తన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు కాల్చి చంపాడని పోలీసులు శనివారం తెలిపారు. కాగా, రాహుల్‌గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'నేడు బిహార్ దోపిడీ, తుపాకీ కాల్పులు, హత్యల నీడలో జీవిస్తోంది. నేరాలు ఇక్కడ కొత్త సాధారణ స్థితికి చేరుకున్నాయి. ప్రభు త్వం పూర్తిగా విఫలమైంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'బిహార్ సోదరసోదరీమణులారా ఈ అన్యాయాన్ని ఇక సహించలేము. మీ పిల్లలను రక్షించలేని ప్రభుత్వం... మీ భవిష్యత్తుకు కూడా బాధ్యత వహించ దు' అని రాహుల్ ఆవేదన చెందారు. ప్రతి హత్య, ప్రతి దోపిడీ, ప్రతి బుల్లెట్ మార్పు కోసం కేకలు వేస్తోందని అన్నా రు. ఇప్పుడు కొత్త బిహార్‌ను చూసేందు కు సమయం వచ్చిందని, ఈ కాలంలో భయం కాకుండా పురోగతి ఉంటోందన్నారు. ఈసారి ఓటు ప్రభుత్వాన్ని మా ర్చడం కోసం మాత్రమే కాకుండా, బిహార్‌ను కాపాడటం కోసం వేయాలని ఆయన సూచించారు. వ్యాపారవేత్త హత్యపై జ రుగుతున్న దర్యాప్తును పర్యవేక్షించడానికి స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు, సెంట్రల్ డిస్ట్రిక్ట్ పోలీస్ స్లూత్‌లతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఘటన జరగడం రాజకీ య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఎస్ఐఆర్‌పై 'సుప్రీం'కు మహువా మొయిత్రా

**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు... స్పెషల్ ఓటర్ల జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ని ర్వహించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని వివిధ నిబంధనలు ఉల్లంఘిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోందని... గత నెల 24న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఆమె పిటిషన్‌లో అభ్యర్థించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. బీహార్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ జరుగుతోందని... ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1), 21, 325, 328, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 ఎన్నికల నమోదు నియమాలు, 1960లోని నిబంధనలను ఉల్లంఘించినట్లేనన్నారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే దేశంలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బీహార్‌తో పాటు బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయడాన్ని నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని మహువా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నా... గతంలో అనేకసార్లు ఓటు వేసిన ఓటర్లంతా తమ అర్హతను నిరూపించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంటుందని... ఇది ఆర్టికల్ 326కి విరుద్ధమని పేర్కొన్నారు. మొయిత్రా తరపున న్యాయవాది నేహా రతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాల్ చేస్తూ ఏడీఆర్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది.



### ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహం


రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోగస్ ఓట్ల ఏరివేతలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. ఈ ప్రక్రియను వేగవంతంగా సాగేందుకు కషిచేస్తున్న ఎన్నికల సిబ్బంది ఒక్కొక్కరికి రూ. ఆరువేలు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.

## ఎఫ్–35 యుద్ధ విమానానికి మరమ్మతులు



**తిరువనంతపురం:** కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన యుద్ధ విమానం ఎఫ్35బీకి మరమ్మతు చేసేందుకు, విమానాన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. యుద్ధవిమానం మరమ్మతు పనులు చేసేందుకు బ్రిటన్ నుంచి 24 మంది ఏవియేషన్ ఇంజినీర్ల బందం ప్రత్యేక పరికరాలతో ఆదివారం కేరళ చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులు చేయడానికి దానిని హ్యాంగర్‌కు తరలించారు. రానున్న రోజుల్లో దీన్ని సీ17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో తరలించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన అన్ని మరమ్మతులు, భద్రతా తనిఖీల తర్వాత విమానం తిరిగి సేవలు ప్రారంభిస్తుందని బ్రిటిష్ హైకమిషన్ అధికారి తెలిపారు. తద్వారా ఇతర విమానాల షెడ్యూల్ నిర్వహణకు ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. కేరళ విమానాశ్రయంలో ఉన్న ఫైటర్ జెట్ ఎఫ్35 బీ విమానానికి భారీ భద్రత కల్పించామని, సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది కాపలాగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. గత నెల ఇండో-యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్35బీ విమానంలో సమస్య తలెత్తింది. దీంతో జూన్ 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరతతో దీన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉన్నట్లు ఆ తర్వాత బ్రిటన్ అధికారులు వెల్లడించారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. మరమ్మతులు నిర్వహించినా విమానం మొరాయించడంతో అప్పటి నుంచి దాదాపు ఈ ఫైటర్‌జెట్ ఎయిర్ పోర్టులోనే ఉంది.


## ఇతర రాష్ట్రాలకూ భాషా ఉద్యమం వ్యాప్తి:స్టాలిన్



**చెన్నై:** జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా, హిందీ భాష రుద్దడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్నారు. హిందీ భాషకు వ్యతిరేకంగా థాక్రే సోదరులు ఒక్కటయ్యారు. ఈ కలయికను స్టాలిన్ స్వాగతించారు. తమిళనాడులో ప్రస్తుతం ఉన్న ద్విభాషాతమిళం, ఇంగ్లీష్ అమలులో ఉంది. అయితే, బిజెపి ప్రభుత్వం హిందీని తమిళనాడుపై విధిస్తోందని స్టాలిన్ ఆరోపిస్తున్నారు. థాక్రేల ర్యాలీ తర్వాత ఎక్స్‌లో స్టాలిన్ కీలక పోస్ట్ పెట్టారు. భాషా హక్కుల కోసం పోరాటం రాష్ట్ర సరిహద్దులు దాటిందని, మహారాష్ట్రలో ఊపు కనిపిస్తోందని ఆయన అన్నారు. 'హిందీ విధించడాన్ని ఓడించడానికి డిఎంకె, తమిళనాడు ప్రజలు తరతరాలుగా సాగుతున్న భాషా హక్కుల పోరాటం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటింది. మహారాష్ట్రలో నిరసన తుపానులా ఎగిసిపడుతుంది' అని స్టాలిన్ అన్నారు. 'తమిళనాడు పాఠశాలల్లో హిందీని మూడవ భాషగా బోధిస్తేనే నిధులు కేటాయిస్తామని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా, అరాచకంగా వ్యవహరించే బిజెపి... అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ప్రజల తిరుగుబాటు భయంతో రెండవసారి వెనక్కి తగ్గవలసి వచ్చింది' అని స్టాలిన్ అన్నారు.

## సామాజిక సమానత్వంలో భారత్ భేష్

కేంద్ర సామాజిక సంక్షేమ శాఖ ప్రకటన




**న్యూఢిల్లీ:** అత్యంత సామాజిక సమానత్వం ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సహా 167 దేశాల కంటే మెరుగైన స్థానం సంపాదించింది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక, సంక్షేమ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించే చర్యలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోనే ఈ సమానత్వం సాధ్యమైందని చెప్పుకొచ్చింది. మొత్తం 171 దేశాలతో కూడిన జీని ఇండెక్స్‌లో భారత్ 25.5 పాయింట్లతో స్లోవాక్ రిపబ్లిక్ (24.1), స్లొవేనియా(24.3), బెలారస్ (24.4) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. భారత స్కోరు 2011లో 28.8 పాయింట్లుగా ఉండగా... 2022 నాటికి 25.5 పాయింట్లకు మెరుగుపడిందని వివరించింది. జీని ఇండెక్స్‌లో బ్రిటన్ (32.4), చైనా (35.7), అమెరికా (41.8) మనకన్నా వెనుకబడ్డాయని పేర్కొంది. 'భారత ఆర్థిక పురోగతి పౌరుల మధ్య సమానంగా ఉందని ఈ నివేదిక వెల్లడించింది. పేదరికం తగ్గింపు, విస్తతంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, జన్‌ధన్ యోజన, ఆధార్ వంటివాటితో నేరుగా సంక్షేమ పథకాల నగదు బదిలీ, ఆయుష్మాన్ భారత్‌తో వైద్య సదుపాయం వంటివి దీనికి కారణం. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 2011 నుంచి 2023 మధ్య 17.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం 16.2 శాతం నుంచి 2.3 శాతానికి తగ్గింది' అని సామాజిక సంక్షేమశాఖ ప్రకటనలో పేర్కొంది.

## ప్రాణం తీసిన అక్రమ సంబంధం

**నాగపూర్:** గ్యాంగ్ లీడర్ భార్యతో వివాహేతర సంబంధం ఓ వ్యక్తి కొంపముంచింది. ఆమె మరణం అతడి చావుకు వచ్చింది. 40 మంది ఉన్న ఆ గ్యాంగ్ అతడి కోసం వెంటాడుతోంది. ప్రాణ భయంతో ఆ వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఇప్ప గ్యాంగ్‌కు పోలీసు రికార్డుల్లో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పేరుంది. అర్షద్ టోపి అనే వ్యక్తి ఆ గ్యాంగులో సభ్యుడిగా ఉన్నాడు. అతడు ఏకంగా ఆ గ్యాంగ్ లీడర్ భార్యతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు. ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుస్తూ ఉండేవారు. బయట తిరుగుతూ ఉండేవారు. గురువారం ఇద్దరూ బైకు మీద బయటకు వెళ్లారు. వారు ప్రయాణిస్తున్న బైకు ప్రమాదానికి గురైంది. గ్యాంగ్ లీడర్ భార్య తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. అర్షద్ మాత్రం చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. భార్య చనిపోవటంతో ఇప్పుడు గ్యాంగ్ లీడర్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తన భార్యకు, అర్షద్‌కు సంబంధం ఉందని తెలియటంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. తన భార్య చావుకు అర్షద్ కారణమని గ్యాంగ్ లీడర్ భావించాడు. అతడ్ని చంపి పగ తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. గ్యాంగ్ మొత్తం అర్షద్‌కు వ్యతిరేకంగా మారింది. అతడ్ని వెతికిపట్టుకుని చంపాలని నిర్ణయించుకున్నారు. ఇప్ప గ్యాంగ్ అర్షద్ కోసం గాలిస్తోంది. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియటంతో అర్షద్ డీసీపీ ఆఫీస్‌కు వెళ్లాడు. పోలీసులను కలిసిన తర్వాత అర్షద్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇప్ప గ్యాంగ్ అతడిని పట్టుకోవడానికి వేటాడుతోంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మోదీ పాలనలో బిసిలకు ఏం మేలు చేశారు?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలో మోదీ ప్రభుత్వ 11ఏళ్ల పాలనలో బిసిలకు ఏం చేయలేదని కాంగ్రెస్ మాజీ ఎంపి వి.హనుమంతరావు ఆరోపించారు. మూడు సార్లు మోదీని కలసి, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం లేదన్నారు.ఈ నెల 15న కర్నాటకలో జరుగనున్న సీనియర్ కాంగ్రెస్ ఒబిసి నాయకుల సమావేశానికి కర్నాటక సిఎం సిద్ధరామయ్య తనకు ఆహ్వానం పంపించారని వివరించారు. ఎంఎల్‌సి కవిత ఎందుకు రైల్ రోకో చేపడుతుందో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాము 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోతే రైల్ రోకో నిర్వహించాలన్నారు. సామాజిక న్యాయ సమరభేరి సభ విజయవతంమైందనిచెప్పారు. పలు ఆందోళన కార్యక్రమాల సందర్భంగా కార్యకర్తలపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికి పదవులు ఇవావలని ఇటీవల జరిగి పిఎసి సమావేశంలో ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే చెప్పినట్టు హనుమంతరావు తెలిపారు.

## రేపు 'వెలుగుల వెనుక' ఆవిష్కరణ



**హైదరాబాద్ :** నవచేతన పబ్లిషింగ్ హౌస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కథా రచయిత, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ కథా సంపుటి 'వెలుగుల వెనుక' ఆవిష్కరణ సభ ఈ నెల 8వ తేదీన రవీంద్ర భారతిలో సాయంత్రం ఐదు గంటలకు జరగనున్నట్లు తెలంగాణ అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు యూనివర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, విశిష్ట అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లు పాల్గొనున్నారు. ప్రత్యేక అతిథులుగా బిసి కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు, నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ ఎన్. మధుకర్, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కథా, నవలా రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య, ప్రముఖ కథారచయిత, విమర్శకులు ఆడెపు లక్ష్మీ పతిలు హాజరు కానున్నారు.

## ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయండి
### యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పిఆర్‌సి అమలు గడువు ముగిసి రెండు సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పదవీ విరమణ అనంతర ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. చావ రవి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లేదంటే పోరాటాలకు ఉపాధ్యాయ, ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గురుకులాల పని వేళలు శాస్త్రీయంగా సవరించాలని, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్ధ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ ఈ నెల 9న సార్వత్రిక సమ్మెకు టిఎస్ యుటిఎఫ్ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆగస్టు 8,9,10 తేదీల్లో కోల్‌కొత్తాలో జరిగే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గా భవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాములు,రాజశేఖరరెడ్డి,శాంతకుమారి,నాగమణి, రంజిత్ కుమార్, రాజు, మల్లారెడ్డి ,శ్రీధర్, రవికుమార్, రవిప్రసాద్‌గౌడ్, జ్ఞాన మంజరి,సింహాచలం, వెంకటప్ప,యాకయ్య కొండలరావు ఉన్నారు.

## ''వంద కొడతాం.. బిఆర్‌ఎస్‌ను బొంద పెడతాం''
### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో తాము వంద సీట్లు కొడతాం.. బిఆర్‌ఎస్‌ను బొందపెడతాం అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి నుంచి మా నినాదం ''వంద కొడదాం..బిఆర్‌ఎస్ ను బొందపెడదాం''..అని అన్నారు. తెలంగాణ ప్రజలు మీ మోహం మీద ఉమ్మేసినా అహంకారం, బలుపు ఏ మాత్రం తగ్గలేదని కెటిఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. నీకు ఇప్పటికే చాలా సార్లు చెప్పాం.. అయినా బలుపు తగ్గించుకోవడం లేదు.. అని అన్నారు.కెటిఆర్.. నువ్వో బచ్చా.. నీతో మా సిఎం చర్చకు రావాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో చర్చకు రమ్మంటే నువ్వు, నీ అయ్య ముందుకు రావడం లేదన్నారు. ప్రజలు ఛీ కొడితే ఫామ్ హౌస్ , గెస్ట్ హౌస్‌లకు పరిమితమైన మీకు, మా రేవంత్ రెడ్డి తో పోటీ నా..? అని పేర్కొన్నారు. మా రేవంత్ రెడ్డి మిమ్మల్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు.. పార్లమెంట్ ఎన్నికల్లో జీరో చేశారు.. ఎంఎల్‌సి ఎన్నికల్లో మీకు అభ్యర్థులు లేకుండా చూశాడు.. మా రేవంత్ రెడ్డి తొడగొట్టి మిమ్మల్ని పడగొట్టారు.. ఇప్పటికైనా కెటిఆర్ వక్ర బుద్ధి మార్చుకో.. నీకంటే ఎక్కువ భాష మాట్లాడటం మాకూ వచ్చు...కాని సంస్కారం ఉంది.. అని అన్నారు.

### కెటిఆర్‌తో చర్చకు సిద్ధం: గజ్జల కాంతం

కెటిఆర్ నీ సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మీ స్థాయికి మా ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎంఎల్‌ఎ మైనంపల్లి రోహిత్ రావు వస్తారు.. మీరు చర్చ వస్తారా.. మేమే ఏర్పాట్లు చేస్తాం. రండి. దేని పైన అయిన చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. సిఎం రేవంత్ రెడ్డి పై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గజ్జల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రజా సమస్యల పై కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే..అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడాలి కదా అని ప్రశ్నించారు. రోడ్ల పైన చర్చ పెట్టడానికి..కెటిఆర్ ఎమ్మెల్యే నా.. సర్పంచ్ హా.. అన్నారు.కెసిఆర్‌కు మొదటి గురువు ఎన్‌టిఆర్.. రెండవ గురువు చంద్రబాబు అని ఎద్దేవ చేశారు. రేవంత్‌రెడ్డిస్వయంకృషితోసిఎంఅయ్యారన్నారు.

## 8 గంటల పని విధానాన్ని 10కి పెంచడం కార్మిక విద్రోహమే
### సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంతే వేగవంతంగా అమలు చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా విమర్శించారు. అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగో లేబర్ కోడ్లను తీసుకువచ్చి ద్రోహం చేయగారాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ ఈనెల 5నజీవో 282 ను జారీ చేయడం కార్మిక వర్గానికి విద్రోహం చేయడమే అన్నారు. వీటికి వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతున్న నేపథ్యంలోఆంధ్ర ప్రదేశ్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వం పని గంటలు పెంచడం సరికాదని ఆయన పేర్కొన్నారు.. ఇప్పటికే కేరళ లెఫ్ట్ ప్రభుత్వం, తమిళనాడు ప్రభుత్వం లేబర్ కోడ్లను అమలు చేయబోమని ప్రకటించాయని, అలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించకపోవడం మోడీ ప్రభుత్వంతో అంటగాగడంలో భాగమేనని ఆరోపించారు. పని గంటలు పెంచుతూ తీసుకువచ్చిన జీవో 282 ను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎఐసిసిటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నేటి నుంచి వన మహోత్సవం

### రాజేంద్రనగర్‌లో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా 18.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం..
రైతులకు వ్యక్తిగత ఆదాయాన్నిచ్చే పండ్ల మొక్కలకు ప్రాధాన్యత



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వనమహోత్సవం సోమవారం నుంచి ప్రారంభం కానున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో అధికారికంగా ప్రారంభించనున్నారు. వనమహోత్సవానికి అటవీశాఖ అధికారులు నెల రోజుల నుంచి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇతర శాఖల ఉన్నతాధికారుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందించారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మొక్కలు నాటే నాటేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాదిలో వనమహోత్సవంలో రాష్ట్ర వ్యాప్తంగా 18.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగా కాకుండా నాటిన ప్రతీ మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందస్తూ ప్రణాళికలు తయారు చేశారు. ముఖ్యంగా నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భావిస్తున్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటనున్నారు. రైతులకు వ్యక్తిగత ఆదాయానిచ్చే పండ్ల మొక్కలు పెద్దఎత్తున నాటేందుకు పంపిణీ చేయనున్నారు. ఇంటి ఆవరణంలో పెంచే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రధానంగా పండ్ల మొక్కలను ఎక్కువగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పూల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోనున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేస్తేనే వర్షాకాలం పూర్తయ్యేనాటికి నాటిన మొక్కలు దాదాపు 90 శాతానికి పైగా బతుకుతాయని అంచనా వేస్తున్నారు. 2024లో శాఖల వారీగా, జిల్లాల వారీగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు రూపొందించగా 19.04 కోట్లు నాటినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సారి వంద శాతం మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఖర్చులు తగ్గించుకునే కార్యక్రమంలో భాగంగా నాటే మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి నాటకుండా అదే గ్రామంలోవన నర్సరీల ద్వారా పెంచిన మొక్కలు అదే గ్రామంలో నాటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలనుంచి మొక్కలు తీసుకొస్తే రవాణా ఖర్చులు, మొక్క కొనుగోలు ఖర్చులు, నిర్వహణ ఖర్చులు కలిసి భారం అవుతాయని, ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతుందని భావించి స్థానికంగా లభించే మొక్కలు నాటాలని స్థానిక అధికారులకు సూచించారు.

### స్థానికుల భాగస్వామ్యం

మొక్కలు నాటే కార్యక్రమం, వాటిని పెంచేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులను భాగస్వాములుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇంటి పేరట్లో గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను పంపిణీ చేయనున్నారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటనున్నారు. ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించేందుకు ప్రణాళికలు పూర్తి చేశారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం మొదటి సారిగా నిర్ణయించింది.

గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 7 కోట్ల మొక్కలు లక్ష్యం మొక్కలు నాటే శాఖలలో గ్రామీణాభివృద్ధి శాఖ ఇతర శాఖల కంటే ఎక్కువ మొక్కలు నాటనున్నది. ఈ శాఖ పరిధిలో 7 కోట్ల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 2.30 కోట్ల మొక్కలు నాటేందుకు కావల్సిన గుంతలను సిద్ధం చేసి ఉంచారు. ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు చివరి నాటికి మొక్కలు నాటే కార్యక్రమాని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈసారి తాటి, ఈత మొక్కలు నాటేందుకు పెద్దపీట వేశారు. అత్యధికంగా ఈ సంవత్సరం 25 లక్షల తాటి, ఈత మొక్కలు నాటనున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతే కాకుండా రైతులకు వ్యక్తిగతంగా ఆదాయాన్ని సమకూర్చే పండ్ల తోటల మొక్కలు నాటేందుకు తొలి ప్రాధాన్యత కల్పించారు. సుమారు 22 వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు పెంచనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 కోట్ల మొక్కలు నాటేందుకు వివిధ నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# పిచ్చి పిచ్చిగా మాట్లాడితే తోలు తీస్తారు

### బిఆర్‌ఎస్‌కు మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్ వార్నింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన ప్రభుత్వంపై, సిఎం రేవంత్‌రెడ్డిపై పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ప్రజలు తోలు తీస్తారని బిఆర్‌ఎస్ నేతలకు మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవర్తి అనీల్ వార్నింగ్ ఇచ్చారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనీల్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆర్థికంగా కెసిఆర్ కుటుంబం దివాళా తీయించిందని..అరబ్ దేశాల్లో ఇలా చేస్తే స్టేడియంలో రాళ్ళతో కొట్టి చంపుతారు అని చెబుతున్నారని, అలాంటి శిక్ష వేసిన మీకు తప్పులేదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తో మీకు పోలిక ఏంటి.. కేటీఆర్ అని ప్రశ్నించారు. మీ ఇంట్లోనే సక్కగా లేదు ముందు అది సరిదిద్దుకోండని హితవు పలికారు. పదేళ్లలో ఎందుకు ఉద్యోగాల భర్తీ చేయలేదు..ఆంధ్రా కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి.. డబ్బులు వసూలు చేసుకున్నారని ఆరోపించారు. దొంగనే దొంగ దొంగ అన్నట్లు ఉంది మీ వాలకం చూస్తుంటే అని పేర్కొన్నారు. ప్రజలను నిండా మోసం చేసిన ఘరానా మోసగాళ్ళు బిఆర్‌ఎస్ నేతలని అన్నారు. బిఆర్‌ఎస్ చెప్పినట్లు నిరుద్యోగ భృతి ఏం అయ్యింది అని ప్రశ్నించారు. మీకు సిఎం రేవంత్ రెడ్డి అవసరమే లేదు.. నేను చాలు చర్చించడానికి అని అన్నారు. నేను ప్రెస్ క్లబ్‌కి వస్తా అన్నింటి మీద చర్చ పెడదాం.. అని కెటిఆర్‌కు సవాల్ విసిరారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందో లేదో అని ప్రవళిక ఉరివేసుకుంటే.. నిందలు వేసిన పార్టీ బిఆర్‌ఎస్ అని గుర్తు చేశారు.

### కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఉంది..

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు సిఎం రేవంత్‌రెడ్డికి ఏం పోలిక అని ప్రశ్నించారు. నువ్వు రాజీనామా చెయ్యి. నేను చేస్తా ఇద్దరం బీసీలకు పదవులు ఇద్దాం అని రామచందర్‌రావు అనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ లో సామాజిక న్యాయం ఉందని పేర్కొన్నారు.మొన్నటి ప్రెసిడెంట్ కిషన్ రెడ్డి ఓసీ.. మీరు ఓసీ.. మీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి ఓసీ.. రాజ్యాంగం సవరణ చేస్తే రిజర్వేషన్ అమలు అవుతుంది. ప్రభుత్వం జీవో విడుదల చేస్తే.. కోర్టు కొట్టివేస్తుంది అని అన్నారు. తమిళనాడు తరహాలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. బిసిలకు బిజెపి న్యాయం చేస్తుందా అన్యాయం చేస్తుందా తేల్చుకోండి అని అన్నారు.

# ఏకాణ తేలేనోళ్లు.. లేఖ రాస్తరా?

అడుగడుగునా తెలంగాణ ప్రజలను వంచించారు
మోదీ ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొడుతోంది
బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు లేఖపై..
బహిరంగ లేఖ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్వేషాన్ని రెచ్చగొట్టడం తప్ప మీరు చేసిందేమీ లేదు, అడుగడుగునా తెలంగాణ ప్రజలను వంచారని, మూసీ ప్రక్షాళన కోసం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బిజెపిపై తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు సిఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామచందర్ రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను మంత్రి పొన్నం ప్రస్తావించారు. కేంద్రప్రభుత్వం నుంచి నిధులు తేలేని బిజెపి నేతలు, తమకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మోదీ సర్కార్ మెగా ఫెయిల్యూర్స్ సంగతేందని రామచందర్‌రావుని మంత్ర పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను అడుగడుగునా మోసం చేసిందని విమర్శించారు.

### అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మోదీ చేసిందేమిటి?

వాగ్దానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్దాలను ఆవిష్కరించడం తప్ప మోదీ ప్రభు త్వం చేసిందేమి లేద ని దుయ్యబట్టారు. అలాంటి మీరు సిఎంకి లేఖలు రాయ డం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గురువింద సామేతను గుర్తు చేసే విధంగా ఉన్న మీ లేఖ నవ్వు తెప్పిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ సెటైర్లు గుప్పించారు. తెలంగాణకు 11 ఏళ్లలో ఏం చేశారని, రాష్ట్రా నికి కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వనప్పుడు మీరు కానీ, ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఏం చేశారని?, 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని?, దేశంలో ఒక్క రేషన్ కార్డును ఇవ్వని దుస్థితి మీది కాదా?, విద్వేష ప్రచారం, విధ్వంస చర్యలు, రాజకీయ నియంతృత్వం, ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్‌ల పెత్తనం, మత ఆది పత్యం, కేంద్ర దర్యాప్తు సంస్థలదుర్వినియోగం, అధికార కర్కశత్వం తప్ప మోదీ హయాంలోప్రజలజీవనప్రమాణాలు మెరుగుపడ్డయా? అంటూ పొన్నం ప్రభాకర్ ప్రశ్నలవర్షం కురిపించారు.

### మీ తీరు వల్ల తెలంగాణకు చాలా నష్టం

మీ తీరు వల్ల తెలంగాణ చాలా రకాలుగా నష్ట పోతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలకి జాతీయ హోదా ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తోంది మీరు కాదా? అని నిలదీశారు. పోలవరం ముంపుతో సంబంధం లేని 5 పంచాయతీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసి, భద్రాద్రి రామయ్య భూములును ఆంధ్రప్రదేశ్‌కి అప్పనంగా అప్పగించారని మండిపడ్డారు. గంగా ప్రక్షాళన కోసం మోడి ప్రభుత్వం గత ఎనిమిదేల్లలో రూ.10,792 కోట్లు మంజూరు చేసిందని, మరో 36 నదుల ప్రక్షాళన కోసం రూ. 6 వేల కోట్ల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. కానీ ఆ జాబితాలో మూసీ లేకపోవడం మీ అసమర్థత కాదా? అని అన్నారు. మూసీ ప్ర క్షాళన కోసం ఇప్పటి వరకు ఒక్క రూపాయి మంజూరు చేయకుండా మూతి మూసుకుంది మీరు కాదా అన్నారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌వరంగల్, హైదరాబాద్‌విజయవాడ, హైదరాబాద్‌నాగ్‌పూర్ మార్గాల్లో ఇండ్రస్టియల్ కారిడార్, ఢిఫెన్స్ కారిడార్ ఏర్పాటు అన్నారని, అయ్యిందా? అని ప్రశ్నించారు.

### అడుగడుగునా తెలంగాణ ప్రజలను వంచించారు

కృష్ణా జలాల్లో నీటి వాట తెల్చకుండా నాన్చుతుంది మీరు కాదా?, సిరిసిల్లలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటును పట్టించుకోనిది మీ కేంద్ర ప్రభుత్వం కాదా?, తెలంగాణకు ఐఐఎం ఇవ్వకుండా మోసం చేసింది మీరు కాదా?, వెనకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన బిఆర్‌జిఎఫ్ నిధులు తెలంగాణకు ఎగ్గోటింది మీరు కాదా? అని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఇలా అడుగడుగునా తెలంగాణ ప్రజలను పంచించి, వట్టి లేఖలు రాస్తే ప్రయోజనం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తన లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతనైతే మోదీకి లేఖ రాసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చండన్నారు. అంతే కానీ ఏడాదిన్నర క్రితం ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం అప్పుడే అన్ని చేసేయాలని మీరు లేఖలు రాయడం మీ గుడ్డి ద్వేషానికి అద్దం పడుతోందని విమర్శించారు.

# చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రామాణీకరణకు కొత్త నియంత్రణలపై సమీక్ష



జిన్‌పింగ్ పదవీ విరమణపై ఊహాగానాలు

**బీజింగ్ :** చైనా కమ్యూనిస్టుపార్టీలో పని విభజన ప్రామాణీకరణకు కొత్త నియంత్రణలపై సమీక్ష జరుగుతోంది. ఐతే జీవితకాలంపాటు అధ్యక్ష పదవిలో కొనసాగే అర్హత సంపాదించుకున్న చైనా నాయకుడు జీ జిన్‌పింగ్ పదవీ విరమణ దిశగా అడుగులు వేస్తున్నారా? అనే వదంతులకు ఈ సమీక్ష ఆజ్యం పోసింది. పని విభజన నిమిత్తం చైనా అధికార కమ్యూనిస్టుపార్టీలో కీలకమైన విభాగాల అధికారాన్ని జిన్‌సింగ్ బదిలీచేసే ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ఊహాగానాలకు తెరలేచింది. పదవీ విరమణకు వీలుగా ఆయన పాత్రను పరిమితం చేసుకునేందుకు అధికార పరివర్తనకు భూమిక సిద్ధం చేసేందుకు అడుగులు పడుతూ ఉండవచ్చునే ఊహాగానాలకు ఈ చర్యలు తావిచ్చాయి. 24 మంది సభ్యులుగల శక్తిమంతమైన చైనా కమ్యూనిస్టుపార్టీ (సిపిసి) పొలిట్ బ్యూరో సమావేశం జూన్ 30వ తేదీన జరిగిందనీ, ఈ సమావేశంలో పార్టీ వ్యవస్థల పనులకు సంబంధించి కొత్త నియంత్రణల అమలుపై సమీక్ష జరిగిందని చైనా అధికార వార్తాసంస్థ జిన్హువా ఇటీవల తెలియజేసింది. జీ జిన్‌పింగ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పార్టీ వ్యవస్థ, బాధ్యతలతోపాటు నిర్ణయాత్మకమైన సిపిసి కేంద్రకమిటీ కార్యకలాపాలను, సానుకూల విమర్శనాత్మక ఆలోచనలను, వ్యవస్థలమధ్య సమన్వయయాన్ని ఈ నియంత్రణలు ప్రామాణీకరిస్తాయని జిన్‌పింగ్ సమావేశంలో ఉద్ఘాటించారు. దీనివల్ల వ్యవస్థలు మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తాయని, ప్రధానమైన కర్తవ్యాలు చేపట్టవలసివచ్చినప్పుడు సమన్వయంతో వ్యవహరించడానికి, ఒక ప్రణాళికపై దృష్టి కేంద్రీకరించడానికి, చర్చలు జరపడానికి, కీలకమైన, అత్యంత ప్రధానమైన కర్తవ్యాలను పర్యవేక్షించడానికి ఈ నియంత్రణలు దోహదం చేస్తాయని జిన్హువా వార్తా సంస్థ తన నివేదికలో పేర్కొంది. ఇటీవల చైనా అసమ్మతి వర్గాన్ని పర్యవేక్షిస్తున్నప్పుడు అత్యంత కఠిన నియంత్రణలమధ్య ఉడే సిపిసిలో అధికార పోరాటం జరుగుతోందన్న ఊహాగానాలకు బీజం పడింది. చైనాలో ఉన్న ఒక రాజకీయ విశ్లేషకుడు ఒకరు తన పేరు బయటపెట్టకుండా కొన్ని అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, పార్టీలోని విభాగాలపై ఈ విధమైన కొత్త నియంత్రణపై సమీక్ష చేయడం అంటే జీ జిన్‌పింగ్ పదవీ విరమణకు సన్నాహాలు జరుగుతున్నాయన్న సంకేతాలు వచ్చినట్టేనని అన్నారు. ''అధికార పరివర్తనకు ఇదే కీలక సమయం, ఆ కారణంగానే పార్టీలోని విభాగాల నియంత్రణకు నిబంధనలు ఏర్పాటు చేస్తూ ఉండవచ్చు'' అని ఒక విశ్లేషకుణ్ణి ఉటంకిస్తూ హాంగ్‌కాంగ్ కేంద్రంగా వెలువడే సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్ వెల్లడించింది. ఐతే మరికొందరుమాత్రంఈ ఊహాగానాలను కొట్టిపారేశారు. చైనాలో మావో జెడాంగ్ తర్వాత అత్యంత శక్తిమంతమైన నాయకుడుగా పరిగణించబడుతున్న జిన్‌పింగ్ ఇంకా పెద్ద పెద్ద విస్తారమైన సమస్యలపై దృష్టి కేంద్రీకరించడం కోసం తనకున్న కొన్ని అధికారాలను ఇతరులకు బహుశా బదిలీచేస్తూ ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. ''విధానపరమైన ప్రాధాన్యతలను కొనసాగిస్తున్న కింది స్థాయి అధికారులకు భరోసా ఇచ్చేవిధంగా రోజువారీ వివరాలపై ఇకమీదట జిన్‌పింగ్ తక్కువ దృష్టి కేంద్రీకరించవచ్చునన్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయని చైనా ఉన్నతస్థాయి రాజకీయాల ప్రత్యేక నిపుణుడు విక్టర్ షిశ్ అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాండియాగ్లో పనిచేస్తున్న షిశ్ సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్‌కు ఆదివారంనాడు చెప్పారు. ఆదివారం నుండి రియో డీ జెనీరోలో ప్రారంభమైన బ్రిక్స్ సమావేశానికి కూడా జిన్‌పింగ్ వెళ్ళలేదు. ఆయన అధ్యక్షుడయ్యాక బ్రిక్స్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే మొదటి సారి. ఆయన తరపున ప్రధానమంత్రి లీ క్వియాంగ్ వెళ్ళారు. జిన్‌పింగ్ తన అధికారాలలో కొన్నింటిని ఇతరులకు బదిలీ చేయడానికి మరోకారణాన్ని కూటా ట్రంప్ టారిఫ్‌లకు ముడిపెట్టారు. ట్రంప్ టారిఫ్‌లవల్ల చైనా నుండి అమెరికాకు వెళ్ళే ఎగుమతుల్లో 440 బిలియన్ డాలర్ల మేరకు విఘాతం వచ్చింది. అదేవిధంగా చైనా వృద్ధి కూడా మందగమనంలో సాగుతూ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఈపూర్వరంగంలో ఈ ఊహాగానాలు వచ్చాయి. 2012లో అధికారం చేపట్టిన తర్వాత జిన్‌పింగ్ క్రమ క్రమంగా అన్ని బాధ్యతలపైనా పట్టు సాధించి తిరుగులేని నాయకుడుగా మారారు. ఐదేళ్ళ అధ్యక్ష పదవీకాలాన్ని చట్టసభలోసవరణద్వారామార్పులు చేశారు. తద్వారా ఆయన మూడోసారికూడా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు చైనా అధ్యక్షులుగా పనిచేసిన వారంతా రెండు విడతలు పనిచేశాక పదవీ విరమణ చేశారు. కానీ జిన్‌పింగ్‌జీవితకాలఅధ్యక్షుడుగానియమితులయ్యారు.

## ప్రశ్నిస్తే ప్రతిపక్షాల గొంతునొక్కడమే లక్ష్యమా? : బిఆర్ఎస్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రజాసమస్యలపై..అధికార పార్టీ నేతలు చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పనిగా పెట్టుకున్నారని బిఆర్ఎస్ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసు సిట్ విచారణలో ఉంటే అధికార పార్టీ నేతలు మీడియా సమావేశాలు పెట్టి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు నోటికిచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, తప్పులు చేస్తే మా పార్టీ నాయకుడు అయినా సరే..మీరు చర్యలు తీసుకున్నా మేము స్వాగతిస్తామని వివరించారు. సమావేశంలో బిఆర్ఎస్ నేతలు జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, గుండు అశోక్, శీలం శ్రీకాంత్, సందీప్ ఠాకూర్, రాజశేఖర్, సంజయ్‌నాయక్, నార్ల శ్రీను, కంది రఘుగౌడ్ పాల్గొన్నారు.

## ఇవిఎం గోదామును పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం దూలిపేట్ చూడిబజార్‌లోని ప్రధాన ఇవిఎం గోదామును హైదరాబాద్ జిల్లా ఎన్నికలు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి భద్రతా నమోదు పుస్తకం, సిసి కెమెరాల పని తీరు, నియంత్రణ పద్ధతులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్(ఎన్నికలు) మంగతాయారు తదితరులు ఉన్నారు.



## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

### హయత్ నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీల సమస్యల పరిష్కారానికి తమ సహకారం ఉంటుందని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్లోని మహేశ్వరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచి నీటి పైప్‌లైన్ పూర్తి చేయడం సందర్భంగా కాలనీ సంక్షేమ వాసులు కార్పొరేటర్‌ను సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి కాలనీలను సమస్యలే లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ అధ్యక్షులు పాండవ్‌రెడ్డి, శంకర్ గౌడ్, చంద్రబాబు, శ్రీధర్ రెడ్డి, నర్సింహులు, మల్లారెడ్డి, రామచంద్రరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిసి ఉద్యమంలో నవశకం : కటకం




ప్రజాపక్షం/సరూర్‌నగర్ : బిసిల చైతన్యం రాజ్యాధికారమే లక్ష్యంగా బిసిఉద్యమంలో నవ శకం మొదలైందని మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అన్నారు. అదివారం నాగోల్‌లోని మాస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యనిర్వాహకుల చైతన్య సదస్సులో బిసి యువకులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి కార్యనిర్వాహకులకు స్వాగతం పలుకుతూ సంస్థ లక్ష్యాలను, కార్యచరణను వివరించారు. రాష్ట్రంలో బీసీలను మన ఆలోచన సాధన సమితి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా చైతన్యం పరుస్తూ రాజ్యాధికారం దిశ తీసుకొని వెలుతుందని తెలిపారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసి, జెడ్పీటీసి, ఎమ్మెల్యే, ఎంపి ఏ స్థానాల్లో పోటీ చేసి గెలిపించుకునే సత్తాచాటేందుకు ముందుండేలా మాస్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీ రామ షెఫర్డ్, నూతన కంటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోరంగి దుర్గరాణిరజక, గుండ్ల ఆంజనేయులుగౌడ్, గుంటిపాటి పూసల, విద్యాసాగర్‌ముదిరాజ్, పంతంతగి వితలయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు సహించేది లేదు

### పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: స్థానిక ఎమ్మెల్యేనుఉద్దేశించి బిఆర్ఎస్ నాయకులు చేసిన హెచ్చరికలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ ఆదివాసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, సీనియర్ నేతలు చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీంలు తెలిపారు. ఆదివారం పట్టణ సిఐ విజయ్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 48గంటల్లో యువనేత పేరు చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బిఆర్ఎస్ నాయకులు జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలోనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీలక్ష్మీ నర్సింహ్మస్వామి దేవస్థాన కమిటీ చైర్మెన్ చేవెళ్ల కృష్ణయ్య అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయం, పెండ్యాల శ్రీ లక్ష్మీ నర్సింహ్మస్వామి పూరాతన దేవాలయంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విశ్రాంత ఉపాధ్యాయులు కెనర్సింలుగౌడ్, కెబాల్‌రాజ్, అశోక్, వేణుగోపాల్, ఊరడి నర్సింలు, కె కృష్ణయ్య గౌడ్, రామకృష్ణాగౌడ్, ఈశ్వరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగ



ప్రజాపక్షం/కొందుర్గు: కొందుర్గు మండలంలో ఆదివారం పీర్ల పండుగ (మొహర్రం పండుగ)ను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం అన్ని పీర్లను పీర్ల చావిడీల నుంచి తీసుకువచ్చి, గ్రామంలోని వీధుల గుండా ఉరేగింపు నిర్వహించారు. ఉరేగింపులో పీర్లకు ఫాతిహాలు ఇవ్వడంతో పాటు పూల్ సర్దార్ దట్టీలు కప్పారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ ఉరేగింపులో పాల్గొని, పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో తీగలపల్లి గోపాల్, కుర్వ వెంకటయ్య, టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గోరింటాకు సంబరాలు



ప్రజాపక్షం/షాబాద్ : ఆషాఢమాసంలో అనుకూల మాసంగా పురస్కరించుకొని అదివారం షాబాద్ మండల కేంద్రంలో మహిళలు గోరింటాకు సంబరాలు సంబరాలు జరుపుకున్నారు. రంగవల్లుతో ఆట పాటలతో మహిళలు ఉత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో సహజసిద్ధమైన గోరింటాకు చేతులకు పెట్టుకోవడం శభప్రదమన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి, రాధిక, మంజుల, భారతమ్మ, ప్రసన్న, లక్ష్మమ్మ, విజయ హరిణి, సుగుణ తదితరులు ఉన్నారు.

# పాతబస్తీలో బీబీకా ఆలం ఊరేగింపు





ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతబస్తీలో బీబీకా ఆలం ఊరేగింపు ఆదివారం పోలీసుల పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. డబీర్‌పుర నుంచి మొదలైన ఊరేగింపు షేక్ ఫైజ్ కమాన్, అలిజా కోట్లా, చార్మినార్, గుల్జార్ హౌజ్, పంజేశా, మీర్ చౌక్, పురాని హవేలి, దరూల్ షిఫా, కాలిఖబర్ మీదుగా చాదర్‌ఘాట్ వరకు సాగింది. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం సందర్భంగా సంతాపదినాల్లో భాగంగా షియా ముస్లింలు నల్లటి దుస్తులు ధరించి కత్తులతో, బ్లేడ్లతో తమ శరీరాలపై కొట్టుకుంటు తమరక్తాన్ని చిందిస్తారు. మొహర్రం వేడుకల్లో మాతం చేస్తూ తమ సంతాపాన్ని తెలియజేస్తారు. బీబీకా ఆలం ఊరేగింపు సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. దీంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిటీ టాస్క్‌పోర్స్, ఐడి, మఫ్టీ, క్రైమ్, షీటీమ్స్ బందోబస్తులో పాల్గొన్నాయి. సంబంధించి హైదరాబాద్ దక్షిణ మండలం పోలీసులు భారీగా భద్రత ఏర్పాట్లు చేశారు. సిసిటివి కెమెరాల ద్వారా భద్రత చర్యలు పర్యవేక్షించారు. బీబీకా ఆలం ఊరేగింపును పురస్కరించుకొని పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

### మొహర్రం ఊరేగింపులో పాల్గొన్న బల్దియా కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

మొహర్రం సందర్భంగా బీబీకా ఆలం మొహర్రం ముగింపు ఊరేగింపు (ఆశురా) ఏర్పాట్లను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ పరిశీలించారు. నగర ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని కోరుతూభక్తి శ్రద్ధలతో అలమాకు జట్టీ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీక నిలిచిన మొహర్రం ఊరేగింపు నిలుస్తుందన్నారు. గంగా జమునా తెహసిబ్‌గా తెలంగాణ నిలుస్తుందన్నారు. మొహర్రం, బోనాల పండుగల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశామన్నారు. పండుగ ఊరేగింపు జరిగే ప్రాంతాల్లో, ప్రజలు గుమిగూడె ప్రదేశాల్లో పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా భక్తులు కూడా పరిశుభ్రత పాటించాలని కోరారు. ముఖ్యమైన ఆశూర ఖానమ్ వద్ద ఎల్ఈడి విద్యుత్ దీపాలు, భక్తులకు కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్ అలీ, ఎంఎల్‌సి మిర్జా రియాజ్ హుస్సేన్ ఎఫెండీ, జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఇ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి, కాచిగూడ రూట్లలో 48 స్పెషల్‌ట్రైన్స్ : దక్షిణమధ్య రైల్వే

### అందుబాటులో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పలు ముఖ్యమైన మార్గాల్లో మొత్తం 48 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. జులై 9 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిహిసార్ మధ్య 12 సర్వీసులను నడపనున్నారు. ఈ రైళ్లు ప్రతి బుధ, ఆదివారాల్లో అందుబాటులో ఉంటాయి. అదే విధంగా, కాచిగూడతిరుపతి మధ్య 8 రైళ్లు ప్రతి గురు, శుక్రవారాల్లో రాకపోకలు సాగిస్తాయి. ఇక నరసాపూర్‌తిరువణ్ణామలై మార్గంలో అత్యధికంగా 16 ప్రత్యేక రైళ్లను బుధ, గురువారాల్లో నడపనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లన్నింటిలో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైళ్ల రాకపోకల సమయాలు, ఇతర పూర్తి వివరాల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్సైట్ను సందర్శించాలని కోరారు.

## జిల్లాలు పెంచారు.. పోస్టులు పెంచలేదు!

### పెరిగిన జిల్లాలకు ప్రభుత్వ శాఖల్లో పోస్టులు పెంచాలి

### ఎంపి, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : విభజన ద్వారా రాష్ట్రంలో జిల్లాలతో పాటు కార్యాలయాలు పెరిగాయాని, కానీ అందుకు సరిపడ పోస్టులను భర్తీ చేయకపోవడంతో పౌర సేవలు అందక తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపి, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. 2017 సంవత్సరంలో కొత్త జిల్లాలు, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ పంచాయతి, పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేశారన్నారు. కానీ వీటికి అవసరమైన పోస్టులు సృష్టించలేదన్నారు. ఈమేరకు ఆదివారం ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖరాశారు. కొనసాగుతున్న ఉద్యోగులతోనే ఇన్‌చార్జ్‌లుగా అధికారులను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 23 జిల్లాలు, వాటిలో 40 శాఖల జిల్లా కార్యాలయాలు, తాలూకా కార్యాలయాలు ఏర్పడ్డాయన్నారు. 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజినల్ కార్యాలయాలు, 76 మున్సిపాలిటిలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లు, 25 డిఎస్‌పి కార్యాలయాలు, 31 పోలీస్ సర్కిళ్లు, 7 పోలీస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పాటు చేశారన్నారు. ఇందులో గ్రూప్1, గ్రూప్2, గ్రూప్4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు కొత్త పోస్టులు మంజూరు చేయలేదన్నారు. వీటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. ఇందులో నేరుగా నియామకం చేసే కోటా లెక్కించాలన్నారు. వాటిలో గ్రూప్150 శాతం, గ్రూప్ 2 లో 30 నుంచి 40 శాతం నేరుగా నియామకం కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కొందరు నేరుగా నియామక కోటా కింద భర్తీ చేయాల్సిన గ్రూప్1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి, గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపించలేదన్నారు. నామమాత్రంగా లెక్కించి ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. ఇప్పటికి అన్ని శాఖలలో అడ్‌హక్ ప్రమోషన్‌ల పేరుమీద భర్తీ చేశారన్నారు. కొందరు ఉన్నతాధికారులు నేరుగా నియామకం లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరుగా నియామకం కోటా పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేశారని లేఖలో వివరించారు. కొత్త తరాన్ని, యువతరాన్ని నేరుగా నియామకం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకువస్తే సమర్ధవంతమైన, అవినీతికి తావులేని పాలన లభిస్తుందన్నారు. యువతను పాలన రంగంలోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారన్నారు.

## సామాజిక సమరభేరి కాదు.. అధికార దుర్వినియోగ భేరి : టిడిపి



ప్రజాపక్షం/హైదరాబాద్ : అధికార కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గేతో నిర్వహించిన సభ 'సామాజిక సమరభేరి' కాదని, అదో 'అధికార దుర్విని యోగ భేరి' అని నగర తెలుగు తమ్ముళ్లు విమర్శించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ కోసం విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా, సీనియర్ నేత నల్లెల కిశోర్ విమర్శించారు. దోమలగూడ నగర పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు, మంత్రులు తమ పదవులను కాపాడుకోవడానికే ఢిల్లీ పెద్దల అడుగులకు మడుగులొత్తుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరగడుస్తున్నా, సాధించిన ప్రగతి ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పి. బాలరాజ్ గౌడ్, ఎస్. ప్రకాశ్, తడక వినో పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం

### ప్రజా చైతన్యం పార్టీ అధ్యక్షుడు బొల్లెద్దు శంకర్

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : కుల,మత ప్రాంతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజా చైతన్యం పార్టీ ముందుకెళ్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లెద్దు శంకర్, ప్రధానకార్యదర్శి బైరోజు సూర్య ప్రకాశ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక సమానత, సామాజిక న్యాయం, 50 శాతం మహిళలకు రాజ్యాధికారం సాధించడమే తమ పార్టీ ఎజెండా, లక్ష్యమన్నారు. పేదరికం, నిరక్ష్యరాస్యత మొదలగు సామాజిక రుగ్మతలను ఏరివేసే దిశగా తమ పార్టీ కృషిచేస్తుందన్నారు. గ్రామీణ, నగర పేద వర్గాల్లోని ప్రతి ఇంట్లో మహిళలు చదువుకోవాలని, ఆర్థికంగా నిలబడాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు ఎన్.రాములు, డి.రాజేశ్, భేరవోజుల సూర్యప్రకాశ్, వై.జైపాల్, ఎం.వెంకన్న, వి.రాములు, కందుకూరి శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.




## గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ



ప్రజాపక్షం/హైదరాబాద్ : పాతబస్తీలో ఆదివారం మతసామరస్యాన్ని చాటి చెప్పింది. ఒకవైపు షియా ముస్లింలు మొహర్రం 10వ సంతాపదినాలు నిర్వహించగా, మరోవైపు హిందూ సోదరులు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాతబస్తీ నుండి గోల్కొండ జగదాంబ అమ్మవారి కోసం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాలు తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుడిమల్కాపూర్ చైర్మన్ తల్లారి మల్లేష్ ముదిరాజ్ పాల్గొని బోనాలకు స్వాగతం పాలికారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు దొంతి శ్రీనివాస్, బాల నరసింహ, కట్ట అనిల్ కుమార్ ముదిరాజ్, నాసా సత్యనారాయణ, కట్ట నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు జంతువులకు వాక్సినేషన్ తప్పనిసరి

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/షాద్‌నగర్: పెంపుడు జంతువులకు యాంటీ రాబీస్ వాక్సినేషన్ తప్పనిసరి వేయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా శునకాలకు వాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంపుడు జంతువులను యాంటీ రాబీస్ వాక్సినేషన్ వేయిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని, వాక్సినేషన్ ఇవ్వకుంటే ఏ చిన్న ప్రమాదం జరిగినా ప్రాణాలకే ముప్పు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. యాజమానులు ఈ విషయాన్ని గ్రహించి వెటర్నరీ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మూగజీవాలకు అవసరమైన మందులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ముక్కంటి రాజ్, కె.సునీత, వంశీకృష్ణారెడ్డి, వెంకటేష్, నాయకులు కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అందె మోహన్ ముదిరాజ్, అప్పి, దిలీప్, సాయికుమార్, సాయిలు, ముబారక్ అలీఖాన్, తుపాకుల శేఖర్, మణికంఠ, కిట్టు పాల్గొన్నారు.

## 'హరిహర వీరమల్లు' నిలిపివేయాలి


### బిసి ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ డా.వై.శివ ముదిరాజ్



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : ప్రజావీరుడు పండుగ సాయన్న పాత్రను వక్రీకరించేలా చూపే 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని తక్షణమే నిలిపివేయాలని బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డా.వై.శివ ముదిరాజ్ డిమాండ్ చేశారు. పండుగ సాయన్న చరిత్రను తప్పుదోవ పట్టించే ప్రయత్నాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీనిపై తెలుగు రాష్ట్రాల మంత్రులను కలుస్తామని, హైకోర్టులో కేసు ఫైల్ చేస్తామని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ పెబ్బెట మల్లికార్జున్, బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి పాల్గొన్నారు.

## కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యత

### జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించాలి అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. అదివారం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని ఆయన నివాసంలో వక్కలం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వక్కలంక మాట్లాడుతూ పార్టీ మారకుండా పార్టీని అంటిపెట్టుకొని ఉండి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజాక్షేత్రంలో పనిచేసిన కార్యకర్తకు న్యాయం చేయాలని, ముఖ్యంగా అతి తక్కువ సంఖ్యలో ఉన్న బ్రాహ్మణ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యువజన నాయకులు స్వరూప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రాం





ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రాం అని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు.ఆదివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని డివిజన్‌లోని సాహెబ్ నగర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముద్దగౌని సుమన్ గౌడ్, సతీష్ గౌడ్, యాది ముదిరాజ్, పోరందా జగన్‌మోహన్, మంజాల బిక్షపతి, బోడ శేఖర్, గంగం రాజు, కొంగరి మహేష్, పరందా నర్సింహా, కొంగరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని ఆదివారం మండలంలో నిర్వహించారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో ఉన్న బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు నాగని రామకృష్ణ మాట్లాడుతూ.. నిరు పేదలకు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రాం అని కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు మరిచిపోలేనివి అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, బాల్‌రాజ్, కృష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి, ఐడిఎ అధ్యక్షుడు డిఎస్‌రెడ్డికి ఎమ్మెల్యే అభినందన

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి ఇండస్ట్రీయల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి ఐలా చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కె.గోవింద్‌రెడ్డి,చర్లపల్లి ఇండస్ట్రీయల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డి.శ్రీనివాస్‌రెడ్డిలు ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు అన్ని విధాలుగా సహాయ



సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త హరీష్‌రెడ్డి,రవి,నాయకులు నీలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నాగారం :** ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఈస్ట్ గాంధీ నగర్ కాలనీలో ఎస్‌క్యూర్ హస్పిటల్ డాక్టర్లు స్వప్న,శ్వేత,రామారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్లు ఆరోగ్యం గూర్చి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఆదం షఫీ,కమిటీ సభ్యులు కె.రామచంద్రరెడ్డి,




సాయియాదవ్,ఆనందశర్మ, లక్ష్మి నారాయణ, రమేష్ బాబు,జైబాలు,పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల యువత శ్రద్ధ వహించాలి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** యువతకు క్రీడలు ఎంతగానో అవసరమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 17వ డివిజన్ కౌసల్య కాలనీలో ర్యాలీ, బ్యాడ్మింటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆగం రాజు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాని పెంపొందించడంతో పాటు అన్ని విధాలుగా ఉపయోగపడతాయన్నారు. యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్రి, అన్వేష్, లక్ష్మీ నారాయణ, నరేశ్ పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్, జర్నలిస్ట్ కాలనీలోని చెర్ల ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. చెర్ల ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఆస్కానీ మారుతీ సాగర్, అధ్యక్షుడు ముక్కర్ల లాలయ్య, ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్, జాయింట్ సెక్రెటరీలు కోట కృష్ణారావు, శ్రీనివాస్ రావులు నిజాంపేట్ గ్రామస్థులు, సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, కొలను నర్సింహా రెడ్డిలను కలిసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ఆలయానికి రంగులు వేసేందుకు అయ్యే పూర్తి ఖర్చుని తాను భరిస్తానని అన్నారు. తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలని, జాతరను వైభవంగా నిర్వహించడానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

## జాతీయ తైక్వాండో విజేతలకు మెడల్స్



**ప్రజాపక్షం/నాగారం :** నాగారం మున్సిపాలిటీకి చెందిన టైగర్ క్లబ్స్ తైక్వాండో అకాడమీకి చెందిన 17 మంది విద్యార్థులకు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మెడల్స్‌ను అందజేశారు.తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ఇటీవల హరిద్వార్,ఉత్తరాఖండ్‌లో జరిగిన జూనియర్,సబ్ జూనియర్ నేషన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని అద్భుతమైన ప్రదర్శణ కనబర్చిన వీరికి గోల్డ్,సిల్వర్ మెడల్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు,మేనేజింగ్ డైరెక్టర్ జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి శివకుమార్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పట్టణంలోని శివారెడ్డిగూడ బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,పాల్గొన్ని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమర యోధుడిగా సంఘసంస్కర్తగా రాజకీయ నాయకుడిగా దేశానికి ఆయనఅందించిన సేవలు చిరస్మరణీమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రం లోని రైల్వే స్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు ,వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు , వికారాబాద్ ప్రముఖులు వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవలని తెలిపారు. వికారాబాద్ జిల్లా వ్యప్తంగా ఎదో ఒక చోట మహనీలయుల విగ్రహలను ధ్వసం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని అంబేద్కర్ ,ప్రజాసంఘల నాయకులు విమర్శిస్తున్నారు. విగ్రహల ధ్వసం అపకపోతే జిల్లా వ్యప్తంగా ఉన్న అంబేద్కర్ అభిమనులతో పెద్ద ఎత్తున నిరసన తెపడం జరుగుతుంది అని అన్నారు. ఉన్నత అధికారులు కఠన చర్యాలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వికారాబాద్ పశువైద్యశాలలో మూగ జీవాలకు వైద్యం కరువు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో మూగజీవులకు వైద్యం కరువైయిందని, రైతులు, పెంపుడు జంతువుల యాజమనులు తెలిపారు. పెంపుడు జంతువులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా ఇక్కడా పెంపుడు జంతువులకు ఎలాంటి మందులు ఉండవని బయట నుండి మందులు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం 11గంటలవుతున్న పశువైద్యశాలలో సిబ్బంది లేరు , సమయ పాలన పాటించారు అని రైతులు తెలిపారు. ఉదయం రైతులు పశువులను ఆసుపత్రికి తీసుకు వస్తుంటరు కాని డాక్టర్లు లేకపోవడంతో రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారి ఉండే కార్యాలయంలో ఇలా ఉంటే మండలలా పరిధిలోని గ్రామల్లో ఎలా ఉందో అర్థం అవుతుంది. పశుసంవర్థక శాఖలో వారు ఆడిందే ఆట పడిందే పాట ఎవ్వరు అడిగే వరు లేరు అనే దీమతో ఉన్నట్లు తెలుస్తుంది. వర్షంకాలంతో పశువులకు , పెంపుడు జంతువులకు సీజనల్ వ్యాధులు వస్తున్నయని రైతులు తెలిపారు.

# పర్యాటకులకు రక్షణేదీ?

**● అనుమతుల్లేకుండా కొనసాగుతున్న రిసార్ట్‌లు ● అధికారుల కనుసన్నల్లోనే తతంగం**



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ప్రాజెక్టుల్లో అనుమతుల లేకుండా కొనసాగుతున్న బోటింగ్ పర్యాటకుల ప్రాణాలు తీస్తోంది. శనివారం ప్రమాదవశాత్తు ఇద్దరు మహిళలు చనిపోవడం జిల్లాలో చర్చనీయాంశమైంది.సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసర రిసార్ట్‌లో ఇది వరుసగా మూడో ఘటన కావడం గమనార్హం , వికారాబాద్ ,పూడూర్ , ధారూర్ నవాబుపేట్ ,మోమిన్‌పేట్ తదితర మండలాల్లో గత ఆరేళ్లుగా రిసార్ట్‌లు కొనసాగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇందులో బోటింగ్ , నైట్‌క్యాపింగ్ , పలురకాల అడ్వెంచర్ గేమ్స్ ,ట్రెక్కింగ్ ,గేమింగ్ హోటల్స్ రాత్రి బస చేసేందుకు గదుల ఏర్పాటు ,పేకాట, మద్యం,జూదం, తదితర కార్యకలపాలు కొనసాగిస్తున్నారు. ఒక్క రాత్రికి బస చేసేందుకు అక్కడ కల్పించే సౌకర్యాలు అడ్వెంజర్ గేమ్స్‌ను బట్టి ఒక్కో జంటకు 2500నుంచి 20వేల వరకు వసూలు చేస్తున్నారు. రిసార్ట్‌ల నిర్వహణలో అధికారుల నిర్ణయాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి , ఐదారేళ్ల పాటు కొనసాగిన వీటిని అక్రమమంటూ అర్నేళ్ల క్రితం మూసేసిన అధికారులు నెల తిరగకుండానే మళ్లీ తెరిపించారు. ఈ కొద్ది సమయంలోనే రిసార్ట్‌లు సక్రమం ఎలా అయ్యాయో వారికే తెలియాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో కొందరు ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా మండల ,గ్రామ స్థాయి అధికారులకు ముడుపులు ముట్టినందునే మళ్లీ ఓపెన్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ,ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అయా పార్టీలకు చెందిన నేతలు అండదండలతోనే రిసార్ట్‌లు కొనసాగుతున్నాయని సమాచారం , జిల్లాలో రిసార్ట్‌ల దందా యాథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకుల తాకిడి కూడా పెరగటంలో వీరి వ్యాపారం జోరుగా సాగుతోంది. రిసార్ట్‌ల నిర్వహణకు 11రకాల అనుమతులు అవసరం ఉండగా అందులో ఏ ఒక్కటీ లేకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. వికారాబాద్ మండల పరిధిలోని ఆరు రిసార్ట్‌లకు నోటీసులు ఇచ్చినా అధికారులు అనుమతులు లేకపోవడంతో ఆరు నెలల క్రితం మూసివేశారు. మరికొన్ని చోట్ల కొనసాగుతున్నా వాటిపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదివారం చేవెళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి రిసార్ట్‌లను సందర్శించి వెంటనే చర్యలు తీసుకోవలని సంబంధిత అధికారులను కోరారు , రిసార్ట్‌లో అసాంఘిక కార్యకలపాలు జరిగితే ఎవరి బాధ్యత అని అన్నారు.

## లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని జులై 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పాల్గొనాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రచారం చేయడం జరిగింది. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కుదించి యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా ఉండే 4 లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చి అమలుపరచాలని చూస్తుంది. ప్రస్తుతమున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటల చేయాలని మహిళలు సైతం నైట్ డ్యూటీలు చేయించాలని టైం బేస్ ఎంప్లాయిమెంట్ ను ప్రోత్సహించి, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎక్కువగా ఉన్న కార్మికులను పర్మినెంట్ చేసే విధానాన్ని అడ్డుకోవడాన్ని, ఆదాని అంబానీ లాంటి బడ పెట్టుబడుదారులకు కొమ్ముగాస్తు కార్మికులకు అన్యాయానికి గురి చేస్తుందని, పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షులు స్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా నాయకులు లక్ష్మణ్, టియుసిఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అన్ని యూనియన్ల నాయకులు నరసింహారెడ్డి, సుంకిరెడ్డి, గురప్ప, దేవదానం, జార్జ్, చంద్రమౌళి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనడం జరిగింది.

## ఆగస్టులో సిపిఐ రాష్ట 4వ మహాసభలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రజా పోరాటంలో వందేళ్ల పూర్తి చేసుకొన్న సిపిఐ రాష్ట 4వ మహాసభను ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నేత బొడ్డుపల్లి కృష్ణ కోరారు. న్యూనాగోల్‌లోని ప్రజా సంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో ఆదివారం జరిగిన మహాసభ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారం కోసం పాకులాడకుండా పేదల పక్షాన నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా ప్రజల మదిలో నిలిచి పోయిందన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు మాసంలో నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలో అన్ని జిల్లాల పార్టీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎండి బషీర్, ఎస్ రాములు, రాసమల్ల రాజేందర్, ఉడతల మల్లేష్ గౌడ్, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటా


మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకొన్న మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, పాత్రికేయుడు బాలరాజుకు తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. ఆదివారం బాలరాజు నివాసానికి కాంగ్రెస్ శ్రేణులు మనోహర్, వెంకటేష్,సంగమేశ్వర్, మహేష్, వెంకటేష్ యాదవ్, నిరంజన్, పిట్టల శ్రీనివాస్, వినోద్, యాదవ్, నాగరాజు, పార్థసారధి, మబ్బులతో కల్సి వెళ్లిన ఆయన జర్నలిస్టులకు అన్ని వేళలా సహకరిస్తానన్నారు.

## జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునిత రాముయాదవ్ న్నారు. బాబు జగ్జీవన్‌రాం వర్థంతి సందర్భంగా డివిజన్‌లోని ఇందిరా నెహ్రూనగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోమేకల రాము ,బైరు అనిల్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు. బిజెఆర్ నగర్ ప్రాంతంలో జరిగిన మరో కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి,సత్యనారాయణ, సంపత్, ఇస్మాయిల్, బ్రహ్మయ్య, మోయిన్, ఉపేందర్, రమేష్, అక్తర్‌లతో కల్సి ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ బాబు జగ్జీవన్‌రాంకు ఘనంగా నివాళులర్పించారు.





# ధర్మానికి, కరుణకు ప్రతీక గోశాల

ఎమ్మెల్యే కెపి. వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ధర్మానికి, కరుణకు ప్రతీక గోశాల నిర్వహణ అని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామంలో వీర హనుమాన్ దేవాలయం ఆవరణలో గాయత్రి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసి న గోశాల షెడ్‌ని ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గోశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన దాతలకు అభినందనలను తెలిపారు. వీర హనుమాన్ గోశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. గోశాల నిర్వహణ గొప్ప సంకల్పమని పేర్కొన్నా రు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు మోహన్, నరేశ్, మ నోజ్, పటేల్, సురేశ్, దీప్తు, గుణవంతు, చమరం సిరివి, మంగ ళం సిరివి, రామచందర్ సుతార్, నాయకులు సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, కాలే నగేశ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లాగౌడ్, బలరాం, బీరప్ప, బాల మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఎస్ఎన్ రెడ్డి ఎన్‌క్లేవ్‌లో బిల్లా ఛాయ్ బంక్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని ఎస్ఎన్ రెడ్డి ఎన్‌క్లేవ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బిల్లా ఛాయ్ బంక్‌ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ యువత స్వశక్తితో ఎదగాలన్న ఆలోచనతో ముందుకువెళ్లాలని సూచించారు. ఛాయ్ బంక్ దినదినాభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాధవ రెడ్డి, సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరెందర్ రెడ్డి, అనిల్, కాలే నగేశ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

### జీడిమెట్లలో లూమన్ స్టూడియో ప్రారంభం

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ ప్రాగాటూల్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లూమన్ స్టూడియోని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది మనలోని మేధో సంపత్తిని, హావభావాలను తెలియజేసే గొప్ప కళ అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు అభిషేక్, రాకేష్, ఆశితోష్, బిఆర్‌ఎస్ నేతలు వేణు యాదవ్, సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికలోని డంపింగ్ యార్డు తొలగించరా?

ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రజా సమస్యల విషయంలో అధికారులు తగిన విధంగా స్పందించక పోతే ప్రజలే నేరుగా నిర్ణయాలు తీసుకొంటారని, ప్రజా ప్రతినిధులు చెప్పినా అధికారులు వినకపోతే ఎలా అని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆల్వాల్ ప్రాం తంలోని హిందూ స్మశాన వాటికలో ఏర్పాటు చేసి న డంపింగ్ యార్డును తీసేయాలన్న డిమాండ్‌తో సమీపంలోని 50 కాలనీ ప్రజలతో ఏర్పాటైన జెఎ సి ఆధ్వర్యంలో కొనసాగుతున్న 52వ ధర్నాలో ఆదివారం ఆయన పాల్గొని సంఘీభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ భావాలను కాలరాచే విధంగా స్మశాన వాటికలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయటం ఎంత వరకు సమంజసమని, ఈ విషయంలో ధర్నా చేస్తున్న వారికి తాను ఇప్పటి వరకు మూడు సార్లు వచ్చి సంఘీభావం వ్యక్తం చేయటమే కాక అధికారులకు చెప్పి డంపింగ్ యార్డు ఎత్తి వేసే ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని ఇంత వరకు అధికారులు పట్టించుకోక పోవటం శోచనీయమన్నారు.ప్రజా ప్రతినిధిగా వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో తాము ఏం జవాబివ్వాలని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో డంపింగ్ యార్డును ధర్నా చేస్తున్న ప్రజలు స్వయంగా తొలగించేందుకు పూనుకొనే పరిస్థితులు ఎదురవుతాయని, దీనికి సైతం తాను ప్రజలకే మద్దతిచ్చి కూల్చివేతల్లో స్వయంగా పాల్గొంటానని ఆయన తెలిపారు. బిజెపి నేత మాధవి లత మాట్లాడుతూ సనాతన ధర్మంలో స్మశాన వాటిక ఎంతో పవిత్రమైందని, ఇలాంటి స్థలంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయటాన్ని సహించేది లేదని, ఇక ఆందోళనను ఉధృతం చేయటం, చివరికి తామే నేరుగా తొలగిస్తామని హెచ్చరించారు.

## నేడు మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

మండల ఇన్‌చార్జ్ భరత్ కూమార్ మాదిగ

**ప్రజాపక్షం/బంట్వారం :** నేడు ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించుకందామని బంట్వారం మండల ఇంచార్జీ భరత్ కూమార్ మాదిగ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ఎంఆర్‌పిఎస్‌తోనే సాధ్యమైందని, 30 యేళ్ళు మంద క్రిష్ణ మాదిగ చేసిన సుదీర్గ పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ అమలైందన్నారు. పద్మ శ్రీ మంద క్రిష్ణ మాదిగ అన్న పిలుపు మేరకు నేడు 31 ఆవిర్భావ దినోత్సవం, మంద క్రిష్ణ మాదిగ అన్న పుట్టిన రోజును ఒక పండగాల నిర్వహించుకుందమన్నారు. మండల అధ్యక్షులు శ్రీశైలం మాదిగ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న బోపునారం, తోర్ మామిడి, బస్వాపూర్, మాలసోమారం, యాచారం, సుల్తాన్‌పూర్, నూర్‌ల్లాపూర్, మంగ్రాస్‌పల్లి, రోంపల్లి, నాగ్వారం, సల్‌బత్తాపూర్, మాద్వాపూర్, గ్రామాల నుండి ఎంఆర్‌పిఎస్ కమిటీ సభ్యులు, నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో నిర్వహించే జెండా కార్యక్రమంలో పాల్గోని విజయవంతం చేయగలరాని మండల అధ్యక్షులు శ్రీశైలం మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

# పోచమ్మ బండ సమస్యలు తీరేదెన్నడో?

లక్ష్మాపూర్‌కు రూ.16 కోట్ల నిధులు విడుదల చేసినా మారని కాలనీ దుస్థితి

ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాని సమస్యలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లోని పోచమ్మ బండలో సమస్యలు తిష్ట వేశాయి. గతంలో మాజీ సిఎం కెసిఆర్ లక్ష్మాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని సుమారుగా రూ.16 కోట్లు నిధులు విడుదల చేసిన లక్ష్మాపూర్‌లోని పోచమ్మ బండ కాలనీ సమస్యలు పరిష్కారం కాలేదు. సిసి రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు లేక రోడ్డుపై మురుగునీరు పారుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు నిలిచి ఉండటంతో దోమలు విజృంబించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య పనులు జరుగడం లేదని దీంతో కాలనీలో ఎక్కడ పడతే అక్కడ చెత్త చెదారంతో నిండిఉంటుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా ఇటీవల లక్ష్మాపూర్ గ్రామం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో విలీనమైంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలను గుర్తించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వార్డులో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మాపూర్‌లోని పోచమ్మ బండను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు శివారెడ్డి గూడలోని సాయిబాబా దేవాలయంలో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయిబాబా దేవాలయంలో పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాయిబాబా దేవాలయాలు విద్యుత్ అలంకరణలతో ముస్తాబ్ చేశారు.సాయి క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆషాడమాసంలో వచ్చే పౌర్ణమిని గురుపూర్ణిమ లేదా వ్యాసపూర్ణిమగా జరుపుకుంటారని అలాంటి గురుపూర్ణిమను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సాయిబాబా దేవాలయ ధర్మకర్త కొంతం రాంరెడ్డి,కొంతం అంజిరెడ్డిలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## వికారాబాద్ బిజెపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా కార్యాలయంన్ని ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ రాజకీయ పార్టీగా ఎదగాలని ప్రతి వార్డుకు పోటీ చేయాల్సిన అవసరం ఉందని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టంగా ఉన్నపుడే రాష్టంలో అధికారంలోకి రాగలమని అన్నారు. దేశ భాక్తి ,దైవభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్ , బంజారంగ్‌దళ్‌లో పనిచేయాలని అన్నారు. బిజెపి రాజకీయ పార్టీగా ఉనికి చాటుకోవాలంటేనే బిజెపిలో కొనసాగాలని అయన హెచ్చరించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో పోటీ చేయల్సిన అవసరం ఉందని జిల్లాలో కూడా 594 సర్పంచు ఎన్నికలకు అభ్యరుల సబితను సిద్ధం చేయలని కోరారు. గ్రూపులు విభేదాలు పక్కన పెట్టి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బాగున్నప్పుడే రాష్ట స్థాయిలో , దేశ స్థాయిలో పార్టీ బాగుటుందని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి. సదనందరెడ్డి, రమేష్‌కుమార్, వెన్న ఈ శ్వరప్ప తదితరులు పాల్గోన్నారు.



# క్రీడ

## ఎల్బీగా ఔటైన స్టోక్స్..

### టెయిలెండర్లను చుట్టేయడమే ఆలస్యం!




బర్మింగ్‌హామ్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. వర్షం కారణంగా ఐదో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనా ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పేలా లేదు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే ఓలీ పోప్(24)ను క్లీన్‌బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ (458) వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఊహకందని బంతితో హ్యారీ బ్రూక్(23)ను ఎల్బీగా వెనక్కి పంపి టీమిండియాను గెలుపు వాకిట నిలిపాడు. అయితే.. కెప్టెన్ బెన్ స్టోక్స్(35), జేమీ స్మిత్ (32 నాటౌట్)లు డిఫెన్స్ ఆడుతూ విసిగించారు. ఈ జోడీని విడదీసేందుకు గిల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. చివరకు వాషింగ్టన్ సుందర్ బ్రేకిచ్చాడు. లంచ్‌కు ముందు ఓవర్లో స్టోక్స్ ఎల్బీగా ఔటయ్యాడు. అంతే.. భారత శిబిరంలో సంబురాలు మిన్నంటాయి. భోజన విరామం తర్వాత టెయిలెండర్లను చుట్టేస్తే గిల్ సేన చరిత్ర సృష్టించడం ఖాయం.

ఆకాశ్ పలుమార్లు వికెట్ తీసేలా కనిపించగా.. స్మిత్ అతికష్టమ్మీద వికెట్ కాపాడుకున్నాడు. కాస్త కుదురుకున్నాక ఇద్దరు బౌండరీలతో 50 ప్లస్ భాగస్వామ్యంతో వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే.. స్పిన్నర్లును రంగంలోకి దింపిన గిల్ ఫలితం రాబట్టాడు. లంచ్‌కు ముందు వాషింగ్టన్ సుందర్ వేసిన ఓవర్లో స్టోక్స్ డిఫెన్స్ ఆడబోయి ఎల్బీగా ఔటయ్యాడు. దాంతో, 153 వద్ద ఇంగ్లాండ్ ఆరో వికెట్ కోల్పోయింది. ఇక మిగిలింది టెయిలెండర్లు మాత్రమే. వీళ్లను భారత బౌలర్లు చుట్టేశారంటే ఎడ్జ్‌బాస్టన్‌లో చిరస్మరణీయ విజయం సొంతమైనట్టే.

## ఒలింపిక్స్ ఆతిథ్యంపై అనిశ్చితి..

### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహణకు భారత్ రెడీ




ఒలింపిక్స్ హక్కుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న భారత్ మరో మెగా టోర్నీ నిర్వహణ దిశగా పావులు కదుపుతోంది. 2036 విశ్వ క్రీడల హక్కుల కోసం ప్రయత్నిస్తూనే.. మరో వైపు ప్రతిష్టాత్మక వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్యానికి ఇండియా సిద్ధమవుతోంది. రెండేళ్లకోసారి జరిగే ఈ మెగా క్రీడా పండుగకు హోస్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయనుంది భారత్. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో ఆతిథ్యమిచ్చే దేశాల పేర్లను ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలోనే భారత బృందం రెండింటో ఒక్కటోర్నీ రైట్స్ అయినా సాధించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ విషయాన్ని ఆదివారం జాతీయ అథ్లెటిక్ సమాఖ్య అధికార ప్రతినిధి అడిల్లె సుమరివిల్లా ధ్రువీకరించాడు.



వరల్డ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అడిల్లె బెంగళూరులో జూన్ 5 న జరిగిన నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి సీజన్ ప్రారంభోత్సవానికి విచ్చేశాడు. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై స్పందించాడు. 'వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నాం. అందుకే.. 2029, 2031 ఎడిషన్లకు బిడ్డింగ్ వేయాలనుకుంటున్నాం. అయితే.. తదుపరి హోస్ట్ ఎంపిక ప్రక్రియ మొదలవ్వడానికి ఇంకా సమయం ఉంది. కాబట్టి మేము పక్కాగా హోస్టింగ్ రైట్స్ కోసం ప్రయత్నిస్తాం. హక్కులు దక్కించుకున్న దేశాల పేర్లను 2026 సెప్టెంబర్‌లో డబ్ల్యూఎఫ్ వెల్లడిస్తుంది. సో.. మాకు ఈ రెండిటిలో ఏదో ఒక టోర్నీ ఆతిథ్యానికి ఆమోదం లభించినా సంతోషమే. మరో విషయం.. మేము ఇప్పటికే జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 2028 రైట్స్ కోసం అవసరమైన అన్ని పత్రాలు సమర్పించాం' అని అడిల్లె వివరించాడు.



తన పేరుతో నిర్వహించిన 'ఎన్‌సీ క్లాసిక్' టోర్నీలో నీరజ్ చోప్రా ఛాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అతడు ఈటెను 86.18 మీటర్ల దూరం విసిరాడు. కెన్యా అథ్లెట్ జులియస్ యెగొ 84.51 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, రుమెశ్ పథిరగె (శ్రీలంక) 84.34 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు.

## చరిత్ర సృష్టించిన కెన్యా అథ్లెట్

### 13 నిమిషాల్లోనే 5 వేల మీటర్లు..




ట్రాక్ మీద తన ఆధిపత్యాన్ని చాటిన కెన్యా అథ్లెట్ బియట్రిక్ చెబెట్ చరిత్ర సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలతో మెరిసిన ఆమె ఈసారి 5 వేల మీటర్ల పరుగును కేవలం 13 నిమిషాల్లోనే పూర్తి చేసి వరల్డ్ రికార్డు నెలకొల్పింది. అమెరికాలోని యుగెనేలో శనివారం జరిగిన ప్రాఫెంటెన్ క్లాసిక్‌లో చెబెట్ చిరుతలా దౌడు తీసింది. ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురి చేస్తూ గమ్యస్థానం వైపు దూసుకెళ్లిన ఆమె 13 నిమిషాల 58.06 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. సంచలన వేగంతో పరుగు తీసిన చెబెట్ ఇథియోపియా రన్నర్ గుడాఫ్ సెగే పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేసింది. రెండేళ్ల క్రితం ఇదే వేదికపై గుడాఫ్ 14:00.21 టైమింగ్‌తో 5 వేల మీటర్ల పరుగును పూర్తి చేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో చెబెట్ దేశానికి రెండు గోల్డ్ మెడల్స్ అందించింది. 5 వేల,10 వేల మీటర్ల పరుగులో పసిడి పతకంతో కెన్యా గర్వపడేలా చేసింది. గత నెలలో రోమ్‌లో 5 వేల మీటర్ల రన్‌లో పాల్గొన్న ఆమె 14:06.39 టైమింగ్‌తో రేసును ముగించింది. ఈసారి ప్రెఫాంటెన్ క్లాసిక్‌లో తన ప్రదర్శనను మెరుగుపర్చుకున్న చెబెట్ రికార్డులు బద్ధలు కొడుతూ విజేతగా నిలిచింది.

# ఆరోగ్యం

ఫోకస్

## నిర్లక్ష్యం ప్రాణం తీస్తుంది!



ఆరోగ్యం విషయంలో ఏ చిన్నపాటి నిర్లక్ష్యమైనా ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తుందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల కబడ్డీ ఆటగాడు బ్రిజేష్ సోలంకి మృతి స్పష్టం చేస్తున్నది. రాబిస్ వ్యాధి సోకడంతో, అత్యంత తీవ్రమైన అనారోగ్యానికి గురై అతను ప్రాణాలు కోల్పోయిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. కాలువలో పడిన కుక్కపిల్లను రక్షించే క్రమంలో అది కొరకడంతో బ్రిజేష్‌కు చిన్నగాయమైంది. ఆ సంఘటనను అతను ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే, క్రమంగా రాబిస్ వ్యాధి లక్షణాలు కనిపించడంతో, జూన్ 26న అలీగఢ్‌లోని ఖుర్జా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికీ వ్యాధి ముదిరిందని వైద్యులు ప్రకటించారు. చికిత్స కొనసాగుతుండగానే, వ్యాధి లక్షణాలు తీవ్రమై, చివరికి బ్రిజేష్ మృతి చెందాడు. వ్యాధుల విషయంలో ఏ అంశాన్నీ తేలిగ్గా తీసుకోరాదని ఇలాంటి ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యాధి లక్షణాలను ప్రస్తావిస్తే, రాబిస్ ఒక ప్రమాదకరమైన వైరస్ వల్ల మనుషులకు సంక్రమిస్తుంది. ఇది ప్రధానంగా ప్రాణాలు పొడచేసే జంతువుల కాటు లేదా స్క్రాచ్ ద్వారా మనుషులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధిని కలిగించే వైరస్ పేరు 'రాబిస్ లిస్సావైరస్'. సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది మానవులలో మానసికస్థితి మార్పులు, కోమా, చివరికి మరణానికి దారితీస్తుంది. కుక్కలు, కోతులు, నక్కలు, గబ్బిలాలు తదితరాల కాటు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఆయా జంతువుల నోటి లాలాజలం మనిషి శరీరంలోకి గాయం లేదా నోరు లేదా కళ్ల ద్వారా వెళ్లడం ఈ వ్యాధి సోకడానికి ప్రధాన కారణం. ఎక్కువగా రాబిస్ ఉన్న జంతువుల కాటు వల్ల వ్యాధి వస్తుంది. రాబిస్ వైరస్ నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. అది మెదడులోకి ప్రవేశించి జీవితాంతానికి హాని చేస్తుంది.

**సాధారణ లక్షణాలు:** జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట, గాయపడ్డ చోట వద్ద నొప్పి, మంట.


**వ్యాధి తీవ్రమైనప్పుడు కనిపించే లక్షణాలు:** నీటి భయం (హైడ్రోఫోబియా), గాలి భయం (ఏరోఫోబియా), మానసిక స్థితిలో మార్పులు, తీవ్రమైన ఆందోళన, ఆలాంటి ఆలోచన లేకుండా మొండిగా వ్యవహరించడం, పక్షవాతం, కోమా. చివరికి ఈ లక్షణాలతో వ్యాధిగ్రస్థుడు ప్రాణాలు కోల్పోతాడు.

**పరీక్షలు:** మెదడు, మెదడు శుక్లాలు (సిఎస్ఎఫ్) పరీక్ష, గాయమైన ప్రాంతం నుంచి నమూనాలు తీసుకొని వైరస్‌ను గుర్తించడం, శరీర ఉష్ణోగ్రత, నాడీ వ్యవస్థ పనితీరును బట్టి అంచనా వేస్తారు.

**చికిత్స:** ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్ప రాబిస్ వ్యాధికి సరైన చికిత్స లేదు. ఒకసారి లక్షణాలు ప్రారంభమైన తర్వాత వ్యాధిని అదుపుచేయడం లేదా తగ్గించడం దాదాపు అసాధ్యం. కాబట్టి, కుక్క లేదా మరేదైనా జంతువు కరిచినప్పుడు వెంటనే వైద్యం చేయించుకోవాలి. యాంటీ రాబిస్ ఇంజక్షన్ తప్పనిసరి. ప్రధానంగా ప్రోఫిలాక్టిక్ వ్యాక్సినేషన్ (రోగం వచ్చే ముందు ఇచ్చే టీకాలు), తక్షణ చికిత్స అవసరం. జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని స్వచ్ఛమైన నీటితో, సబ్బుతో కనీసం 15 నిమిషాలపాటు శుభ్రం చేయాలి. ఆ వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. రాబిస్ వ్యాక్సిన్‌ను జంతువు కరిచిన రోజు, ఆ తర్వాత 3, 7, 14, 28వ రోజు తీసుకోవాలి లేదా వైద్యులు సూచించిన విధానాన్ని అనుసరించాలి. కొన్ని సందర్భాల్లో రాబిస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఆర్ఐజి) అవసరమవుతుంది.

ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడమే రాబిస్ వ్యాధి సోకకుండా, వ్యాపించకుండా ఉండడానికి ప్రధానం. మన చుట్టుపక్కల ఎక్కువగా కనిపించే కుక్కలు, పిల్లులకు వ్యాక్సిన్ వేయించాలి. జంతువులు కరిచినప్పుడు, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చికిత్స తీసుకోవాలి. వీధి కుక్కల నుంచి దూరంగా ఉండాలి. రాబిస్ రోగుల రక్తం, శ్వాస, లాలాజలం తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మన దేశంలో ఏటా సుమారు 20,000 మంది రాబిస్ వ్యాధి కారణంగా చనిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. కుక్కలు, పిల్లులు, ఇతర జంతువులు కరిచినప్పుడు తక్షణమే సరైన చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే, పర్యవసానం ఎలావుంటుందనేది బ్రిజేష్ ఇతివృత్తం స్పష్టం చేస్తున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి, ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడే అవకాశం కోసం పోటీపడుతున్న అతని అకాల మరణం దురదృష్టకరం... అత్యంత బాధాకరం.

### జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులే అధికం!



అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మ జీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను జునోటిక్ వ్యాధులుగా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మ జీవులు, 60 వరకు పరాన్న జీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. ప్రపంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది. దాదాపు 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సూక్ష్మ జీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజల వద్ద పెంపుడు జంతువులు ఉన్నాయి. వాటితో పాటు, ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## దోపిడీ రహిత సమాజమే లక్ష్యం




### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి/శేరిలింగంపల్లి :** నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసమే భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి మండల సిపిఐ 4వ మహాసభ ఆదివారం ఇజ్జత్‌నగర్‌లో జరిగింది. ఈ మహాసభలో సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్న పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పోరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతుందని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వారి మద్దతు ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ ఎక్కువ కేటాయించడం, వెనక బడిన రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అన్నారు. గత ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రజాపోరాటాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించుకోవడానికి జాగలేని పేదలకు 60 గజాల చొప్పున ఇంటి జాగాను కేటాయించాలని కోరారు.

**నూతన సమితి ఎన్నిక...**

అనంతరం మహాసభలో సిపిఐ శేరిలింగంపల్లి నూతన మండల సమితిని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రకటించారు. శేరిలింగంపల్లి సిపిఐ మండల సమితి కార్యదర్శిగా టి.రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సహాయ కార్యదర్శిగా కె చందు యాదవ్‌తో పాటు 15 మంది కార్యవర్గ, 31మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రకటించారు.

## బయ్యారం ఉక్కు మానుకోట హక్కు

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** బయ్యారం ఉక్కు మానుకోట ప్రజల హక్కు అని, తెలంగాణ రాష్ట్ర విభజన చట్టం అమలు చేసేదాకా సిపిఐ ఉద్యమిస్తుందని, జిల్లా సమగ్రాభివృద్ధికి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని మహబూబాబాద్ జిల్లా కురవిలో పోగుల శ్రీనివాస్ గౌడ్ ప్రాంగణం ఓం ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిపిఐ జిల్లా మహాసభల రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. వందేళ్ళ చరిత్ర కలిగిన సిపిఐ సుదీర్ఘ ప్రయాణంలో శ్రమజీవుల కోసం ప్రజలను నిత్యం చైతన్య పరుస్తూ, పేదల పక్షాన నిలిచి పోరాడుతోందన్నారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ అనేక ఆందోళనా కార్యక్రమాలు చేశామని, విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఆనాటి బిఆర్ఎస్, బిజెపి విధానాలను ఎండగట్టామని విజయసారథి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో రెండు చోట్ల ప్రభుత్వ భూములను గుర్తించి పేదలతో గుడిసెలు వేయించామని, ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ పక్షాన ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కురవి ప్రభుత్వ భూముల్లో పేదలచే గుడిసెలు వేయించి భూపోరాటాలు కొనసాగిస్తున్నట్లు, సిపిఐ జిల్లా 4వ మహాసభల నాటికి ప్రతి మండలంలో పార్టీ కమిటీలు, శాఖలు ఏర్పాటుచేసుకుని పార్టీ బలోపేతానికి, మహాసభ తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి పార్టీని ముందుకు తీసుకువెళ్ళాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లు, మున్సిపాలిటీలో వార్డుల్లో సిపిఐ పక్షాన సత్తా చాటాలని జిల్లా సెక్రటరి విజయసారథి పిలుపునిచ్చారు. కార్యదర్శి నివేదికను ప్రతినిధుల సభ చప్పట్లతో ఆమోదించింది.

**సిపిఐ ప్రతినిధులకు డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ సందేశం...** తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ సిపిఐ మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభల ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులుగా ప్రతినిధుల సభకు సౌహార్ద సందేశాన్ని పంపించారు. సందేశాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ప్రతినిధుల సభలో చదివి వినిపించారు. వందేళ్ళ భారత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావాలని సందేశం ద్వారా ఆకాంక్షించారు. ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు అరుణపతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య ఎగురవేశారు. అమరవీరుల స్థూపం వద్ద ముఖ్య అతిథులు, జిల్లా సిపిఐ నేతలు, ప్రతినిధులు నివాళులర్పించారు. రేషపల్లి నవీన్, తుర్క రమేష్, మామిండ్ల సాంబలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరావు, కరణం రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, పాండురంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి వ్యతిరేకంగా పోరాడుదాం




### సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** అవినీతినికి వ్యతిరేకంగా పోరాడదామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు పిలుపునిచ్చారు.. సివిల్ వ్యవహారాలలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మంది ఎస్ఐలపై తక్షణమే జిల్లా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ గద్వాల జిల్లా కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాల ఒత్తిళ్లకు తలొగ్గి కొంతమంది పోలీసు అధికారులు ప్రజలకు ఇబ్బందుల కలిగిస్తున్నారని ఈ మధ్య జరిగిన సంఘటనలే ఉదాహరణ అన్నారు. కొంతమంది ఎస్ఐలు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై జిల్లా పోలీస్ యంత్రంగం తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండలాల్లో ఇంటలిజెన్సీ నిఘా పెంచాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన సివిల్ భూతగాదాల కేసులపైన సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. చాలా మండలాల్లో ప్రజలు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు బలైపోతున్నారని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రాజకీయ నాయకుల పైన మాత్రం పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ గ్రామాల్లో మండలాల్లో వచ్చిన ఫిర్యాదులపై దృష్టి పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే, పోలీసుల పై ఒత్తిడి తెచ్చే నాయకులకు గుర్తించి వారి పట్ల కఠినంగా వ్యవహించాలని డిమాండ్ చేశారు. పోలీస్ అధికారులు అవినీతికి దూరంగా ఉండి అవినీతిని జిల్లా నుండి తరిమికొట్టడానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని ఆంజనేయులు తెలిపారు.

## మోదీ పాలనలో ఉద్యోగ అవకాశాలు ఏవీ?

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

### ఎర్రజెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించిన పువ్వాడ





**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో పదవీ విరమణలు తప్పా రిక్రూట్‌మెంట్స్ లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రభుత్వరంగంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు కేంద్రప్రభుత్వం ప్రయత్నించకపోగా, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేయడంతో కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర ఐదవ మహాసభ ఆదివారం సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో జరిగింది. సభకు ముందు నగరంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి మహాసభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మహాసభలో బాగం హేమంతరావు మాట్లాడు తూ బిజెపి పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని దేశ సంపదను ప్రైవేటుకు దారాదత్తం చేయడంలో మోదీ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. మోదీ పదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధర లు 114 శాతం పెరిగాయని, తలసరి ఆదాయం తగ్గి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నా రు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 మాసాలు గడిచిన ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్‌కు సిపిఐ కట్టుబడి ఉందన్నారు. అధికారం కోసం బిజెపి కలలు కంటుందని, చైతన్యవంతమైన తెలంగాణలో బిజెపి కల నెరవేరదన్నారు. పార్టీ విస్తరణే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు.

**సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు : పువ్వాడ**

సంక్లిష్ట స్థితిలో దేశ రాజకీయాలు ఉన్నాయని ఈ స్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు.మహాసభలో ప్రారంభ ఉపన్యాసం చేసిన పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలపడితే సమాజానికి శ్రేయస్కారమన్నారు. బలపడేందుకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించుకోవాలని పువ్వాడ సూచించారు. యువతరానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆహుతులను ఆహ్వానించారు. మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మోహన్‌రావు, జాకీర్ పాల్గొనగా మహాసభకు వరదా నర్సింహారావు, కె.సతీష్‌రెడ్డి, నామ విజయ్‌కుమార్, ఆముదాల వెంకన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

**భారీ ప్రదర్శన :** సిపిఐ నగర మహాసభలను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కోలాట, డప్పుదళాలతో వందలాది మంది సిపిఐ కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొన్నారు. సిపిఐ ప్రదర్శనతో పట్టణం అరుణ పతాక రెపరెపలతో కొత్త శోభను సంతరించుకుంది.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



**ప్రజాపక్షం/మునుగోడు/చండూరు:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం, నగదు బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం ఆదివారం మునుగోడులోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని పుల్లెంల జడ్పి హెచ్ఎస్ లో చదివిన విద్యార్థులు ముగ్గురు విద్యార్థులు మొదటి బహుమతి కె. రీతిక 15వేలు , ద్వితీయ బహుమతి కె. యశ్వంత్ 10వేలు , మూడవ బహుమతి జి.లక్ష్మీ ప్రణతి 7500 రూపాయలతో పాటు షీల్డ్ లను కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి , ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.



## వీరోచిత పోరాట త్యాగానికి ప్రతీక మొహర్రం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** వీరోచిత పోరాటాల త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ అని కుల, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా జరుపుకునే పండుగలో పాల్గొనడం సంతోషంగా ఉందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం ఆయన జూలూరు గ్రామంలోని పీర్ల ప్రార్థన మందిరాన్ని ఆయన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అంజయ్య గౌడ్‌లతో కలిసి సందర్శించి దట్టిని సమర్పించి పూలమాలలు వేసి ప్రార్థన చేశారు. అనంతరం స్థానిక సంస్థ ఎన్నికలలో గెలుపు కోసం ఐక్యంగా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. ఉపాధ్యక్షులు చింతల శ్రీశైలం, పిల్లాయి పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ సతీష్ చారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు భూషణం గౌడ్, మెట్టు రామ్ రెడ్డి, తోట బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గ్యార సందీప్, సయ్యద్ ఎజాజ్, ముస్లిం మత పెద్దలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేర నియంత్రణకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. ఆదివారం ఆయన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి కేసుల వివరాలు, రికార్డులు, స్టేషన్ ఆవరణను పరిశీలించి మాట్లాడారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అన్నారు. ప్రజా ఫిర్యాదుల్లో ఏటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ మోతీరాం, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొహర్రం మతసామరస్యానికి ప్రతీక

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇడికూడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మొహర్రం పండుగలో పాల్గొని సవారి పీర్లకు దట్టీలు కట్టి శాలను సమర్పించారు. అనంతరం సవారి ఎత్తి ప్రజలను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పీర్ల పండుగ హిందూ ముస్లింల ఐక్యమత్యంగా ఉంటూ ఆనందోత్సవాల మధ్య జరుపుకునే పండుగ అని అన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం పెద్ద ఎండి ఘని , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోరిమి ఓంకారం , మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, పల్లె వెంకన్న, గుంట సత్యం , కదారి లక్ష్మణ్ , కోడి గిరిబాబు , ఎఎంసి వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

## మండలంలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యుల పర్యటన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని రేఖ తండాలో ఆదివారం నేషనల్ లెవెల్ మానేటరింగ్ (ఎన్ఎల్ఎం) టీం సభ్యులు పర్యటించి పలు పనులను రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎల్ఎం టీం సభ్యులు సలీం కుమార్, సలియోన్ పర్యటించి రేఖ తండాలో ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించి అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు ఈ సందర్భంగా గ్రామంలో టీజీఎస్ కింద మంజూరైన పనులు, తోటల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో రైతులు ఉపాధి హామీ కింద విడుదలయ్యే పండ్ల తోటలో ఉపయోగించుకోవాలని అన్నారు. గ్రామాలలో మునగ తోటలో పెంపకం ద్వారా కుటుంబ సభ్యులకు మొత్తం ఉపాధి కలుగుతుందని మంచి ఆదాయ అవకాశాలు కూడా ఉంటాయని తెలియజేశారు. నేడు ఈ టీం సభ్యులు మండలంలోని రేఖ తండాలో పర్యటించనున్నట్లు తెలిపారు. వారి వెంట జిల్లా గ్రామీణ ఉపాధి అధికారి నవీన్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీ ఓ ఝాన్సీ, ఏపీవో వెంకటేశం, ఏపీఎం వినోద్ కుమార్, వేయి రామకృష్ణ ఉన్నారు.

## సాగర్ బ్యాక్ వాటర్‌లో పడి యువకుడు గల్లంతు



**ప్రజాపక్షం/చందంపేట:** సాగర్ బ్యాక్ వాటర్‌లో పడి యువకుడు గల్లంతు అయిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని వైజాక్ కాలనీలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని లింగంపల్లి కి చెందిన అనిల్ తన స్నేహితులతో కలిసి ఆదివారం మండల పరిధిలోని వైజాక్ కాలనీలోని సాగర్‌బ్యాక్ వాటర్ విహార యాత్రకు రావడం జరిగింది. ఈ క్రమంలో స్నానం చేద్దామని నీటిలోకి స్నేహితులతో కలిసి దిగిన అనిల్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

### అభివృద్ధి పనుల పరిశీలన, ఇందిరమ్మ లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఆలేరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వాటి పురోగతి వివరాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య గుడ్ మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం ఆలేరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నేరుగా పరిశీలన చేయడానికి గుడ్ మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఆలేరు పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన అండర్ పాస్ బ్రిడ్జి పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారం, 15 రోజులు, నెలరోజుల వారీగా టార్గెట్ నిర్ణయించుకొని దానికి అనుగుణంగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభయహస్తం పథకంలో భాగంగా నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. ఆలేరు పట్టణంలో మంజూరైన ఇండ్ల నిర్మాణంలో ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లకు పైగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇండ్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు బిల్డింగ్ నిర్మాణ మెటీరియల్ రేట్లు పెంచకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. తమ సొంతింటి కల సాకారం అవుతున్న సందర్భంగా ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆలేరు పట్టణంలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

# మోదీ నియంతృత్వ పోకడలను అడ్డుకుందాం



ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కార్పోరేట్ శక్తులకు అమ్ముతున్న ప్రధాని నరేంద్రమోదీ నియంతృత్వ పోకడలను అడ్డుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలో ఎఐటియుసి, ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, బిఆర్ఎస్‌కెవి ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 9న జరిగే ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో సగటు ఒక కుటుంబం బతకడానికి కనీసం 26వేల రూపాయలు కావాలని అన్నారు. విద్య, వైద్యం, ప్రజా రవాణా ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలన్నారు. రైతు పండించిన పంటకు కనీసం మద్దతు ధర అమలు చేయాలన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌ని పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముత్యాలు, ఐఎన్‌టియుసి నాయకులు ఉప్ప శ్రీను, ఐఎఫ్‌టియు నాయకులు వక్కంతుల నర్సింహారావు, బిఆర్ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, పిడియం రాష్ట్ర కన్వీనర్ అంజయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి లతీఫ్, కార్మిక సంఘాల నాయకులు ఉదయగిరి, కర్ల సుందర్‌బాబు, రమణ పాల్గొన్నారు.



### 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ మద్దతు : బెజవాడ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** 9న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సిపిఐ జిల్లా పార్టీ మద్దతు తెలియజేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కామ్రేడ్ ధర్మబిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని విధానాన్ని ఎత్తివేసి కార్మికుల సమ్మె హక్కుకు కాలరాసే విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు సైదులు పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సంఘటితం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎఐటియుసి దేవరకొండ నియోజకవర్గ సమావేశం స్థానిక ఆదివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా జూలై 09న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను కార్మికులు ఏకమై జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 100 సంవత్సరాలకు పైగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా తీసుకురావడం జరుగుతుందని కార్మికుల హక్కులను కాలరాసే ఈ 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మెలోకి వస్తున్నాయని కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మల్లయ్య, మైనోద్దీన్, లింగమయ్య, దేవయ్య, జవహర్, శంకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



### దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సైదిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,రైతు వ్యతిరేఖ విధానాలకు నిరసనగా జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల సబ్బండ వర్గాలు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ సమితి సమావేశం లెనిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలోసైదిరెడ్డి మాట్లాడుతూ కేంద్రలో మోడీ 3 వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లు గా తీసుకువచ్చి పెట్టుబడి దారుల కొమ్ము కాస్తూ కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మదార్, ప్రద్యుమ్నా రెడ్డి, గుండె రవి, పాండయ్య, యూసుఫ్, బాసాని వెంకటయ్య, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానం




**ప్రజా పక్షం/హాలియా:** హనుమకొండ జిల్లాలో ఈనెల 5,6 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 600 మీటర్ల పరుగు పందెంలో హాలియాలోని ఆకాంక్ష పాఠశాల కు చెందిన విద్యార్థి పవన్ కుమార్ మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ కు పాఠశాల యాజమాన్యం విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, డైరెక్టర్ ఉన్నం శీను బాబు, వీటి ఆవుల చంద్రశేఖర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కరీం ఖాన్ తదితరులు ఉన్నారు.

## గుట్టపై నిర్మిస్తున్న రోడ్డును వెంటనే ఆపాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మౌలాన ఎహసానోద్దీన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడు రోడ్ లో ఉన్న ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లతీపుల్లా షా ఖద్రీ దర్గకు ప్రస్తుతం ఉన్న మేట్ల మార్గంతో కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని కోరిన విధంగా రోడ్డు మంజూరు చేయించారని గుర్తు చేశారు. మునుగోడు బైపాస్ రోడ్డు నుంచి గుట్టపైనకి రోడ్డు వేస్తున్న భూమివక్ఫ్ బోర్డుకు చెందినది కాబట్టిన వక్ఫ్ బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా రోడ్డు వేయడం సరికాదన్నారు. గుట్ట వెనకభాగంలోని బ్రహ్మగారి, దుర్గామాత ఆలయం వద్దకు దారిని ఏర్పాటు చేడం కోసం తప్పదర్గా కోసం కాదని అనుమానం వ్యక్తం చేశారు. పట్టణంలో అనేక చోట్ల వక్ఫ్ బోర్డుకు చెందిన భూమలు ఆక్రమణలకు గురౌతున్నాయని తాము ఇప్పటికే వక్ఫ్‌బోర్డు సీఈవోకు పర్యాదు చేశామని తెలిపారు. పట్టణంలో ఎన్నో సమస్యలు వచ్చినా అధికారులు పెద్దల సమక్షంలో చర్చించి పరిస్కరించుకున్నామని గుర్తు చేశారు. అధికారులు సరైన విదంగా వ్యవరించక పోవడం వల్లనే సమస్య వస్తుందని తెలిపారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షడు రజియోద్దీన్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకలు వెంచర్లో వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమి ఉందని పిర్యాదు చేస్తే సర్వే సందర్భంగా పోలీసలు దగ్గరుండి చూసుకున్నారని చెప్పారు. సర్వే పూర్తి చేయాల్సి ఉండగా వెంచర్కోసం సర్వే నివేదిక తీసుకున్నారని తెలిపారు. ఈ సమేశంలో ముస్లీం పెద్దలు ఖలీం, హపీజ్ఖాన్, హాషం తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దు



**ప్రజాపక్షం/కోదాడ:** జిల్లాలో వానకాలం రైతులు సాగు చేస్తున్న పంటలకు సరిపోను యూరియా అందుబాటులో ఉందని డీలర్లు యాదావిధిగా యూరియా అమ్మకాలు జరుపుతారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో పెర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు, వ్యవసాయ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఫర్టిలైజర్ షాపు యాజమానులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నారని, నేటి నుండి యధావిధిగా యూరియా అమ్మకాలు జరుగుతాయని అన్నారు. రైతులు ఇప్పుడు వరిసాగు విత్తనాలు వేస్తున్నారని యూరియా వేసే సమయం రాలేదని ముందస్తుగా యూరియా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు రైతులకు సకాలంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే విధంగా యూరియా అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందేందుకు కారకులైన వారిపై యూరియాను బ్లాక్ చేసిన అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఒక్క యూరియా బస్తా అమ్మితే 30 రూపాయలు లాస్ వస్తున్నందున తాము యూరియా సరఫరా ఏసి కంపెనీలపై ఒత్తిడి తెచ్చేందుకే తమ అసోసియేషన్ నాయకులంతా కలిసి సమావేశం ఏర్పాటు చేసి తీర్మాణం చేశామని, రైతులు కాని ప్రభుత్వం కాని ఇబ్బంది పెట్టే ఆలోచన తమకు లేదన్నారు. నేటి నుంచి యూరియా అమ్మకాలు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏవోలు రజని, రాజు, ఫర్టిలైజర్ డీలర్ ఉపాధ్యక్షులు జూలకంటి రామిరెడ్డి, డీలర్‌రామారావు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఐవిఎఫ్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలు చేపట్టామని ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల భద్రాద్రి రాములు పేర్కొన్నారు.ఇండియన్ వైష్ ఫడరేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని రామగిరి లో గ ల మల్టీస్పెషల్టి ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య పరీక్షలు జరిపి అవసరమున్న వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐ వి ఎఫ్ పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ఈ అవకాశం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్క వెంకయ్య,కోశాధికారి గోవిందు బాలరాజు,మహిళా అధ్యక్షురాలు కోమీరి శెట్టి రమ,సెక్రటరీ వందనపు జ్యోతి,ప్రోగ్రాం కన్వీనర్ పారపల్లి శ్రీనివాస్,నాయకులు కోటగిరి దైవ దినం,బండారు వెంకటేశ్వర్లు, బండారు జ్యోతి, తాళ్లపల్లి రాము, గుండా రమేష్, తాటిచెట్టు గోవర్ధన్ ,ఓరుగంటి పరమేశ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయికి బానిసలైన దొంగలు అరెస్ట్

### ఇద్దరు మైనర్ బాలురు, ఒక మహిళకు రిమాండ్
### జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** గంజాయి తాగుటకు బానిసలై రాత్రి వేళలో తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనాలకి పాల్పడుతున్న ఇద్దరు మైనర్ బాలురు, ఒక నిందితుడని వారికి సహకరిస్తున్న ఒక మహిళని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో రీల్స్ కి అలవాటు పడి, గంజాయి కి అలవాటపడి దొంగతనాన్ని పాల్పడుతున్న వారిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుండి 17 తులాల బంగారం, 79 తులాల వెండి, 50 వేల విలువ గల 02 కిలోల గంజాయి ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు. మొత్తం విలువ 20 లక్షలు ఉంటుందని తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మికంగా తీసుకొన్న మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ఆస్తి సంబందిత నేరాలను అరికట్టుట చేధించుటలో భాగంగా గత నెల 30న గాలి యాదయ్య,రిటైర్డ్ ఆఫీసర్ తన ఇంటిలో 22 తులాల బంగారం, 80 తులాల వెండి దొంగతనం జరిగిందని ఫిర్యాదు ఇవ్వడం జరిగింది అన్నారు ఈ కేసును నార్కట్పల్లి సీఐ ఆధ్వర్యంలో ఎస్సై సిబ్బంది పలు బృంధాలు గా ఏర్పడి గాలిస్తున్న సమయం లో ఈనెల 6న నమ్మదగిన సమాచారం మేరకు నార్కెట్ పల్లి గ్రామ శివారులో గల రెడ్డయ్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ లో నలుగురు వ్యక్తులు నార్కెట్ పల్లి చుట్టు ప్రక్కల అవసరం ఉన్న వ్యక్తులకు గంజాయి అమ్మడం కొరకు ప్లాన్ చేస్తున్నారని సమాచారం మేరకు నార్కెట్‌పల్లి ఎస్ఐ డి.క్రాంతి కుమార్, సిబ్బందితో నార్కెట్ పల్లి గ్రామ శివారులో రెడ్డయ్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ దగ్గరలో వెళ్ళి అనుమానాస్పదంగా కనిపించిన పైన తెలిపిన నలుగురు వ్యక్తులను అంధులో ఒక ఆడ మనిషిలని పట్టుబడి చేసి వారిని విచారించగా అట్టి నిందితులు సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని ఒక పథకం ప్రకారం 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి గంజాయి ని తీసుకొని గంజాయి తాగే వారికి నార్కెట్ పల్లి చుట్టు ప్రక్కల అవసరం ఉన్న వ్యక్తులకు గంజాయిని అమ్మాలని ప్రయత్నిస్తుండగా గ్రామ శివారులో రెడ్డ య్య ఫ్యాక్టరీ ప్రక్కన వెంచర్ లో నార్కెట్ పల్లి పోలీసు వారు పట్టుబడి చేసి నిం దితుల వద్ద నుండి 2 కేజిల గంజాయి, బంగారు గాజులు, బంగారు పుస్తెలతాడు, బంగారు నక్లెస్, సిల్వర్ కుంకుమ బారనిలు, బంగారు చెవి రింగ్స్, బంగారు సదా రింగ్, బంగారు మాటీలు, గోల్డ్ కాయిన్స్, వెండి పట్టాగొలుసులు, వెండి కాయిన్స్, వెండి విగ్రహాలను మొత్తం 17.1 తులాల బంగారం, 79 తు లాల వెండి1ద్విచక్ర వాహనన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## బందోబస్తును పరిశీలించిన డిఎస్‌పి



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మొహరం పండుగ సందర్భంగా ఉట్కూరు టౌన్‌లో పీర్ల ఊరేగింపు సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు చేయడం జరిగింది. పీర్ల ఊరేగింపు సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. డిఎస్పీతో పాటు మక్తల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామ్లాల్, ఉట్కూర్ ఎస్సై రమేష్ అన్నారు.

## తోటి మిత్రుడికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండల పరిధిలోని భూనిడ్ పాఠశాలలో 2008–2009 పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ తోటి మిత్రునికి గత ఆరు రోజుల క్రితం అమీన్పూర్ నుంచి నారాయణపేటకు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనం ప్రమాదంలో కాలు, చేయి విరిగిపోయింది. అది తెలుసుకున్న తోటి మిత్రులు ఆదివారం రూ.61,000 ఆర్థిక సహాయం అందజేశారు. శివకుమార్ తల్లికి నారాయణపేటలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అందజేశారు. పాఠశాలలో కలిసి చదువుకున్న మిత్రుడికి అండగా ఉండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## బాబు జగ్జీవన్ సేవలు ఎనలేనివి



'ముడా' చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దేశానికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ఎనలేనివని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో ఆదివారం మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. అన్నగారిని వర్గాల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు ధర్మాపురం నరసింహారెడ్డి, గోవందు యాదవ్, మహమ్మద్ ఖాజా, రాంచందర్, రాజుగౌడ్, యాదయ్య, రంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, అజీజ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నారాయణపేట జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.నర్సింహులు




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నారాయణపేట జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టీ.నర్సింహులు ఎంపికయ్యరు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. మరికల్ మండల కేంద్రంలో నారాయణపేట జిల్లా రెండవ మహాసభలు దిగ్విజయంగా జరిగిందని వారన్నారు. నారాయణపేట జిల్లాలో నెలకొన్న సమస్యలపై తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని, కర్షకులు కార్మికుల ప్రజా సమస్యల పై రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు.

## విద్యార్థుల మధ్య అమృత్ జయంతి



**ప్రజాపక్షం/మక్తల్:** మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహా గౌడ్ తనయుడు స్వర్గీయ అమృత గౌడ్ జయంతి వేడుకలు విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్థానిక ఆనంద నిలయం ఆవరణలో అమృత్ గౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి వారి కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరము విద్యార్థుల మధ్య కేక్ కటింగ్ చేసి 100 మంది విద్యార్థులకు ప్యాడ్స్, కంపాక్స్ బాక్సలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, నాయకులు జుట్ల శంకరు, చందాపురం అశోక్ కుమార్ గౌడ్, బండారి ఆనంద్, కె.ఆంజనేయులు, ఎల్లిగండ్ల బాలప్ప, మల్లేష్, బండారు రవి, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ మణికంఠ గౌడ్, నంద నిలయం హాస్టల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాబు, కింగ్స్ యూత్ సభ్యులు సాయి, సమీర్, కావలి తరుణ్, అక్షయ దామోదర్, రాహుల్, పండు, అప్పి నవీన్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మొహర్రం వేడుకలు

**ప్రజాపక్షం/మద్దూర్ :** మతసామరస్యానికి ప్రతీకైనా మొహర్రం పండుగను మద్దూరు మండలంలోనీ ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. హసన్ హుస్సేన్ నవబి సవారి కనుల పండుగ జరిగింది. వేడుకల్లో వందలాది భక్తులు పాల్గొని పీర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం హసేస్ హుస్సేన్ పెద్ద పీర్లు, చిన్న పిల్లల అలయ్ బలయ్ ఘనంగా జరిగింది. సాయంత్రం హసేన్, హుస్సేన్ సవారి ఊరేగింపు తర్వాత మద్దూర్ మున్సిపాలిటీలోని అన్ని పీర్లు మున్సిపాలిటీ దగ్గర చేరుకొని అలయ్ బలయ్ జరుపుకుంటారు. మొహరం వేడుకల సందర్భంగా ఎలాంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై విజయ్ కుమార్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రంగనాయక స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు



**ప్రజాపక్షం/శ్రీరంగాపురం :** మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో తొలి ఏకాదశని పురస్కరించుకొని రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కృష్ణా నది నుంచి నదీ జలాలను చూసుకొని ఆలయంలో 108 కలశములతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. నంతరం ఆలయంలో సహస్రనామ తులసి అర్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు పూజారులు విష్ణు, నారాయణ తీర్థ ప్రసాదం అందించారు.

## నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

ఎంపి మల్లు రవి



**ప్రజాపక్షం/వెల్దండ :** కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు అన్నిరంగాలలో వేగవంతమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభిష్టం మేరకు రూపొందించి అభ్యున్నతి పథకంలో నడిపేందుకు తన వంతు కృషితో పెద్దపీట వేసి సంక్షేమాన్ని సుస్థిరం చేస్తానని ఎంపి మల్లు రవి అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతి లాల్‌నాయక్, కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ తక్కలపల్లి శేఖర్, సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య ఎంపి మల్లురవితో అభివృద్ధి, సంక్షేమ పథకాల పని తీరుపై భేటి అయ్యారు. ఈసందర్భంగా ఎంపి మల్లు రవి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించి వేగవంతమైన అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతో అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ఎన్నికలలో కార్యకర్తలు, నాయకుల గెలుపు కోసం ప్రతి గ్రామం, తండాలలో ప్రజలను మమేకం చేసి ప్రజాప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును ప్రతి గడపకు తీసుకెళ్లి సైనికుడిలా పనిచేసేందుకు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు.

## సాగు, తాగునీరు అందించే ఇసుకను తరలించొద్దు



మాగనూర్ గ్రామస్తుల తీర్మానం

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూర్ గ్రామానికి ప్రకృతి అందించిన గొప్ప వరం మాగనూర్ పెద్దవాగు. మాగనూర్ గ్రామానికి ఇప్పటివరకు సాగు, తాగునీటి ఎద్దడి వచ్చిన సందర్భం లేదని వాగును మాగనూర్ గ్రామస్తులు నీటి ప్రదాతగా కొలుస్తామన్నారు. మా జీవితాలు ఆధారపడి ఉన్న వాగులో ఇసుకను తరలించొద్దంటూ పార్టీలకు అతీతంగా గ్రామస్తులందరూ ఆదివారం గ్రామసభ నిర్వహించి, తీర్మానం చేశారు సంఘం బండ రిజర్వాయర్ నుంచి వచ్చే కెనాల్స్‌లో నీరు వాగు పరిసర భూములకు రావని, వేల ఎకరాలకు వాగే సాగునీరు అందిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ పేట. కొడంగల్ ప్రభుత్వ పనులకు మాగనూర్ గ్రామానికి సాగు, తాగునీరు అందించే ప్రాంతాల నుండి ఇసుకను తరలించే ఆలోచనను మానుకోవాలని అధికారులను కోరారు. గ్రామ అస్తిత్వం మనుగడను దృష్టిలో ఉంచుకొని సహకరించాలన్నారు. కాదని అధికారులు మొండిగా ముందుకు పోతే గ్రామ భవిష్యత్తు, జీవితాలను కాపాడుకునేందుకు ఎంత దూరమైన వెళ్లామని గ్రామస్తులు అంటున్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**ప్రజాపక్షం/జడ్చర్ల/కొత్తకోట:** బాబు జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతిని పురస్కరించుకొని జడ్చర్ల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అయిన విగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, భారత తొలి ఉప ప్రధాని, రాజకీయ వేత్త, బీహార్లోని వెనుకబడినవర్గాల నుంచి వచ్చిన అతను బాబూజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో నలభై, ఏళ్లు కార్మిక శాఖ, రక్షణశాఖతో పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారని తెలిపారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్, సిపిఐమ్ పార్టీ నాయకులు తెలుగు సత్యయ్య, దీప్తా నాయక్, ఎంఆర్‌పిఎస్ నాయకులు గంగాపూర్ బీమ్ రాజ్, బొల్లెమోని నిరంజన్, రంగయ్య మాహారాజ్, శివ శంకర్, గోనెల నరేందర్, మహేష్, రమేష్, శివ పాల్గొన్నారు.

కొత్తకోట మండల కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రాం 39వ వర్ధంతి కార్యక్రమాన్ని పూలమాలతో ఘన నివాళులర్పించారు. పల్లెపాగు ప్రశాంత్ మార్కెట్ యార్డ్ చైర్మన్ మదనాపూర్ మాట్లాడుతూ ఆయన భారత ఉప ప్రధానిగా, రక్షణ శాఖ మంత్రిగా, వ్యవసాయ, కార్మిక శాఖ మంత్రిగా ఎన్నో పదవులు అలంకరించాడని ఆహార సంక్షోభాన్ని నివారించుటకై హరిత విప్లవానికి నాంది పలికాడని, ఆ మహనీయునికి భారతరత్న ప్రకటించాలని కొనియాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.బాబు జగ్జీవన్ రాం విగ్రహ విష్కరణ వ్యవస్థాపక అధ్యక్షులు జె.సుభాష్ అధ్యక్షతన నిర్వహించడం జరపిగింది. ఈ కార్యక్రమంలో పల్లెపాగు ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మదనాపూర్, శ్రీన్నన, భరత్ భూషణ్, మెషేక్, ఇజ్రాయిల్, రాము యాదవ్, సంతోష్ కుమార్, వినోద్ కుమార్ , యాలప్ప, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డు అంబేద్కర్ నగర్‌కు చెందిన రైతుల పంట పొలాలకు నీరు ప్రవహించే ప్రధాన కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరి చెట్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి పొలాలకు నీళ్లు అందక ఇబ్బంది పడుతున్న రైతులు స్థానిక జిల్లా కాంగ్రెస్ నాయకులు గంధం రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు యాదవ్, తన సొంత ఖర్చులతో జేసిబి వాహనంతో కాలువ పూడిక తీత పనులను రైతులు, కాంగ్రెస్ నాయకులతో వెళ్లి ప్రారంభించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేస్తామని రైతులకు భరోసా కల్పించారు. సమస్యకు సత్వర పరిష్కారం చూపినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గంధం సునీల్ కుమార్, మాజీ కౌన్సిలర్ అశ్విని సత్యనారాయణ, మండల సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి, మైనార్టీ నాయకులు షకీల్, వినయ్, యువ నాయకులు గంధం ఉత్తమ్, 1 వార్డు అధ్యక్షులు అడ్డాకుల రాజు 2వ వార్డు అధ్యక్షులు గణేష్, యువ నాయకులు కురుమూర్తి ముదిరాజ్, రైతులు గంధం మొగులన్న, జామపల్లి అయ్యన్న, జామపల్లి కురుమన్న, ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

ఎరుకల ఆరాధ్య గురుదైవం ఏకలవ్యుడు




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ ఎరుకల ఆదివాసి సంఘం నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో ఎరుకల ఆరాధ్య గురుదైవం ఏకలవ్య జయంతి వేడుకలు నారాయణ పేట జిల్లాలోని ఆదివాసి ఎరుకల ఏకలవ్య వారసులు నారాయణపేట జిల్లా ప్రధాన ఆస్పత్రి అప్పంపల్లి ఆవరణలో అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏకలయ్య జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలని ఏకలవ్యుడు ఆదివాసి ఎరుకల జాతికి ఆదర్శంగా ఉంటూ గొప్ప గురుభక్తి, త్యాగము, పట్టుదల కలిగినవారని ఆయన జాతి కోసం చేసిన సేవలను భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఎరుకల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని సంఘ పట్టణ నాయకులు రామకృష్ణ, రవి కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు బాలకిష్టప్ప , ఎంఈఓ రాములు , (రిటైర్డ్ హెచ్ఎం) కన్మనూర్ రాజు, (మాజీ ఎంపిటిసి), ధన్వాడ కాశప్ప, బాలు, బాలస్వామి, జాజాపూర్ ఎల్లప్ప, కోస్గి రవికుమార్, పెద్దజట్రం వెంకటేష్, నిడుగుర్తి ఆనంద్ , చిన్న జట్రం బాలు, దామరగిద్ద అశోక్, పేరపల్లి భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెడితే సహించం



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామంలో ఇటీవల భూతగాదాలో అక్రమంగా అరెస్ట్ కాబడిన మాజీ ఎంపీపీ రాకెట్ వెంకటేష్ కుటుంబాన్ని ఉమ్మడి మండల ముదిరాజ్ నాయకులతో కలిసి పరామర్శించారు. విలేకరుల సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ... వెంకటేష్ కుటుంబీకులకు 1987 ఇచ్చిన అసైన్మెంట్ 1 ఎకరాల భూమిని రిటైర్డ్ డిఐజీ మండవ లక్ష్మి నారాయణ కన్ను వేసి వారిని బినామీల ఆళ్ల నాగమణి, ఉప్పాల పవన్ కుమార్, పేర్ల మీదకు అక్రమంగా ధరణిలో పట్టా మార్పించి తనకు పోలీస్ శాఖలో ఉన్న పరపతిని ఉపయోగించుకొని జిల్లా ఎస్పి గౌతమ్, ఎస్సై నవీద్‌ను ఉపయోగించుకొని ఈ కుటుంబాన్ని బెదిరించి భయభ్రాంతులకు గురి చేసి అక్రమంగా నాన్ బెయిల్ కేసులు పెట్టించారు. ఈ వ్యవహారాన్ని ముదిరాజ్ సామాజికపరంగా తీవ్రంగా ఖండిస్తూ వెంకటేష్ కుటుంబంపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివెయ్యాలని వారి భూములు వారికి అప్పగించి రెవెన్యూ రికార్డు మార్చిన డిఐజీ, వారి బినామీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముదిరాజ్ పెద్దల దృష్టికి ఈ విషయాలు తుసుకు వెళ్లి ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉమ్మడి మండల నాయకులు నల్లే నర్సప్ప, కడెచుర్ కృష్ణయ్య, దండు రాఘువేంద్ర, మాజీ ఎంపీటీసి కొంకల్ వెంకటేష్, మాజీ సర్పంచ్ లు క్రిష్ణమూర్తి, కరిమని తిమ్మప్ప, గుంతల హన్మంత్రాయ, మస్క వెంకటేష్, పి. సిద్ధప్ప, పంతిగి చిన్న, జెవ్ సెర్ నర్సింగప్ప, వాకిటి మల్లేష్, ఓబులపూర్ లింగప్ప, కంద్రాయ తిప్పన్న, హిందూపూర్ ఆంజనేయులు, అతిగేరి శివాజీ, వర్కుర్ శ్రీను, బంగి అశోక్, బిలరాం బాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో ఆలయాలు కిటకిట



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలంలోని గ్రామాలలోని ప్రధాన ఆలయాల్లో వివిధ ఆలయాల్లో భక్తుల సందడితో కిటకిటలాడాయి. శ్రీఅలివేలుమంగ వేంకటేశ్వరస్వామి పాలెం వట్టెం వెంకటేశ్వరస్వామి తదితర గ్రామాల ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు ఉమ్మడి జిల్లా నలుమూలలనుండి వచ్చిన భక్తులు సామూహిక వ్రతాలు వేలాది సంఖ్యలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా గ్రామంలోగల శ్రీఅలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆషాడమాసం ఆదివారం తొలి ఏకాదిశ నాడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించామని ఆలయ కమిటి విష్ణుమూర్తి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఇబ్బందికలగకుండా చూసుకున్నామన్నారు. బాలాజి అన్నదానసత్రందా్వరా భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో అర్చకులు జయంత్, చక్రపాణి, సిబ్బంది పురుషోత్తం, శివకుమార్, బాలయ్య, జగదీష్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన అంకురి ఈశ్వరయ్య అనారోగ్యంతో గతపదిరోజుల క్రితం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు క్యామ మల్లయ్య ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాలస్వామి, భగవంతు, శ్రీశైలం, రమేష్, పెద్దవెంకటయ్య , నిరంజన్, శేఖర్ ఉన్నారు.

## ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ.50,116 విరాళం అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు హరికిషన్‌నాయక్, మాజీసర్పంచ్ రామచంద్రారెడ్డి చేతులమీదుగా ఆలయకమిటి నిర్వాహకులకు ఆదివారం రూ.50,116 విరాళాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మినోనిపల్లి, రాచూర్‌తండా ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, యాదిరెడ్డి, రమేష్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రవిగౌడ్, శ్రీను, శ్రీకాంత్, జగదీష్, హర్ష, కృష్ణ, రామస్వామి, కృష్ణయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 10.30గంటలకు మన్ననూర్ మృగవాణి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారని, అక్కడే స్థానిక రెవెన్యూ అంశాలపై అధికారులతో చర్చిస్తారు. అమ్రాబాద్ పిడబ్ల్యూ బిటిరోడ్డుకు శంకుస్థాపన పనులు, గిరిజనభవనం కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన పనులకు భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం చెంచు ఆదివాసిలకు ఇందిరమ్మ ఇళ్లపథకం లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారన్నారు. పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/నర్వ:** రవి ఫౌండేషన్ అధినేత డాక్టర్ శేఖర్ ఆదేశాల మేరకు ఆదివారం నారాయణపేట జిల్లా మరికల్ మండలం గాజులయ్య తాండ గ్రామంలో రవి ఫౌండేషన్, రవి చిన్న పిల్లల ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి చిన్నపిల్లల ఆసుపత్రి డాక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు వర్షాకాలంలో వచ్చేటువంటి వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్దిని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు రవి చిన్నపిల్లల ఆసుపత్రి సిబ్బంది, యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరము నందు చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అదేవిధంగా పెద్దలకు కూడా బిపి, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవి చిన్నపిల్లల ఆసుపత్రి చిన్నపిల్లలు వైద్యనిపుణులు డాక్టర్ మౌనిగ, ఆసుపత్రి సిబ్బందికి, రవి ఫౌండేషన్ సభ్యులకి గాజులయ్య తాండా గ్రామ పెద్దలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని మల్లిఖార్జున స్వామి ఆలయంలో గురుపౌర్ణమి గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్‌ను రాష్ట్ర పాడి, పశుసంవర్ధక, డెయిరీ, క్రీడా యువజన శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తిప్పయ్య స్వామి నీలమ్మ దంపతులను ఈ కార్యక్రమానికి సతీసమేతంగా హాజరు కావాలని ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.రవికుమార్, సుజాత టీచర్, ఓబులేష్, అంబ్రేశ్, శేఖర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## ఓం శాంతి శాంతి శాంతిః పోస్టర్ రిలీజ్



సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్న తరుణ్ భాస్కర్ మరో ఆసక్తికరమైన సినిమాలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈషా రెబ్బా కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఎ ఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. 2డీ యానిమేషన్ స్టయిల్‌లో ప్రజెంట్ చేసిన కాన్సెప్ట్ వీడియోతో పాటు ఆకట్టుకునే టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేయడంతో తరుణ్ భాస్కర్ ప్రమోషన్ మొదలు పెట్టారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ పోస్టర్ అమ్మాయి , అబ్బాయి జంట చేతులను చూపించడం ఆసక్తికరంగా వుంది. 'ఓం శాంతి శాంతి శాంతిః' అనే టైటిల్‌ను నామకరణం చేశారు ఈషాను కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయిగా, తరుణ్‌ను వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా పరిచయం చేశారు. వారి పెళ్లి తర్వాత కథ ఎలా మలుపు తిరుగుతుంది. ఇద్దరి మధ్య వాగ్వాదాలు, గొడవలు ఎలా వచ్చాయి. ఎలా పరిష్కారమైయ్యాయి వంటి కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. హ్యూమర్, కల్చర్, రిలేషన్షిప్ డ్రామాతో అందరినీ అలరించబోతున్నామని , ఆగస్టు 1న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తరుణ్ భాస్కర్ తెలిపారు.



## పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా 'ది 100' ట్రైలర్ విడుదల

ఆర్‌కె సాగర్ హీరోగా కెఆర్‌ఐఎ ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై నిర్మించిన 'ది 100' చిత్రం ట్రైలర్‌ను ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. రమేష్ కరుటూరి, వెంకి పుషడపు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ సినిమాకు రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. 'జీవితంలో జరిగిపోయినది మనం మార్చలేము, కానీ జరగబోయేదాన్ని ఖచ్చితంగా ఆపగలం' అనే విక్రాంత్ ఐపీఎస్ వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఆయుధాన్ని ఎప్పుడూ ఉపయోగించకూడదనే రూల్ పెట్టుకుంటాడు. కానీ ఆత్మరక్షణ కోసం, అతను తాను ఆయుధంగా చూసుకోవడం ప్రారంభిస్తాడు. వ్యవస్థలోని శక్తివంతమైన వ్యక్తుల మద్దతుతో దూరమైన దొంగల ముఠా అతని జీవితంలో ఒక పెద్ద సవాలు ఎదురౌతుంది. అతని సొంత డిపార్ట్‌మెంట్ కూడా అతనిపై ఆరోపణలు చేసి, చివరికి అతన్ని సస్పెండ్ చేస్తుంది. ఒక వృద్ధ ఆయుధం తీసుకెళ్లనని శపథం చేసిన వ్యక్తి ఆయుధం తీసుకోవడం తప్ప వేరే మార్గం లేని పరిస్థితుల్లోకి వస్తాడు.ఇదే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఆర్‌కె సాగర్. విక్రాంత్ ఐపీఎస్‌గా ఫిట్‌గా కనిపిస్తారు. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించింది.

## ఫిలిం ఛాంబర్‌కు ఎన్నికలు నిర్వహించాలి

### చిన్న నిర్మాతల ఏకగ్రీవ తీర్మానం నేడు ఛాంబర్‌కు నిర్మాతల వినతి



తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలను వాయిదా వేసేందుకు కొందరు తమ స్వార్థంతో ప్రయత్నిస్తున్నారని అసోసియేషన్‌లోని పలువురు చిన్న నిర్మాతలు ఆరోపించారు. తెలుగు ఫిలింఛాంబర్ మాజీ ప్రెసిడెంట్ బసిరెడ్డి, తెలుగు ఫిలింఛాంబర్ ప్రొడ్యూసర్ సెక్టార్ మాజీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలుగు ఫిలింఛాంబర్ ప్రొడ్యూసర్ సెక్టార్ ఈసీ మెంబర్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు చిన్న నిర్మాతల సమావేశం జరిగింది. ఈ నెలతో ప్రస్తుత ఫిలిం ఛాంబర్ బాడీ గడువు ముగుస్తున్నందున వెంటనే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు నిర్మాతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారం రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరపాలని, అయితే ఇప్పుడున్న వారిని కంటిన్యూ చేయాలని కొందరు తమ సొంత ఎజెండా పెట్టుకుని ప్రతిపాదించడం సరికాదన్నారు. ఇప్పుడున్న బాడీనే కొనసాగుతుందని కొందరు మీడియాల్లో దిగజారుడు ప్రచారం చేస్తున్నారని ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు బసిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరపాలని, ఎన్నికలు అడ్డుకోవాలని చూసే వారి ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు. నేడు ఉదయం 10.30 గంటలకు నిర్మాతలు బసిరెడ్డి, డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్మాతలందరూ కలసి తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మెమొరాండం సమర్పించనున్నారు. కాబట్టి నిర్మాతలంతా ఈ మెమొరాండం సమర్పణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నిర్మాతలు రమేష్ నాయుడు, లయన్ సాయి వెంకట్, కె.సురేష్ బాబు, బోడపాటి మురళి, రవీంద్ర గోపాల్ జె.సుదర్శన్ రావు, గురురాజ్, వింజమూరి మధు, శంకర్ గౌడ్ భానూరు నాగరాజు, బందారు అమర్, పిఎల్ కె.రెడ్డి, రంగా రవీంద్ర గుప్త (బుల్లెట్ రవి), మున్నవర్ అలీ, మిత్తాన ఈశ్వర్, ఆర్‌వీఎన్ వరప్రసాద్, వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో వరుణ్ తేజ్ షూటింగ్



నాగబాబు తనయుడు వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్ పదిహేనవ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ విదేశాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ త్వరలోనే విడుదల చేయనున్నారు. ప్రస్తుతానికి వరుణ్ తేజ్ ఫేస్ సరిగ్గా కనిపించకుండా పించినట్లు, చేతి మీద టాటూతో ఒక పోస్టర్‌ను మీడియాకు విడుదల చేశారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. హైదరాబాద్, అనంతపురం షెడ్యూల్స్ తర్వాత షూటింగ్ ఇప్పుడు విదేశాల్లో షెడ్యూల్ శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్ తో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీంతో ఈ ఎనభై శాతం షూటింగ్ పూర్తవుతుంది. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది.



## పాట చిత్రీకరణలో 'ది గర్ల్ ఫ్రెండ్'

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రశ్మిక, దీక్షిత్ శెట్టిపై పాట చిత్రీకరిస్తున్నారు. టాకీ పార్ట్ దాదాపుగా పూర్తయ్యింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నారు. ఈ చిత్రంలోని పాటను ఈ నెలలోనే విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్, సంగీతం హేషమ్ అబ్దుల్ వాహబ్ అందిస్తున్నారు.

## 'టికెట్ కొట్టు.. ఐఫోన్ పట్టు'

## 'వర్జిన్ బాయ్స్' ట్రైలర్ లాంచ్




రాజ్ గురు బ్యానర్‌పై దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో ఆవిష్కరించారు. ఈ చిత్రంలో మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జేడీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. బబ్లు, కౌశల్ మంద, ఆర్జె సూర్య, సుజిత్ కుమార్, కేదార్ శంకర్, ఆర్జె శరన్, శీతల్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమా టికెట్ కొన్న 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని ఈ ట్రైలర్ లాంచ్ సందర్భంగా చిత్ర బృందం తెలిపింది. మనీ రైన్ ఇన్ థియేటర్స్ అనే కాన్సెప్ట్‌తో కొన్ని థియేటర్లలో డబ్బు మీపై వర్షంలో కురిసి ఆ డబ్బు ప్రేక్షకులు సొంతం చేసుకోవచ్చు అంటూ తెలిపారు. 11న వర్జిన్ బాయ్స్ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## దుమ్ము రేపుతున్న పాట




సౌత్ ఇండియన్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో విడుదల చేసిన చికిటూ పాట సోషల్ మీడియాలో దుమ్ము దులుపుతోంది. బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ కూడా ఇందులో అత్యంత కీలమైన పాత్రను పోషించారు. యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ కథతో ఈ కూలీ సినిమాను తెరకెక్కించారు. లోకేష్ కనగ రాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున ఇందులో ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కూడా ఓ అద్భుతమైన పాత్రను పోషించారు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమాలోని చికిటూ అనే పాట విడుదలైన కొద్దీ గంటల్లోనే 2.5 మిలియన్స్ వ్యూస్ దాటిందని దర్శకుడు లోకేష్ కనగ రాజ్ తెలిపారు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రజనీకాంత్‌ను చాలా కొత్తగా చూపించమని దర్శకుడు అన్నారు.

## బాలిక దారుణ హత్య (మొదటి పేజీ తరువాయి)

వారి ఇంటి సంఘంలోని మరొకరి ఇంటి బాత్రూంలో అతి దారుణంగా రక్తపు మడుగులో కనిపించడంతో స్థానిక, కుటుంబసభ్యులు హుటాహుటిన కోరుట్ల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో కోరుట్ల పట్టణంలో దారుణ ఘటన సంచలనం రేపింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటన జరిగిన ఇంటి యజమాని ఫోన్ చేయగా తను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నానని చెప్పినట్లు సమాచారం అందింది. పోలీసుల వివరాల మేరకు ఆదర్శనగర్‌లో నివాసముంటున్న ఆకుల రాములునవీన దంపతులకు కొడుకు కూతురు ఉన్నారు. ఆడుకోవడానికి వెళ్లిన పాప ఇంకా రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానికులు పోలీసులు వెతుకుతుండగా అదే కాలనీకి ఒడుపల్లి విజయ్ అనే వ్యక్తి ఇంటి బాత్రూంలో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. ఆ ఇంటి యజమాని ఇంట్లో లేనని చెప్పడంతో ఎస్పీ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రాత్రి మొత్తం ఎస్పీతో పాటు పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ టీం మొత్తం అన్ని కోణాల్లో వెతికి దర్యాప్తు చేయగా డాగ్ స్క్వాడ్ ద్వారా అంతకుడి కోసం వెతకగా హితిక్ష సొంత చిన్నమ్మ ఆకుల మమత అతి దారుణంగా హత్య చేసినట్లు అంతకురాలిగా అనుమానిస్తున్నారు.. ఆకుల మమత కూడా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మమత బాలికను హత్యచేసిన తర్వాత తాను వేసుకున్న బట్టలకు రక్తపు మరకలు ఉండడంతో ఎక్కడ అనుమానం వచ్చి దొరికిపోతానని హత్య చేసిన వెంటనే తన ఇంటికి చేరుకొని తను వేసుకున్న రక్తపు మరకల బట్టలు వాషింగ్ మిషన్‌లో వేయడంతో వాసన పసిగట్టిన డాగ్ స్క్వాడ్ పోలీస్ టీం, క్లూస్ టీం పోలీసులు నేరుగా వాషింగ్ మిషన్ వద్దకు చేరుకొగా రక్తపు మరకలతో ఉన్న ఆ యొక్క బట్టలు ఎవరివని పరిశీలించగా హితిక్ష చిన్నమ్మ ఆకుల మమత బట్టలుగా గుర్తించారు. మమతను అదుపులోకి తీసుకొని పోలీసులు తనదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టగా హత్య చేయడానికి గల కారణం ఆకుల నవీనపై కసీతో ద్వేషంతో తాన కూతురు హితక్షపై తానే కత్తితో అతి దారుణంగా హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం... ఆకుల మమత ఒకరే హత్య చేశారా ఇంకెవరైన సహకరించారా అనే కోణంలో క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కొన్ని గంటల్లో ఛేదించిన పోలీసులు

ఘటనజరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను స్థానికులు, కోరుట్ల పట్టణ ప్రజలు అభినందించారు. ఈ కేసులో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌తో పాటు డిఎస్‌పి అడ్డూరి రాములు, కోరుట్ల మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్‌బాబు, అనిల్‌కుమార్, కోరుట్ల ఎస్సై చిరంజీవి, మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్, మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ డాగ్ స్క్వాడ్‌టీ, పోలీస్ సిబ్బంది తదితరులు ఈ కేసును అతి తక్కువ సమయంలో చేదించారు.

## ఎలాన్ మస్క్ కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా దేశంలో రిజిస్టర్ చేసుకోలేదు, ఆవిర్భవించలేదు. ఈరోజున 'అమెరికాన్ పార్టీ' ఆవిర్భవించింది. మీ స్వేచ్ఛను మీకు తిరిగి ఇవ్వడంకోసమే పార్టీ ఆవిర్భవించింది' అని ఎక్స్ వేదికగా ఆదివారం ఎలాన్‌మస్క్ పోస్టింగ్ పెట్టారు. 'అవినీతి వృథాఖర్చులతో మనదేశం దివాళాతీసే స్థితికి వచ్చినప్పుడు, మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నట్లు కాదు, ఏకస్వామ్య, ఏకైక పార్టీ పాలనలో జీవిస్తున్నట్టే' అని టెస్లా, స్పేస్ ఎక్స్ సిఇఓ మస్క్ పేర్కొన్నారు. 'డాడ్జ్'తో తెగదెంపులు చేసుకున్న తర్వాత మొదటిసారి మస్క్ తన రాజకీయ ఆశయాన్ని, అభిప్రాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అమెరికాలో ఒక కొత్త పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా?లేదా? అనే విషయంపై ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయ సేకరణ కూడా చేశారు. ఈ ఫలితాలను ఆయన ప్రకటిస్తూ, మెజారిటీ తీర్పుతో పార్టీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. అమెరికన్ ప్రజలకు వారి స్వాతంత్ర్యాన్ని తిరిగి ఇచ్చేందుకే ఈ కొత్త పార్టీ ఆవిర్భవించిందని మస్క్ ప్రకటించారు. డోనాల్డ్ ట్రంప్‌తో రాసుకు పూసుకు తిరిగిన మస్క్ సంబంధాలు చెడిపోతున్న సంకేతాలు కనిపించిన తరుణంలోనే ఆయన కొత్త పార్టీ విషయం మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' సెనేట్‌లో చర్చకు రాగానే ఈ విషయంపై స్పష్టత వచ్చింది. ఒక వేళ బిల్లు ఆమోదం పొందితే ఆ మరునాడే తన పార్టీ ఆవిర్భవిస్తుందని ఐదు రోజులక్రితమే మస్క్ ప్రకటించారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధికార రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి ట్రంప్‌కు ఆయనే ప్రధాన దాతగా వ్యవహరించారు. ఇటీవలికాలం వరకు ఆయనకు సన్నిహిత సలహాదారుడుగా వ్యవహరించారు. ప్రభుత్వంలో పొదుపు చర్యలకు నాయకత్వం వహించిన మస్క్ తర్వాత ట్రంప్ 'బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'ను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనివల్ల ఫెడరల్ బడ్జెట్‌లో ట్రిలియన్ డాలర్ల మేరకు తీవ్రమైన లోటు ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. చివరకు అమెరికా కాంగ్రెస్ ఉభయసభల్లో చాలా స్వల్ప తేడాతో ఈ బిల్లు గట్టెక్కి చట్టరూపం తీసుకుంది. ఈ బిల్లు కారణంగానే ఎలాన్ మస్క్–ట్రంప్ మధ్య విభేదాలు తారాస్థాయికి వెళ్ళి చివరకు ఇద్దరూ విరోధులుగా మారారు. ఐతే ట్రంప్ కూడా తీవ్రంగా స్పందిస్తూ, ప్రభుత్వం అనేక రాయితీలు, భారీ రుణాలు ఇవ్వబట్టే ఎలాన్‌మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించగలిగారని, మస్క్ కంపెనీలకు ఇచ్చిన సామూహిక కాంట్రాక్టులను తమ ప్రభుత్వం పునఃసమీక్షిస్తుందని ప్రకటించారు.

## అధికారం కోసం మతాల మధ్య బిజెపి మంటలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నరసింహ




ప్రజా పక్షం/హైదరాబాద్ : కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వంఅధికారం కోసం దేశ ప్రజల మధ్య మతం చిచ్చు పెడుతూ ఎంతకైనా బరితెగించి పరిపాలన సాగిస్తోంది సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి. నరసింహ ఆరోపించారు. సిపిఐ గౌలిపుర డివిజన్ 4వ మహాసభ జి.చంద్రమోహన్ గౌడ్ అధ్యక్షతన ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస హై స్కూల్లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈటి నరసింహ మాట్లాడుతూ దేశంలో మోడీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని దానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలే నిదర్శనమన్నారు. కుల,మత పూనాదులపై అధికార భవనాలు నిర్మించడం కొంతకాలం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తానంటే చైతన్యం నిండిన జనం చూస్తూ ఊరుకోరన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ ఇప్పటి వరకు ఎంఐఎం పార్టీ నాయకులపై ఎందుకు ఈడి,ఐటీ దాడులు చేయించలేదని ప్రశ్నించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రశ్నించే హక్కులను కాళ్ళరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్ మాట్లాడుతూ కారల్ మార్క్స్, లెనిన్‌ల ప్రభావం వల్ల భారత దేశంలో 1925 సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి నాటి నుండి నేటి వరకు బ్రిటిష్ పాలనను పారద్రోలి, నిరంకుశ నిజామును తరిమేసి, తెలంగాణ సాధన పోరాటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ గౌలిపుర డివిజన్ మాజీ కార్యదర్శి ఎన్ ఆర్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గౌలిపుర డివిజన్ పరిధిలోని వివిధ సమస్యపై ప్రజల పక్షాన నిలబడి పోరాటం చెయ్యాలని కోరారు. జి.చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం కార్యకర్తల, ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ మహాసభలో సిపిఐ నగర కౌన్సిల్ సభ్యుడు అటుకుల రాజు, పి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### గౌలిపుర డివిజన్ కార్యదర్శిగా గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ ఎన్నిక

సిపిఐ గౌలిపుర డివిజన్ కార్యదర్శిగా జి.చంద్రమోహన్ గౌడ్ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సహాయ కార్యదర్శులుగా అటుకుల రాజు, పి.సునీల్‌లను ఎనిమిది మంది సభ్యులతో కార్యవర్గం, 13 మంది సభ్యులతో నూతన కౌన్సిల్ ఏర్పాటు చేశారు.

## కార్మిక శాఖ మంత్రి వివేక్‌కు టిజిఒ ఘన సన్మానం




ప్రజా పక్షం/హైదరాబాద్ : కార్మిక ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామిని తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్ ఆదివారం మార్యదపూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా మంత్రివివేక్‌ను కృష్ణ యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కార్మిక ఉపాధిశాఖ మంత్రివివేక్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు(ఐటిఐ)లను బలోపితం చేయడానికి ఎనలేని కృషి చేస్తున్నారని కృష్ణ యాదవ్ ప్రశంసించారు.

## నీళ్లు ఎత్తిపోయాలా?

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాల్సింది పోయి మేడిగడ్డ, కల్వకుర్తి అంటూ ఇప్పటికీ రైతులను మోసం చేయాలని చూస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ అసమర్థత, నిర్లక్ష్యం, నిర్వాకం కారణంగానే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందన్నారు. గతంలో మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టిఎంసిలో దాదాపు 57 టిఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా అన్నారు. తాము కూడ కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా అన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

**కల్వకుర్తి లిఫ్ట్ ఎప్పుడు ఆన్ చేయాలో తెలుసు**

కల్వకుర్తి లిఫ్ట్ ఎప్పుడు ఆన్ చేయాలో తమకు తెలుసు అన్నారు. కల్వకుర్తి పంపులు ప్రతి ఏడాది జులై చివరిలో లేదా ఆగస్ట్ ఒకటో తేదీన స్విచాన్ చేసి వానాకాలం పంటలకు నీళ్లు అందిస్తారని,. ఈసారి కూడా అదే విధానం అమలవుతుందని తెలిపారు. అందులో రైతులు సందేహించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. 2019లో ఆగస్ట్ 11, 2020లో ఆగస్ట్ 31, 2021లో ఆగస్ట్ 15న, 2022లో జులై 13న, 2023లో ఆగస్ట్ 6న కల్వకుర్తి లిఫ్ట్ లు ఆన్ చేశారని, గత ఏడాది జులై 27న స్విచాన్ చేశామని గుర్తు చేశారు. రైతుల అవసరాలు, నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టుల నీటిని ఎప్పుడు విడుదల చేయాలి. ఎంత ఆయకట్టుకు ఇవ్వాలి.. ఈసారి ఎంత సమర్థంగా వాడుకోవాలనేది ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికైనా హరీష్ రావు అబద్ధాలు మాట్లాడటం మానుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హితవు పలికారు.

## 'గ్లోబల్ సౌత్'కు అన్యాయం

### బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

**రియో డీ జనీరో:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న దేశాలకు నిర్ణయం తీసుకునే జాబితాలో స్థానం దక్కడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత ఇలా ప్రతి విషయంలోనూ గ్లోబల్ సౌత్ దేశాలు బాధితులవుతున్నాయన్నారు. బ్రెజిల్‌లోని రియో డీ జనీరోలో నిర్వహించిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. భారత్ సహా బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. పర్యావరణ పరిరక్షణ, సాంకేతికత అభివృద్ధి తదితర అంశాలపై ప్రపంచ సంస్థల నుంచి గ్లోబల్ సౌత్ దేశాలకు కనీస సహకారం ఉండటం లేదన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు లేకుండా ఈ సంస్థలన్నీ సిమ్‌కార్డు ఉన్నా.. నెట్ వర్క్ లేని మొబైల్ ఫోన్ల లాంటివని వ్యాఖ్యానించారు. నేడు బహుళ ధ్రువ, సమ్మిళిత ప్రపంచం ఆవిష్కృతం కావాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి వంటి ప్రపంచస్థాయి సంస్థల్లో సమగ్ర సంస్కరణలతోనే ప్రారంభం కావాలి. బ్రిక్స్‌ను విస్తరించడం, కొత్త స్నేహితులను ఇందులో భాగస్వాములను చేయడం.. కాలంతో పాటు ఆర్గనైజేషన్ మారుతోందని చెప్పేందుకు నిదర్శనం. 20వ శతాబ్దం నాటి టైప్ రైటర్లతో 21వ శతాబ్దం నాటి సాఫ్ట్ వేర్ నడవదు. అలాగే, ప్రపంచస్థాయి సంస్థల్లో ఎప్పటికప్పుడు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. భారత్ ఎప్పుడూ తన సొంత ప్రయోజనాలకంటే మానవాళి ప్రయోజనాల కోసం పని చేయడాన్నే బాధ్యతగా భావిస్తుంది. బ్రిక్స్ దేశాలతో కలిసి అన్ని అంశాలపై నిర్మాణాత్మక సహకారం అందించేందుకు భారత్ పూర్తిగా కట్టుబడి ఉంది'అని మోదీ స్పష్టం చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com